SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume: 54, Issue: 6
NOVEMBER - 2023 Price Rs. 20/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

నవంబరు 2023
వెల రూ. 20/-
పుటలు-56





గజవాహనసేవ
(14-11-2023)

## తిరుచానూరు శ్రీపద్మావతీతాయార్ల బ్రహ్మోత్సవాలు

(10-11-2023 నుండి 18-11-2023 వరకు)


తిరుమల
శ్రీవారి పుష్పయాగమహోత్సవం
(19-11-2023)



# గీతాశ్లోకార్థసారం

**శ్లో :** తమువాచ హృషీకేశః ప్రహసన్నివ భారత।
సేనయోరుభయోర్మధ్యే విషీదన్తమిదం వచః॥

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-10వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** భారత= ఓ ధృతరాష్ట్రమహారాజా!; ఉభయోఃసేనయోః= రెండుసేనలయొక్క; మధ్యే= నడుమ; విషీదన్తమ్= దుఃఖించుచున్న; తమ్= ఆ అర్జునునిగూర్చి; హృషీకేశః= శ్రీకృష్ణుడు; ప్రహసన్నివ= నవ్వుచున్నవానివలె; ఇదం వచః= ఈ (చెప్పబోవు) వాక్యమును; ఉవాచ= పలికెను.

**భావం:** ఓ ధృతరాష్ట్రమహారాజా! రెండుసేనలమధ్య విలపించుచున్న అర్జునునిజూచి శ్రీకృష్ణుడు నవ్వుచున్నవానివలె ఈ (క్రింది) వాక్యములను పలికెను.

## ఇద్దరికీ... పేరుబలమొకటే!!


నెలమూఁడు శోభనాలు నీకు నతనికిఁదగు
కలకాలమును నిచ్చ కళ్యాణమమ్మా

రామనామమతనిది, రామవు నీవైతేను
చామనవర్ణమతఁడు, చామవు నీవు
వామనుఁడందురతని, వామనయనవు నీవు
ప్రేమపు (ం) (మీ!) యిద్దరికి పేరుబలమొకటే

హరి పేరాతనికి హరిణేక్షణవు నీవు
కరిఁగాచెఁదాను నీవు కరియానవు
సరి జలధిశాయి, జలధికన్యవు నీవు
బెరసి మీ యిద్దరికిఁ బేరుబలమొకటే

జలజనాభుఁడతఁడు జలజముఖివి నీవు
అలమేలుమంగవు, నిన్నలమెఁదాను
ఇలలో శ్రీవేంకటేశుఁడిటు నిన్ను రానమోచె
పిలిచి పేరుచెప్పెఁ బేరుబలమొకటే

(సం.07 - సంకీర్తన 280)





నిత్యకల్యాణమూర్తులై జగత్కళ్యాణకారకులైన అలమేలుమంగకు, వేంకటేశ్వరునకు పొంతనాలు, పేరుబలాలు బాగా కుదిరాయి. శ్రీవారు రామనామాంకితులు. అలమేలు మంగకూడ రామ (శుభస్త్రీ)లలో ఒకతె. శ్రీవారు చామనచాయమేనివాడు. ఆమెకూడ శ్యామాంగి. స్వామి వామనుడు. ఆమె వామనయన. స్వామియే హరి. ఆమె హరిణేక్షణ. స్వామి కరిని (ఏనుగును) రక్షించినాడు. ఆమె కరిగమన. స్వామి సముద్రంలో శయనించి ఉంటాడు. ఆమెకూడ సముద్రంలో ఉద్భవించింది. స్వామి పద్మనాభుడు. ఆమె పద్మముఖి. ఆమె అలమేలుమంగ. స్వామి ఆమె సౌందర్యాన్ని అలమి అలమి ఆస్వాదిస్తూ ఉంటాడు అని అన్నమయ్య పై కీర్తనలో కీర్తించాడు.

# హారతి

హైందవసంప్రదాయంలో దేవతార్చనలో అతిముఖ్యమైన అంశం- హారతి. ఏ దేవుడికైనా, ఏ దేవతకైనా అర్చనానంతరం తప్పనిసరిగా కర్పూరంతో హారతి ఇస్తారు. భగవంతునికి సమర్పించే షోడశోపచారాలలో(16) హారతి ఒకటి. హారతికే నీరాజనం అని మరోపేరు. 'నీరాజనం సమర్పయామి' అంటూ ఆ ఉపచారం చేస్తారు. భక్తులు హారతివెలుగులోనే గర్భగుడిలోని మూలవిరాట్‌రూపాన్ని దర్శించుకుంటారు. ఆ హారతినే భక్తి పూర్వకంగా కళ్లకద్దుకుంటారు. కేవలం కర్పూరంతోనేకాక వత్తులతోకూడా హారతిస్తారు. దానిని దీపహారతి అంటారు. దీపహారతికి ఎక్కువగా నెయ్యినే వాడతారు.

అథర్వణవేదంలో 27రకాల హారతివిధానాలున్నాయి. అవి నక్షత్రహారతి, నవగీతహారతి, ముత్యాల, పగడాల, రత్నాల హారతి, కుంభహారతి- ఇలా ఎన్నో ఉన్నాయి. అందులో కుంభ హారతి బ్రహ్మోత్సవాలలో ముగింపువేళలో ఇస్తారు. హారతిని ఇచ్చేటప్పుడు మంగళవాయిద్యాలను మ్రోగిస్తారు. ఆ సమయంలో శ్లోకాలను, స్తోత్రాలను పఠిస్తారు.

కర్పూరహారతికి ఒకప్రత్యేకత ఉన్నది. కారణం కర్పూరం ఔషధగుణాలను సంతరించుకుని ఉన్నది. దీని పొగ, వాసనలవల్ల శారీరక, మానసికరుగ్మతలు తొలగి ఆరోగ్యాన్నిస్తుంది. జలుబును తగ్గిస్తుంది. కంటిచూపును మెరుగుపరుస్తుంది. దాహాన్ని తగ్గిస్తుంది. అంటువ్యాధుల్ని వ్యాపించకుండా నివారిస్తుంది. సూక్ష్మక్రిములను నిర్మూలిస్తుంది. కాలుష్యాన్ని పోగొడుతుంది. దురదలను పోగొడుతుంది. ఆయుర్వేదంలో కర్పూరానిది పెద్ద స్థానం. హిమకర్పూరం, వర్ణకర్పూరం, శంకరావాసకర్పూరం, చీనాకర్పూరం, పచ్చకర్పూరం- ఇలా కర్పూరాలెన్నో రకాలున్నాయి. మనం వంటలలోకూడా కర్పూరాన్ని వాడతాం. హారతిని ఇస్తున్నప్పుడు దానినిచూస్తే మానసికప్రశాంతత కలుగుతుంది. ఏదో తెలియని హాయి ఆవరిస్తుంది. పూజారి హారతిస్తున్నప్పుడు భక్తులు గుడిలోని గంటలను మ్రోగిస్తూ తన్మయులౌతారు.

భగవంతునికే కాదు- మనుషులకికూడా దీపహారతిస్తారు. నిజానికి దీని ఉద్దేశం దిష్టి తీయడమే. పసిపిల్లలకు పుట్టినరోజు, బారసాల, స్నానానంతరం, కొత్తబట్టలు కట్టినప్పుడు ఇంకా పెళ్లికూతురిని, పెళ్లికొడుకుని అలంకరించినపుడు, ఇలా ప్రతివేడుకలోను హారతిస్తారు.

దేవునికి మేలుకొలుపులోను, పూజానంతరంలోను, పవళింపుసేవలోను హారతిస్తారు. హారతికి ప్రత్యేకమైన పాటలు కూడా ఉన్నాయి. వాటిని మంగళహారతులు అంటారు. దేవునికైనా, మనిషికైనా హారతిచ్చేటప్పుడు తప్పనిసరిగా స్త్రీలు పాటలు పాడుతారు. అది తమ భాగ్యంగా భావిస్తారు.

ఉత్తరభారతదేశంలో నదీమతల్లులకుకూడా మహాహారతినిస్తారు. అన్నిటికంటే ముఖ్యమైనది గంగాహారతి. నర్మదాదినదులకుకూడా హారతివ్వడం ఆనవాయితీయే. ఈ ఆచారాన్ని, సంప్రదాయాన్ని మనంకూడా ఆచరిస్తే మహోన్నతంగా ఉంటుందన్న ఆలోచన కలిగి తిరుమలతిరుపతిదేవస్థానం శ్రీతిరుచానూరులోని శ్రీపద్మావతీఅమ్మవారి పుష్కరిణికి కూడా నిత్యం మహాహారతినివ్వాలని సంకల్పిస్తోంది. ఇది మనందరికీ శుభప్రదమైన శుభాలోచనే కదా! అమ్మవారి వాహన సేవల్లో భక్తులు అమ్మవారికి దీపహారతి, కర్పూరహారతులు ఇస్తూ, అమ్మవారి కరుణాకటాక్షసిద్ధిని పొందుతుంటారు.



- డా|| పి.లలితవాణి,
98490 26107




తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 54 నవంబరు, 2023 సంచిక : 06


వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥


**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,



ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు

సప్తగిరి మాస పత్రిక

0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.

0877 2277777 / 2233333


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| **బ్రహ్మోత్సవ ప్రత్యేకం** | | |
| హారతి | డా॥ పి.లలితవాణి | 04 |
| అంకురారోపణం | శ్రీ యం.వి.యస్.రామశేషు | 07 |
| విశ్వజనని వాహనవైభవం | డా॥ ఎస్.పద్మావతి | 13 |
| ఓం కిరీటధారిణ్యై నమః | డా॥ ఎన్.సిహెచ్.సుధామైథిలి | 16 |
| పద్మసరోవరం మాహాత్మ్యం | డా॥ మైలవరపు లలితకుమారి | 21 |
| రథం - అంతరార్థం | శ్రీ ఐనవోలు మోహనాచార్యులు | 23 |
| శ్రీవైకుంఠం | శ్రీ చాకిచర్ల నాగసుదర్శనరావు | 25 |
| శ్రీపద్మావతీదేవి పెళ్లిసారె!! | శ్రీమతి దణ్యంరాజు జ్యోతిర్మణి | 31 |
| తీర్థాల్లో... పంచమీతీర్థరాజం!! | శ్రీమతి వావిలాల నాగవల్లి | 34 |
| **ధారావాహికలు** | | |
| సందేహాలు-సమాధానాలు | శ్రీమతి యం.గీతాకుమారి | 10 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 11 |
| తిరుమల సమయాచారములు | కీ.శే.డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే.శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 19 |
| శ్రీకృష్ణామృతం | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 39 |
| 108 దివ్యదేశాలు- 'తంజైమామణికోవిల్' | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 40 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే.మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>- కీ.శే.మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 47 |
| **ఆబాలగోపాలం** | | |
| శరవణభవ!! | శ్రీ దేవులపల్లి భాస్కరరామశర్మ | 09 |
| బిల్వపత్రం | శ్రీ ఎల్. ప్రఫుల్లచంద్ర | 15 |
| దివ్యదీపావళి | డా॥ దేవులపల్లి పద్మజ | 20 |
| శుకయోగీంద్రుడు | డా॥ పులిగడ్డ విజయలక్ష్మి | 33 |
| స్వామిసేవలో... ఫణిరాజు | శ్రీ కల్లూరు గురుప్రసాద్ | 36 |
| ఆనందం! బ్రహ్మానందం!! | శ్రీ కాశీరాజు వేంకటేశ్వరరావు | 43 |
| కరివేప | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 44 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 45 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 54 |
| **యువవాణి** | | |
| శ్రీకృష్ణుని పలుకుల్లో.. వ్యక్తిత్వవికాసం | శ్రీ చెళ్ళపిళ్ళ సన్యాసిరావు | 18 |
| మోహనాశమే మోక్షహేతువు | శ్రీ ఎం.రవితేజ | 37 |
| భారతంలో ఉపాఖ్యానాలు | ఆచార్య ఉగ్రాణం చంద్రశేఖరరెడ్డి | 38 |
| **బాలబాలికలవాణి** | | |
| లేనివాడు ఏమీ లేనివాడు (వేమనశతకం) | కీ.శే.విద్వాన్ కట్టానరసింహులు | 46 |
| సుజ్ఞాని- అజ్ఞాని (భాస్కరశతకం) | శ్రీ మారవి వెంకయ్య | 46 |
| పద్మవ్యూహం (చిత్రకథ) | కథ: శ్రీ డి.శ్రీనివాస దీక్షితులు<br>చిత్రాలు: శ్రీ కె.తులసీప్రసాద్ | 48 |
| బాలవినోదం | | 50 |
| నేను మాట తప్పను!! (నీతికథ) | డా॥ కడప లలిత | 52 |
| క్విజ్ | | 53 |


ముఖచిత్రం : శ్రీపద్మావతీఅమ్మవారి గజవాహనసేవ, తిరుచానూరు
వెనుకచిత్రం : శ్రీపద్మావతీఅమ్మవారి పంచమీతీర్థం, తిరుచానూరు




ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# లక్ష్మీమంత్రధ్యానంతో దర్శిద్దాం!!

**అజ్ఞానతిమిరం హంతు, శుద్ధజ్ఞాన ప్రకాశికా।**
**సర్వైశ్వర్య ప్రదామేఽస్తు, త్వత్కళామయి సంస్థితా॥ (లక్ష్మీహృదయం. అథర్వణవేదం)**

ఓ జగదేకమాతా! అజ్ఞానమనే చీకటిని పారద్రోలే శుద్ధమైన జ్ఞానమనే ప్రకాశినివి నీవే! అలాంటి అనంతమైన నీ తేజంలోని ఒకానొకకళను నాయందు ప్రవేశపెట్టుము అని నిన్ను ప్రార్థిస్తున్నాను తల్లీ! తద్వారా సర్వవిధాలైన సమస్తైశ్వర్యాలను ప్రసాదించడంతోపాటు నన్ను సంపూర్ణంగా అనుగ్రహించి దర్శనమిమ్ము!

'లక్ష్మీ' అంటే లాభం, ప్రయోజనం, సంపద, అభివృద్ధి, క్షేమం, యోగం అని ఋగ్వేదవాక్కు. విశిష్టమైనవస్తువుల్లో నిండి నిబిడీకృతమై ఉన్న తేజస్సు- ఓజస్సు- వర్చస్సు ఇవన్నీ శ్రీమహాలక్ష్మీతత్త్వమే! రూపమే! ఇలా సమస్తచరాచరవిశ్వమంతా శ్రీమహాలక్ష్మీస్వరూపమేనని లక్ష్మీదేవి కీర్తింపబడింది.

'లక్ష్మ' అంటే గుర్తు లేదా చిహ్నం. లక్ష్మగా భాసిస్తుంటుంది గనుక ఆ జగన్మాతకు 'లక్ష్మీ' అని పేరు. అవ్యయుడై ప్రకాశిస్తున్న శ్రీమన్నారాయణుని అవ్యాజమైన 'దయ'కు గుర్తుగా నిలిచింది. అనంతుని అనంతమైనకరుణకు చిహ్నంగా వెలుగొందుతోంది. సత్యమై, నిత్యమై, శాశ్వతమై భాసిస్తున్న అచ్యుతుని ఆనందానికి గుర్తుగా ప్రకాశిస్తోంది. సాక్షాత్తు శ్రీమహావిష్ణుభగవానుని వక్షఃస్థలంలో 'శ్రీవత్సం' అనే చిహ్నంగా భాసిస్తూ, ఆ స్వామివారి అద్భుతమైన, ఆశ్చర్యకరమైన, అమృతత్త్వమైన, అనంతమైన, అప్రమేయమైన దయాగుణానికి, క్షమాగుణానికి, ప్రతీకగా చిరస్థాయిగా, అనపాయినియై నిలిచి ఉంది. కనుక, ఆ జగన్మాత 'లక్ష్మీ' అని వేనోళ్ల కీర్తింపబడుతోంది. అలాగే భూలోకంలోని ప్రతిఇంటా గృహస్థులకు గృహిణులైన పుణ్యస్త్రీలరూపంలోనూ, యజమానులకు సంపదరూపంలోనూ, ఇంట్లోని మంగళకర, పవిత్ర, శుభకరాలైన సమస్తవస్తువులయందు ఆవేశించి ఒకానొక తేజోరూపంగా భాసిస్తుంటుందని పురాణాలవాక్కు.

అలాంటి లక్ష్మీదేవిరూపంలో తిరుచానూరులో కొలువైఉన్న అలమేలుమంగమ్మకు అత్యంత వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. అందులో వివిధరకాలవాహనాల్లో అమ్మవారు కొలువై తిరుమాడవీథుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. అలా ఆ వాహనసేవలను దర్శించి తమ తమ ఇళ్లకు బయలుదేరుతారు భక్తులందరూనూ. అలా విచ్చేసినవారిని ఇరుగుపొరుగువారు దర్శనం బాగా జరిగిందా? అని అడగడం ఆనవాయితీ. ఆ మాటలకు ఆహా! అమ్మవారి మూలమూర్తిదర్శనం, వాహనసేవలో ఉత్సవమూర్తిదర్శనం చాలా బాగా జరిగాయి. మా జన్మ ధన్యమైంది అని తిరిగి చెప్పడంకూడా ఒక ఆనవాయితీనే. కానీ, అలా చెప్పడానికికూడా వీలులేని అలౌలికస్థాయిలో మనముండాలి. నోటిమాటగా ఏదో చెప్పడం వృథామాటలే కానీ దర్శనసిద్ధి ఏ మాత్రమూ కలగదనే చెప్పొచ్చు. మనం అమ్మవారిని దర్శించినప్పుడు తదేకదీక్షతో అమ్మవారినే చూస్తూ పై తెల్పిన మంత్రాన్ని పఠిస్తూ దర్శించాలి. అప్పుడే మనకు దర్శనఫలసిద్ధి, మోక్షసిద్ధి కల్గుతాయి. అంతేగానీ, బ్రహ్మోత్సవాలకు వెళ్లామా..! చూశామా..! వచ్చామా...!! అనికాకుండా అమ్మవారి పై మంత్రరాజాన్ని పఠిస్తూ దర్శిద్దాం. అమ్మవారి అపారకరుణాకటాక్షాలు పొందుదాం.

**రండి! దర్శించండి!! అమ్మవారి అనుగ్రహాన్ని పొందండి!!**

# అంకురారోపణం

- శ్రీ యం.వి.యస్.రామశేషు, 99089 92602



మాతర్నమామి! కమలే! కమలాయతాక్షి
శ్రీవిష్ణుహృత్కమలవాసిని! విశ్వమాతః ।
క్షీరోదజే కమల కోమల గర్భగౌరి
లక్ష్మీ! ప్రసీద సతతం నమతాం శరణ్యే॥

అన్న భక్తులప్రార్థనలతో విశ్వమాత అయిన పద్మావతీదేవి కార్తికబ్రహ్మోత్సవాలు తిరుచానూరులో ప్రారంభమౌతాయి. నిత్యోత్సవమూర్తులైన దేవతామూర్తులకు జరిపే గొప్ప ఉత్సవాలకే "బ్రహ్మోత్సవాలు" అని పేరు.



సాక్షాత్తు శ్రీమహావిష్ణువు హృదయనివాసిని అయిన విష్ణుశక్తియే శ్రీమహాలక్ష్మి. కలియుగంలో భక్తరక్షణకై స్వామి భూలోకాన శ్రీవేంకటేశ్వరునిగా అవతరించాడు. అమ్మ పద్మావతిగా అవతరించింది. జీవులు సుఖశాంతులతో జీవించాలంటే లక్ష్మీకృపా కటాక్షం అవసరం మరి. పరమాణువునుండి పరమాత్మవరకు గల సమస్తసృష్టిలో కొలువై ఉంటుంది సిరులతల్లి శ్రీమహాలక్ష్మి.

"ప్రకృతిలో కొలువైన అష్టశక్తులే అష్టలక్ష్ములై ఈ విశ్వాన్ని నడిపిస్తున్నాయి, పోషిస్తున్నాయి". జగత్తును పోషించే తల్లికి జరిపే బ్రహ్మోత్సవ దర్శనమే పుణ్యప్రదమైనది.



అమ్మవారు ఆవిర్భవించిన మాసం కార్తికమాసం. అందువల్ల ఈమాసంలో కార్తికబ్రహ్మోత్సవాలు అన్నపేరున అమ్మవారిజన్మతిథి పంచమినుండి తొమ్మిది రోజులు జరుగుతాయి. బ్రహ్మోత్సవాలు ఆరంభించటానికి ఋత్విక్కులు అందరూ కలసి అంకురారోపణకార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఏ కార్యానికైనా ముందుగాచేసే పనిని అంకురారోపణం అంటారు. దేశంలో ఎక్కడా జరగనివిధంగా తిరుమల తిరుపతిదేవస్థానంవారు పద్మావతిఅమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. అంకురారోపణఘట్టంలో అంకురారోపణం చేస్తే తరువాత జరిగే కార్యక్రమమంతా శుభంగా, సుఖంగా జరుగుతుందని ఒక నమ్మకం. మనుషులు చేసే శుభకార్యాలకే అంకురారోపణం చేస్తే, భగవంతుని కార్యాలకెంత గొప్పగా చేయాలో కదా! మరి. అంకురారోపణంలో అంకురమంటే మొలక అనీ, ఆరోపణమంటే ప్రారంభమని అర్థం.

ఈ అంకురార్పణమే బ్రహ్మోత్సవాల్లో ప్రధానఘట్టం. అందులో మృత్సంగ్రహణం విశేషమయినది. అందుకై ముందుగా విష్వక్సేనఆరాధనం చేసి, అమ్మవారిని మృత్తికాసంగ్రహణానికి ప్రార్థించి అర్చకులందరూ విష్వక్సేనుని ముందుంచుకుని బయలుదేరుతారు. అమ్మవారిఆలయంవద్ద ఉన్న శుక్రవారపుతోటలో ఈశాన్యపుదిశలో ఉన్న పుట్టవద్దకెళ్ళి, ఆ పుట్టమన్నును వెదురుబుట్టలోకి సేకరిస్తారు. అపుడా పుట్టమన్నుతో నిండినబుట్టను అర్చకవర్యులు శిరసుపై పెట్టుకొని మోస్తూ ఆలయానికి ప్రదక్షిణపూర్వకంగా నడిచి ఆలయప్రాంగణంలోకి ప్రవేశిస్తారు. ఆ తర్వాత ఆ మట్టిని పూజించి, దానికై ఐదుపాలికలు

(మట్టి మూకుడును పాలిక అంటారు) తీసుకుని మట్టిని మెత్తగా చేసి పసుపుకుంకుమలతో అలంకరించి, ఆవుపాలతో శుద్ధిచేసిన పాలికలలో సర్దుతారు. ఆ తరువాత ఆ మూకుళ్ళని తెల్లని దారంతో పైనుండి క్రిందివరకు అనేకపోగులతో చుడతారు. పాలికను భూమాతగా, పైన కట్టినదారాలు నాగలికొసలుగా భావించవచ్చు. అలా అలంకరించిన పాలికలలో పోసిన మట్టిలో మంత్రోచ్చారణలతో ఆవుపాలతో తడిపిన నవధాన్యాలను చల్లుతారు. ఉత్సవాలు ముగిసేనాటికి అవి నిండుగా మొలకెత్తి కన్నులపండువుగా ఉంటాయి. ఆ పాలికలలో వేసిన విత్తనాలు ఎంతత్వరగా, ఎంతఏపుగా పెరిగితే అంతటి అభివృద్ధి జరిగి, దేశం సుభిక్షంగా ఉంటుందని అర్చకుల, భక్తుల నమ్మకం.

ఈ నవధాన్యాలు నవగ్రహాలకు ప్రతీక. ఇందులో సూర్యగ్రహానికి గోధుమలు, చంద్రగ్రహానికి బియ్యం, కుజగ్రహానికి కందులు, బుధగ్రహానికి పెసలు, గురుగ్రహానికి శనగలు, శుక్రగ్రహానికి బొబ్బర్లు, శనిగ్రహానికి నువ్వులు, రాహుగ్రహానికి మినుములు, కేతుగ్రహానికి ఉలవలు అధీన ధాన్యాలని జ్యోతిష్యశాస్త్రం చెప్తోంది. మానవులు తమకేమైనా ఇబ్బందులు, ఆపదలు కలిగినపుడు వారు ఏ గ్రహప్రభావం చేత వారికాపదలు సంభవించాయో ఆ గ్రహాన్నర్చించి, ఆ



గ్రహానికి సంబంధించిన ధాన్యాన్ని దానమిస్తే శుభాలు కలుగుతాయట. అంతేకాక వీటిలో ఎన్నో ఔషధగుణాలున్నాయి. అందువల్ల వీటన్నింటినీ సమపాళ్ళలో తీసుకుంటే శరీరానికి అవసరమైన పోషకాలు సమృద్ధిగా అందుతాయని ఆయుర్వేదంలో చెప్పబడింది. అంతేగాక ఈ నవధాన్యాలను దైవకార్యాల్లో, శుభకార్యాల్లో ఆవుపాలతో తడిపి పాలికలలో వేస్తారు. అలా అన్నిధాన్యాలను కలిపివేస్తే నవగ్రహాలకు శాంతి కలుగుతుందని ఒక నమ్మకం. అలా, అన్నీకలిసి పెరిగినట్లుగా మనుష్యులమధ్య బంధాలు బలపడి ప్రేమాభిమానాలు పెరుగుతాయని పెద్దలనమ్మకం. ఈ విధంగా నవధాన్యాలు మనుష్యుల కలయికలకు నిదర్శనంగా చెప్పవచ్చు.

పంచపాలికలు పంచభూతాలకు ప్రతీకలుగా చెప్పవచ్చు. ఎందుకంటే జీవుడు సుఖజీవనం చెయ్యాలన్నా, నాటిన విత్తులు ఏపుగా ఎదగాలన్నా పంచభూతాల సహకారం అవసరం కదా! మానవశరీరాన్ని పాలికగా భావిస్తే అరిషడ్వర్గాలను విడిచిపుచ్చి, ప్రేమ, మనస్సు, బుద్ధి, దయ, భక్తి అనే పుష్పాలతో అమ్మను అర్చిస్తే ఆ మనిషి జీవితం శోభాయమానంగా వెలుగొందుతుంది.

శుభకార్యాలను ఆరంభించటానికి అంకురారోపణమే ప్రధానం. అమ్మవారి బ్రహ్మోత్సవాలసమయంలో చేసే ఈ అంకురారోపణంతో జగత్తంతా కరువుకాటకాలబారిన పడకుండా, పాడిపంటలతో, ధనధాన్యాలతో, సుఖసంపదలతో, సత్సంతాన సౌభాగ్యంతో విలసిల్లుతుందని ఋత్విక్కుల నమ్మకం.

ఈ విధంగా అంగరంగవైభవంగా అమ్మవారి బ్రహ్మోత్సవాలకు అంకురారోపణం జరుగుతుంది. ఈ కార్యక్రమమంతా వైభవంగా సేనాధిపతి విష్వక్సేనులవారి పర్యవేక్షణలో జరగడం గొప్ప విశేషం. పంచతత్త్వస్వరూపి ఐన అమ్మవారిని నిత్యమూ పూజిస్తే కోరిన కోరికలు సిద్ధిస్తాయి. అటువంటి చల్లనితల్లిని బ్రహ్మోత్సవాల్లో దర్శించి, పూజిస్తే జన్మజన్మలకు తమ అభీష్టసిద్ధి కలుగుతుందని, పాపాలు పటాపంచలు అవుతాయని భక్తుల నమ్మకం కాబట్టి దర్శించి తరిద్దాం.

పంచతత్త్వ స్వరూపేచ పంచాచార సదారతే ।
సాధకాభీష్టదే దేవీ ధనదాయై నమోస్తుతే ॥



అసంభవమైన గొప్ప వాగ్దానం కంటే చిన్న చిన్న మంచిపనులు మెరుగైనవి




# శరవణభవ!!

- శ్రీ దేవులపల్లి భాస్కరరామశర్మ, 92907 30792

**శక్తిహస్తం విరూపాక్షం శిఖివాహన షడాననం**
**దారుణం త్రిపురోగఘ్నం భావయే కుక్కుటధ్వజం!!**

సుబ్రహ్మణ్య అనేపదానికి సంస్కృతభాషలో బ్రహ్మజ్ఞానాన్ని తెలుసుకున్న ఉత్తముడు అని అర్థం. ఈయనను స్కందుడు, క్రౌంచధారణుడు, కుమారస్వామి, కార్తికేయుడు, శరవణభవుడు మొదలైననామాలతో కొలుస్తారు. భగవద్గీతలోని విభూతియోగంలో శ్రీకృష్ణుడు "సేనానీ నామహం స్కన్ద" అనగా "సేనానులలో స్కందుడను నేనే" అని చెప్పడంద్వారా ఈయన విష్ణ్వాంశసంభూతునిగాను, వైష్ణవమతానికి చెందినవాడుగాను పేర్కొనవచ్చు. శివకేశవులకు బేధంలేదని చెప్పటానికి సుబ్రహ్మణ్యస్వామి ప్రత్యక్షనిదర్శనం. స్కందపురాణంలో కార్తికేయుని వివరణ వర్ణించబడింది. మార్గశిరశుద్ధషష్ఠితిథిని సుబ్రహ్మణ్యషష్ఠి అని వ్యవహరిస్తారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడు మనశరీరంలోని కుండలినీశక్తికి సంకేతం. కుండలిని అనేది ఒక అద్భుతమైన శక్తి. ఇది మానవ శరీరంలో వెన్నుపాములో దాగి ఉంటుంది. మూలాధారంలో దాగిఉన్న ఈ కుండలినీశక్తి సుషుమ్నానాడిద్వారా పైకి సహస్రారంవరకు తీసుకువెళుతుంది. మానవశరీరంలోని స్థితిశక్తి పామువలె చుట్టచుట్టుకుని మూలాధారంవద్ద నిద్రాణంగా ఉంటుంది. యోగసాధనద్వారా ఈ నిద్రాశక్తిని ఉత్తేజపరచినపుడు ఊర్ధ్వముఖంగా పయనించి, షట్చక్రాల్లోని ఒక్కొక్కచక్రాన్నీ దాటుతూ తల మాడుభాగాన ఉండే సహస్రారచక్రాన్ని చేరుతుంది. ఈ స్థితిలో సాధకునికి ఒక అనిర్వచనీయమైన ఆనందం కలుగుతుంది. 'శరవణభవ' అనే ఆరు అక్షరాల మహామంత్రం జీవుణ్ణి తరింపచేసి, కుండలిని జాగృతపరుస్తుంది. పాముపుట్ట మన శిరస్సుపై ఉన్న బ్రహ్మరంధ్రాన్ని సూచిస్తుంది. కుండలినీశక్తి జాగృతమైనపుడు మనశరీరంలోని జ్ఞానధార ప్రవహిస్తుంది. ఇది మనం పుట్టలోపోసే పాలకు సంకేతం. ఈ కుండలినీశక్తిని కలిగి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరుడు, జాగృతమైన సర్పము ఒకేపోలిక కలిగి ఉన్నకారణంగా స్వామివారిని సర్పరూపంలోకూడా ఆరాధిస్తారు.

సుబ్రహ్మణ్యస్వామిలో జ్ఞాన, వైరాగ్య, బల, కీర్తి, సంపద, దైవశక్తి అనే ఆరులక్షణాలు కనబడతాయి. స్వామివారి ధ్వజమైన కోడిపుంజు(కుక్కుటము) ఉదయించేజ్ఞానాన్ని మరియు ప్రకాశాన్ని సూచిస్తుంది. తామసలక్షణాలైన అహంకారం, గర్వం, దాంబికం మొదలైన లక్షణాలకు ప్రతీక ఐన నెమలిని అధిరోహించటంద్వారా, వాటిని అదుపుచేసే శక్తిసమన్వితుడుగా కొలువబడుతున్నాడు.

"శరవణభవ" అనికూడా స్వామివారిని కీర్తిస్తారు. ఈ నామంలోని అక్షరాల ప్రాముఖ్యత: 'శ' ప్రజాకర్షణశక్తికి, 'ర' సౌభాగ్యానికి, 'వ' శారీరకసమస్యలపరిష్కారానికి, 'ణ' శత్రునాశనానికి, 'భ' జీవితమాధుర్యానికి, 'వ' దుష్టశక్తుల నిర్మూలనానికి సంకేతంగా పేర్కొంటారు. ఈయన ఆయుధం పేరు 'శక్తి'. దీనినే వేలాయుధం అనికూడా పిలుస్తారు.

పరమేశ్వరవాహనమైన నందీశ్వరుడు అగస్త్యమహర్షికి ప్రసాదించిన స్కందకుమార అష్టోత్తరాన్ని భక్తిశ్రద్ధలతో పఠించిన వారి సమస్యలన్నీ తొలగిపోతాయని స్కందపురాణం చెప్తోంది.

**ఆపద్బాంధవ సుబ్రహ్మణ్యం అనాథరక్షక సుబ్రహ్మణ్యం**
**సద్గురునాథ సుబ్రహ్మణ్యం ఓం గురునాథ సుబ్రహ్మణ్యం**
**పార్వతీపుత్ర సుబ్రహ్మణ్యం పరమదయాళు సుబ్రహ్మణ్యం**
**సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం షణ్ముఖనాథ సుబ్రహ్మణ్యం**

# సందేహాలు



# సమాధానాలు

- శ్రీమతి యం.గీతాకుమారి

**ప్ర) భాగవతంలో భక్తి ఎన్నివిధాలుగా చెప్పబడినది? ఏ భక్తిరీతిద్వారా ఎవరెవరు మోక్షం పొందారు?**

**జ)** శ్రవణం కీర్తనం విష్ణోః
స్మరణం పాదసేవనం
అర్చనం వందనం దాస్యం
సఖ్యమ్ ఆత్మనివేదనమ్

అని నవవిధభక్తులు భాగవతంలో చెప్పబడ్డాయి. అవి 1)శ్రవణం-పరీక్షిత్తు 2)కీర్తనం-శుకమహర్షి 3)స్మరణం-ప్రహ్లాదుడు 4)పాదసేవనం-లక్ష్మీదేవి 5)అర్చనం-పృథుమహారాజు 6)వందనం-అక్రూరుడు 7)దాస్యం-ఆంజనేయుడు 8)సఖ్యం-అర్జునుడు 9)ఆత్మనివేదనం-బలిచక్రవర్తి. ఈ విధంగా ఒక్కొక్కరు ఒక్కొక్క భక్తిమార్గంతో భగవంతుని సేవించి ముక్తి పొందారు.

**ప్ర) శ్రీకృష్ణుడు గురువు సాందీప మహర్షికి గురుదక్షిణ చెల్లించుకున్న విధం చెప్పండి?**

**జ)** శ్రీకృష్ణుడు సాందీపమహర్షివద్ద విద్యాభ్యాసానంతరం గురుదక్షిణ చెల్లించుకోవటానికి తనకు అనుమతి ఇవ్వాల్సిందిగా కోరాడు. అందుకు ప్రభాసతీర్థంలో తప్పిపోయిన తమ కుమారుణ్ణి గురుదక్షిణగా తెచ్చివ్వుమని కోరింది గురుపత్ని. ప్రభాస తీర్థంలో సముద్రస్నానం చేస్తుండగా గురుపుత్రుని పాంచజన్యుడు అనే రాక్షసుడు అపహరించుకుపోయాడని తెలుసుకున్న శ్రీకృష్ణుడు అతనితో పోరాడి, సంహరించి గురుపుత్రుని తీసుకొచ్చి గురుపత్నికి గురుదక్షిణగా సమర్పించాడు.

**ప్ర) పౌండ్రకవాసుదేవుడు ఎవరు?**

**జ)**పౌండ్రకవాసుదేవుడు కరూసదేశాధిపతి. ఇతడు శ్రీకృష్ణునికికూడా వాసుదేవుడనే పేరుందని తెలుసుకుని లోకంలో ఇద్దరు వాసుదేవులుండరని, తానొక్కడే వాసుదేవపరమాత్మనని అనుకుంటుండేవాడు. అంతేకాక అతనివద్దఉన్న స్వార్థపరులు కొందరు ఆతనిచేత విష్ణుమూర్తివలె శంఖచక్రాదులను ధరింపజేసి స్తుతించేవారు. ఆ పొగడ్తలకు మురిసిపోయిన పౌండ్రకవాసుదేవుడు అహంకారంతో శ్రీకృష్ణునితో నీవు శంఖచక్రాలను విసర్జించు. లేదంటే తనతో యుద్ధానికొస్తే శ్రీకృష్ణుని యమునివద్దకు పంపిస్తానని దూతచేత రాయబారం పంపాడు. అందుకు శ్రీకృష్ణుడు ఏ చిహ్నాలనైతే నన్ను విసర్జించమన్నాడో యుద్ధంలో అతణ్ణే అంతం చేస్తానని కబురంపాడు. రాయబారి ఆ మాటల్ని పౌండ్రకవాసుదేవునికి చెప్పాడు. ఆ మాటలను విని పౌండ్రకుడు శ్రీకృష్ణునితో యుద్ధంచేసి చివరకు శ్రీకృష్ణునిచేతనున్న చక్రాయుధంచే సంహరింపబడ్డాడు.

**ప్ర) గుణములు ఎన్ని? అవి ఏవి?**

**జ)** గుణములు మూడు. అవి సత్త్వగుణం. రజోగుణం. తమోగుణం.

**ప్ర) పురుషార్థాలు అంటే ఏమిటి?**

**జ)** పురుషార్థాలు నాలుగు. అవి 1)ధర్మం 2)అర్థం 3)కామం 4)మోక్షం.

**ప్ర)పంచభూతాలు అని వేటిని అంటారు?**

**జ)** భూమి, నీరు, నిప్పు, వాయువు, ఆకాశం అనే ఈ ఐదింటిని పంచభూతాలు



**ప్ర) షట్చక్రవర్తులు ఎవరెవరు?**

**జ)** హరిశ్చంద్రుడు, నలుడు, పురుకుత్సుడు, పురూరవుడు, సగరుడు, కార్తవీర్యుడు అనువారు షట్చక్రవర్తులు..

**ప్ర) ఏడుగురు చిరంజీవులు ఎవరు?**

**జ)** బలిచక్రవర్తి, పరశురాముడు, హనుమంతుడు, విభీషణుడు, వ్యాసుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ అనువారు ఏడుగురు చిరంజీవులు.

**ప్ర) అష్టసిద్ధులు పేర్లేమి?**

**జ)** అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశిత్వం, వశిత్వం అనునవి అష్టసిద్ధులు.

**ప్ర) శ్రీమహావిష్ణువు ఆయుధాలెన్ని? వాటిపేర్లేమి?**

**జ)** మహావిష్ణువు ఆయుధాలు నాలుగు. అవి 1)శంఖం-పాంచజన్యం 2)చక్రం-సుదర్శనం 3)ధనుస్సు-శార్ఙ్గం 4)ఖడ్గం-నందకం.

**ప్ర) మహాభారతానికిగల మరోపేరేమి?**

**జ)** మహాభారతాన్ని పంచమవేదమని, జయము అనికూడా అంటారు.

**ప్ర) గురుపూర్ణిమ ప్రాధాన్యత ఏమిటి?**

**జ)** వ్యాసమహర్షి వేదాలను నాలుగు విభాగాలుగా విభజించాడు. అవి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం అధర్వణవేదం. ఆ రోజు వ్యాసుడి పుట్టిన రోజు. ఆయన అందరికీ గురువు గనుక ఆ రోజుకి గురుపూర్ణిమ అనిపేరు.

**ప్ర) త్రిమూర్తులు ఎవరెవరు?**

**జ)** సృష్టి, స్థితి, లయకారకులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను త్రిమూర్తులు అంటారు.

**ప్ర) త్రిపథగ అని ఏ నదికి పేరు?**

**జ)** స్వర్గలోకం, భూలోకం, పాతాళ లోకములైన మూడులోకాల్లో ప్రవహించే గంగానదిని త్రిపథగ అంటారు.

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



### గత సంచిక విశేషార్థం..

శ్రీహరి శ్రీనతితో వేంకటాద్రికి విలాసంగా తచ్చాడుతూ అక్కడి రమణీయ కత్వానికి ముగ్ధుడై సంచరిస్తున్నాడు. ఆ సంచారవేళ ఒకవృద్ధుని చూశాడు. అతనిపట్ల శ్రీహరికి అవ్యాజమైన కరుణ కలిగింది. అతడెవరో ఆ వృద్ధునిపట్ల అకారణకరుణావీక్షణమెందుకో మీకు సవివరంగా చెబుతాను. ఈ కథను జాబాలి నాకు చెప్పాడని సూతుడు ఉప క్రమణిత చేశాడు.

శౌనకాదిమహామునులార! ఈవేళ నేను జాబాలిముని చెప్పిన 'కుమారధార మహిమ' గురించి చెబుతాను.

మీకు లోగడ తిరుమల పవిత్రతీర్థా లకు నిలయమని చెప్పాను. ఆ తీర్థాలలో 'కుమారధార' ఒకటి. కుమారస్వామి స్వామిపుష్కరిణీతీరంలో మాత్రం కాదు. 'కుమారధార'గా పిలువబడే తీర్థంతోను కుమారస్వామికి సంబంధముంది. ఎడ తెగక పవిత్రోదకాలతో పడే ధారాప్రాంతంలో కుమారస్వామి కొంతకాలం నివసించి ఉండవచ్చు. అంతేకాదు, ఒక వృద్ధుడు ఈ ధారలో స్నానంచేసి కుమారుడయ్యాడట. సామాన్యులు ఊహించలేని మహిమ ఇది.

తిరుమల అరణ్యప్రాంతం. అంతే కాదు అనేకపర్వతశిఖరాలతో అందంగా కనిపించే ప్రదేశం. ఇలాంటి ప్రదేశానికి ఈ ప్రాంతంతో పరిచయంలేనివాడు వేరే ప్రాంతంవాడు వచ్చాడు. అతడేమో ముదు సలి. పైగా బలహీనుడు. తప్పిపోయిన కుమారుని వెదుక్కుంటూ కుమార'కౌండిన్య' అంటూ అన్వేషణ సాగిస్తున్నాడు. అయినా అతనికి కుమారుడు కనబడలేదు. అయినా నడకసాగిస్తూ వేంకటాద్రిమార్గంలో సంచ రిస్తూఉంటే ఒకవైపు ఆకలికి అల్లాడుతూ మరోవైపు కుమారుడు కునబడలేదే అనే ఆందోళనతో నడక తడబడుతూ ఉంటే తూలుతూ నేలబడ్డాడు. అయినా ఆ ముదుసలి తన చివరిదశలోనైనా కుమా రుడు కనబడతాడేమోనని ఏరా కౌండిన్య! ఎక్కడున్నావురా? ఎక్కడికెళ్ళావురా? అంటూ వాత్సల్యంతో కేకలు వేయ సాగాడు. ఇలాంటి వ్యక్తి దుర్దశను ఎవరూ పట్టించుకోకపోయినా ఆదిదేవుడు, దీనరక్ష కుడు పట్టించుకున్నాడు. తానే, ఆ వృద్ధుని ముందు ప్రత్యక్షమయ్యాడు.

'ఓ ముసలివాడా! కాకులు దూరని కారడవి. చీమలు దూరని చిట్టడివికి ఎందుకు వచ్చావు. అయినా, నీకు జన సత్వాలుడిగిపోయినా బ్రతకాలని ఉందా? నీ ఉద్దేశ్యమేమిటో చెప్పు' అన్నాడు. అప్పుడా ముసలిబ్రాహ్మణుడు 'మీరెవరో నాకు తెలియదు. ఏకాకిని అయిన నన్ను పలుకరించారు. మీరు పుణ్యాత్ములు. నాకు నా శరీరరక్షణపై ఆసక్తిలేదు. అయినా ఋణం తీర్చుకోకుండా మరణిస్తున్ననే చింత నన్ను కాల్చేస్తున్నది. ఇదే నా బాధ అన్నాడు.

స్వామి ఓపికగా ఆ ముసలివాని ఆంతర్యం అర్థం చేసుకొన్నాడు. ముసలిని మరోసారి చూచి చేయిపట్టుకొని మెల్లగా లేపి నడిపిస్తూ పావనతీర్థందగ్గరికి చేర్చాడు. తీర్థజలం చూస్తూండగానే ముసలివానికి హాయిగా తన ఆవేదన అంతా తీరేలా స్నానమాడాలనిపించింది. ఆ ధారలో హాయిగా స్నానం చేశాడు. స్నానం చేస్తుంటే తన శరీరంలో ఏదో మెరుపులాంటి మార్పు చోటు చేసుకోవడం గుర్తించాడు.

స్నానం పూర్తయ్యేసరికి ముసలివాడు పడుచువాడయ్యాడు. ఈ వింతకు ఆశ్చర్య పడిపోతూ నలువైపుల చూడసాగాడు ఆ కుమారుడు, ఎదురుగా స్వామి. ఆపద మొక్కులవాడు, అనాథరక్షకుడు, కోరికలు తీర్చేవాడు, కొంగుపసిడి అయిన స్వామి విశ్వరూపుడై కనిపించాడు. వేయికళ్లతో, వేయిపాదాలతో, వేయితలలతో, వేయి బాహువులతో స్వామి సాక్షాత్కరించగనే దేవదుందుభులు మ్రోగాయి. దేవతానీకం పూలవాన కురిపించింది. తమ ఆనందాన్ని స్తోత్రరూపంలో సువ్యక్తం చేసింది. అంతే కాదు ఆ స్వామి కుమారాకారం ధరించిన

వృద్ధుని చూచి 'నీవు పేదవాడవని కుంగిపోకు. నీవు అపారధన వంతుడవు అవుతావు. దేవఋణం తీర్చుకోలేకపోయానని బాధపడవద్దు. దగ్గరలో ఉన్న ఆశ్రమానికి వెళ్లు. యాగం చేయి' ఆ కోరికకూడా తీరుతుంది అన్నాడు. ఆపై అంతర్ధానమయ్యాడు ఆ స్వామి.

ఆ బ్రాహ్మణుడుకూడా దగ్గరి ఆశ్రమానికి వెళ్లాడు. ఆయాచిత ధనసమృద్ధితయాగం పూర్తిచేశాడు.

ఈ వింతలు విశేషాలు దర్శించిన దేవతలు ఆనందంతో 'ఈ తీర్థంలో స్నానమాడడంవల్లకదా గడగడవణకే బ్రాహ్మడు వయోభారంతో కుంగిపోయినవాడు దైవకార్యం పూర్తి చేయాలనే సంకల్పంతో బతికినవాడు సుజలధారలో సుస్నానం చేయడంవల్ల బాలకుమారుడయ్యాడు కదా! ఈ తీర్థం లోక ప్రఖ్యాతం కావలె' అనే సంకల్పంతో 'ఎవరైతే జితేంద్రియులై మూడుమాసాలు మూడువేళలు స్నానం చేస్తారో అలాంటివారు వజ్రదేహులవుతారు. అలాంటివారికి వార్ధక్యమంటూ ఉండదు' అని నిర్ణయరూపమైన వరానుగ్రహం చేశారు.

ఈ వింతలన్నీ జాబాలి చెప్పగా ఆ వృత్తాంతాన్నే మీకు చెప్పానని సూతుడు విశదం చేశాడు. ఇదొక్కటే కాదు. వాల్మీకి మహర్షి నాకు ఒక శంఖణుడనే రాజు కథ చెప్పాడు. ఆ కథ కూడా మీకు చెబుతాను. వినండి.

శంఖణుడు చంద్రవంశపురాజు. అయినా కాలవశాన అతడు రాజ్యాధికారాన్ని నిలబెట్టుకోలేకపోయాడు. నిస్సహాయు డయ్యాడు. చివరికి విరోధులు దండెత్తి శంఖనుడి రాజ్యాన్ని లోబరుచుకొన్నారు. తలదాచుకోవడానికి చోటులేక. తన రాజ్యంలో ఉండలేక శంఖణుడు అడవిదారి పట్టాడు. పుణ్య తీర్థాల సందర్శనోత్సాహంతో అడుగులు వేశాడు.

రామేశ్వరం చేరుకొన్నాడు. రామసేతువులో మునిగాడు. ఆపై దారిలో ఎన్నో క్షేత్రాలు సందర్శించుకొంటూ తిరుచానూరు చేరుకొన్నాడు. సువర్ణముఖిలో స్నానం చేశాడు. ఆ నదీతీరంలోని పద్మసరస్సులోకూడా మునకలు వేశాడు. అయినా అతనికి శాంతి కలుగలేదు. ఏదో చెప్పలేని వ్యథ.

'నా రాజ్యాన్ని శత్రువులు ఆక్రమించారు. నేను విరోధులబలాన్ని కట్టడి చేయలేకపోయాను. ఓడిపోయాను. నాకున్న సర్వసంపదలు వదలిపెట్టి ఒంటరిగా నగరం వదలి వచ్చేశాను. అన్నీ ఒకప్పుడున్నా ఈనాడు ఏకాకినయ్యాను. ఉదరపోషణమార్గం కనపించలేదు. చివరకు కట్టుకోవడానికి తగినన్ని వస్త్రాలు లేకపోయె. రాజభోగాలు అనుభవించిన నాకు ఈ దుర్గతి వస్తుందని కలలోకూడా ఊహించలేకపోయా. ఇంకా నాకేది గతి' అంటూ అంగలార్చసాగాడు. ఈ దుఃఖం నిదరలేని నిదురావస్థలో పడితే అశరీరవాణి 'నిర్మలాత్మక! ఎందుకు దైన్యంగా విలపిస్తున్నావు. ధైర్యం కోల్పోవద్దు. చింత వద్దు. ఈ ప్రదేశానికి ఉత్తరంలో క్రోశదూరంలో 'వేంకటాద్రి' ఉంది. నీవు ఆ అద్రి చేరుకో. ఆ అద్రి సామాన్యమైనది కాదు. చింతలు తీర్చే చింతామణి. అక్కడి స్వామిపుష్కరిణిని దర్శించు. మూడు వేలు ఆ పుష్కరిణిలో స్నానమాడు. స్వామిని షోడశోపచారా లతో పూజ చెయ్యి. ఆ స్వామి అనుగ్రహిస్తాడు' అని పలికింది.

శంఖణుడు ఆ అశరీరవాణి చెప్పినప్రకారం వేంకటాద్రి చేరాడు. స్వామి పుష్కరిణిని దర్శించాడు. ఆ పుష్కరిణిలో స్నానం చేశాడు. అశరీరవాణి చెప్పినట్లుగా పూజలు చేశాడు. సదా సర్వావయవ సుందరాకారుడైన శ్రీనివాసునిధ్యానంలో ముని గాడు. శంఖణునినిష్ఠకు స్వామి కరుణించాడు. సాక్షాత్కరిం చాడు. దేవతలు దేవదుందుభులు మ్రోగించారు. పూలవానలు కురిశాయి. నృత్యగీతాదులు కనులవిందు చేస్తుండగా శంఖణుడు స్వామితో 'దేవదేవ! దీనరక్షక! జగన్నాయక! నన్ను కరుణతో చూడు స్వామి. నీవే మా పూర్వజులకు రాజ్యభోగాలిచ్చావు. కరుణతో కాపాడావు. నేను ఆ రాజ్యాన్ని నిలబెట్టుకోలేక పోయాను. కాలవశాన అన్నీ పోగట్టుకొన్నాను. నేను ఇప్పుడు సామాన్యుణ్ణి స్వామీ! నా శత్రువులను శిక్షించు. నా రాజ్యం నాకు ప్రసాదించు' అని దయనీయంగా వేడుకొన్నాడు.

'స్వామీ! శంఖణా! ఎందుకు బాధపడుతున్నావు. నీ రాజ్యం నీకు దక్కుతుంది. భార్యాసమేతుడవై నీవు మరల పట్టాభిషిక్తుడవు అవుతావు' అని అనుగ్రహించి అంతర్ధాన మయ్యాడు. ఆపై శంఖణుడా కొండ దిగి తన రాజ్యం కేసి వెళ్లాడు.

ఆ రాజ్యాధిపతులు అన్యోన్యకలహాలతో హతులయ్యారు. ఆ దేశప్రజలు రాజ్యధికారి లేక వెదకుతూ శంఖణుని గుర్తించి తమకు రాజు కావలెనని అర్థించారు. శంఖణుడు శ్రీవేంకటేశ్వర ప్రసాదంతో కాంభోజరాజ్యాధిపతి అయ్యాడు అని సూతుడు ముగించాడు.

*(ఇంకా ఉంది)*

**10-11-2023 నుండి 18-11-2023 వరకు**
**తిరుచానూరు శ్రీపద్మావతీదేవివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా...**

# విశ్వజనని వాహనవైభవం

*- డా॥ ఎస్.పద్మావతి, 96762 69300*



జగజ్జనని శ్రీపద్మావతీదేవి కార్తికమాసం శుక్లపంచమీతిథినాడు ఆవిర్భవించింది గనుక అమ్మవారిబ్రహ్మోత్సవాలు ప్రారంభ మౌతాయి. ఇందులో ఉదయం మరియు రాత్రి వివిధవాహనాలపై తిరువీథులలో ఊరేగుతూ అమ్మవారు భక్తులను కటాక్షి స్తుంది. గజధ్వజారోహణంతో పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు మొదలవు తాయి. అవి:



**చిన్నశేషవాహిని పద్మాక్షీ!**
**చిన్మయరూపిణి పద్మాక్షీ!**

బ్రహ్మోత్సవాల్లో మొట్టమొదటిది చిన్న శేషవాహనం. ఆ లక్ష్మీదేవి అంశయైన పద్మా వతీదేవి ఇక్కడ శేషవాహనంపై విహరిస్తూ పాలకడలిలో శేషశాయికి తాను పాదసేవ చేస్తున్నట్లుగా భావిస్తూ భక్తుల ఆటపాటలకు ఆనందిస్తూ సాగుతుంది.



**పెద్దశేషవాహిని పద్మాక్షీ!**
**పెరుమాళ్ళదేవేరి పద్మాక్షీ!**

రెండవది పెద్దశేషవాహనం. శేషుని శిరస్సులోవలె మనుషుల్లో నిలువెల్లా ఉండే పాపాలు అనే విషాన్ని హరించి భక్తుల్ని పునీతుల్ని చేస్తూ ఆనందిస్తూ సాగుతుంది అమ్మవారు.



**హంసవాహిని పద్మాక్షీ!**
**హంసనివారిణి పద్మాక్షీ!**

రెండోరోజురాత్రి హంసవాహనంపై వీణాపాణియై వాణీరూపంలో దర్శనమిస్తుంది. సకలవిద్యలకూ, కళలకూ అధిదేవత సరస్వతీ దేవిగా హంసవాహనంపై విహరిస్తున్న పద్మా వతిఅమ్మవారు భక్తులకు గొప్పవివేకంతో విద్యావంతులు, కళాకారులు అవ్వాలని ఆశీర్వదిస్తుంది.

**ముత్యాలపందిరిక్రింద పద్మాక్షీ! మురిపాలదేవి పద్మాక్షీ!**

మూడోనాటి ఉదయం ముత్యాలపందిరిలో ఆసీనురాలై శ్రీపద్మావతీదేవి ఆ ముత్యాల స్వచ్ఛతనూ, చల్లదనాన్నీ ఆస్వా దిస్తూ తన భక్తులలో కల్మషాలు తొలగి మేలిముత్యాలవంటి



స్వచ్ఛమైనమనస్సులు కలిగి శాంతచిత్తులై సంతోషంగా, ఉత్తమంగా జీవించాలని ఆశీ ర్వదిస్తూ ముందుకు సాగుతుంది.



**సింహవాహిని పద్మాక్షీ! నరసింహకామిని పద్మాక్షీ!**

మూడోనాటి రాత్రి సింహవాహనం అధిరోహించి విహరిస్తూ, నాయకత్వానికీ, బలానికీ, దర్పానికీ చిహ్న మైన అమ్మవారు శిష్టులను ప్రసన్నవదనంతో అనుగ్రహిస్తుంది.



**కల్పవృక్షవాహిని పద్మాక్షీ! కామితవరదాయిని పద్మాక్షీ!**

నాలుగవరోజుఉదయం దేవి కోరినకోర్కెలు తీర్చే కామితార్థప్రదా యిని కల్పవృక్షవాహనంపై అధిరో హించి భక్తుల ధర్మబద్ధమైన, న్యాయ బద్ధమైన కోర్కెలు తీరేలా ఆశీర్వ దిస్తుంది.



**హనుమంతవాహిని పద్మాక్షీ!**
**హరియంతరంగిని పద్మాక్షీ!**

నాలుగోరోజురాత్రి అమ్మవారు హనుమద్వాహనం అధిరోహించి విహ రిస్తూ భక్తులకు బలం, ధైర్యం, జ్ఞానం, అణకువ, నీతినిజాయితీలను అను గ్రహిస్తుంది.

**పల్లకివాహిని పద్మాక్షీ!**

**పరమదయామయి పద్మాక్షీ!**



ఐదోరోజు ఉదయం లక్ష్మీఅంశ అయిన పద్మావతీదేవి పల్లకీలో విహరిస్తూ శిష్టులకు ఐశ్వర్యానందాలు అనుగ్రహిస్తుంది.



**గజరాజవాహని పద్మాక్షీ! ఘనమగుదేవి పద్మాక్షీ!**

ఐదోరోజురాత్రి అమ్మవారు గజవాహనం అధిరోహించి విహరిస్తూ శిష్టులకు ఐశ్వర్యాన్నీ, గజంవంటి అణకువను, సద్బుద్ధినీ అనుగ్రహిస్తుంది.

**సర్వభూపాలవాహని పద్మాక్షీ!**

**సర్వజనసేవిత పద్మాక్షీ!**



ఆరోరోజుఉదయం జగజ్జనని శ్రీపద్మావతీదేవి సర్వభూపాలవాహనంపై విహరిస్తూ ప్రభువులు ధర్మసమ్మతమైన, న్యాయబద్ధమైన, నిస్వార్థమైన పాలన సాగించాలనీ, శిష్టులకు ఎప్పుడూ ఎవ్వరి వల్లనూ ఏ సమస్యరాకుండా ఉండాలనీ, శిష్టులు నిర్భయంగా, నిశ్చింతగా, ప్రశాంతంగా ఉండగలగాలని ఆశీర్వదిస్తుంది.



**గరుడవాహని పద్మాక్షీ!**

**చిరుదరహాసిని పద్మాక్షీ!**

ఆరోరోజురాత్రి అమ్మవారు గరుడ వాహనంపై విహరిస్తూ నిజమైన నిశ్చల భక్తితో ఉన్న భక్తులను ఆశీర్వదిస్తుంది

**సూర్యప్రభవాహిని పద్మాక్షీ!**

**ఆరోగ్యదాయిని పద్మాక్షీ!**



ఏడోరోజు ఉదయం పద్మావతీదేవి సూర్యప్రభవాహనంపై విహరిస్తూ శిష్టులైన భక్తులకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సద్బుద్ధి, సుజ్ఞానం కలిగేలా అనుగ్రహిస్తుంది.

**చంద్రప్రభవాహిని పద్మాక్షీ!**

**చంద్రసహోదరి పద్మాక్షీ!**



ఏడోనాటిరాత్రి అమ్మవారు చంద్రప్రభవాహనంపై విహరిస్తూ ఆ చల్లదనాన్ని, హాయినీ ఆస్వాదిస్తూ సజ్జనులకు సుఖశాంతులు, ఆయురారోగ్యైశ్వర్యానందాలు కలిగేలా అనుగ్రహిస్తుంది.



**రథమున ఊరేగు పద్మాక్షీ!**

**మనోరథమీడేర్చు పద్మాక్షీ!**

ఎనిమిదోనాడుఉదయం పద్మావతీదేవి రథమున ఊరేగుతూ భక్తుల ఆటపాటలతో ఆనందిస్తూ సజ్జనులందరికీ సకలసంపదలు, విజయాలు కలిగేట్లు అనుగ్రహిస్తుంది.


**అశ్వవాహిని పద్మాక్షీ! విశ్వపాలిని పద్మాక్షీ!**



ఎనిమిదోరోజురాత్రి అమ్మవారు అశ్వవాహనంపై విహరిస్తూ, మనుషులకు కోరికలను అదుపులో పెట్టుకునే నిగ్రహశక్తిని ఇచ్చి; ముఖ్యమైన, న్యాయబద్ధమైనకోరికలు నెరవేరేలా అనుగ్రహిస్తుంది.

**పంచమీతీర్థం పద్మాక్షీ! పరమపవిత్రం పద్మాక్షీ!**

తొమ్మిదోరోజుఉదయం అమ్మవారి చక్రస్నానం జరుగుతుంది. ఇది పంచమిరోజు జరుగుతుంది. చక్రస్నానసమయంలో



ఆ చల్లటిజలాలలో స్నానమాడుతూ అమ్మవారు అలసట తీర్చుకొని జనులకు పాపాలు, హృదయదోషాలు తొలగి చిత్తశుద్ధి, ఆయురారోగ్యాలు కలిగేలా ఆశీర్వదిస్తుంది.

ఈ విధంగా వివిధవాహనసేవలతో తిరుచానూరు పద్మావతీఅమ్మవారి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా, నేత్రపర్వంగా జరుగుతాయి. ఈ ఉత్సవవేడుకల్లో అమ్మవారిని దర్శించినవారిజన్మ ధన్యమేధన్యం.

*శ్రీపద్మావతీదేవ్యై నమోస్తుతే!!*



ఇతరులు మనం చెప్పినట్లు చేయాలని ఆశించడమే మనం చేసే మొదటితప్పు

**30-11-2023న**

**తిరుపతి, శ్రీకపిలేశ్వరస్వామివారి లక్షబిల్వార్చన సందర్భంగా...**



# బిల్వపత్రం

**– శ్రీ ఎల్. ప్రఫుల్లచంద్ర, 6300546700**

బిల్వపత్రం పరమశివునికి ప్రీతికరం. మారేడుదళంని సంస్కృతంలో బిల్వపత్రం అంటారు. శివలింగార్చనతో కూడిన శివపూజకు అత్యంత శ్రేష్ఠమైనది. శివార్చనలో మారేడు ప్రాముఖ్యత వహించింది. ఈ ఆకులతో పరమశివుణ్ణి పూజించడం పరిపాటి. ఈ బిల్వపత్రం అపురూపమైనది. ఈ చెట్టున ఉన్న ఆకులు విశిష్టఆకారంలో ఉంటాయి. మూడుఆకులు ఒకేసమూహంలో ఉంటాయి. దీనినే బిల్వపత్రం అంటారు. అలనాడు భక్తకన్నప్ప మారేడుదళాలతో శివుణ్ణి పూజించి మోక్షప్రాప్తి పొందాడు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో కాళము, హస్తి శివపూజలో బిల్వపత్రాలు అలంకరించి మోక్షప్రాప్తి పొందాయి.

*“త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రంచ త్రియాయుధం త్రిజన్మపాప సంహారం ఏకబిల్వం శివార్పణం”*

ఈ శ్లోకం శివస్తుతిలో బహుళప్రాచుర్యం పొందింది. శివపురాణంలో బిల్వపత్రం విశిష్టత వివరించబడి ఉంది. పరమపవిత్రమైన ఈ బిల్వపత్రంతో శివుణ్ణి పూజించడంవల్ల కలిగే ఫలం చాలా గొప్పది. బిల్వపత్రం లేదా మారేడుదళం ఆకులు ఎండినాకూడా పూజకు ఉపయోగిస్తారు.

కోటిఏనుగుల దానఫలం, నూరు యజ్ఞాలఫలం, కోటి కన్యాదానాలవల్ల కలిగేఫలం ఈ బిల్వపత్రం శివపూజకు సమర్పించడంవల్ల మనకు సదరు ఫలం సిద్ధిస్తుంది అని ప్రతీతి.

*“అఖండ బిల్వపత్రేణ పూజితే నందికేశ్వరే శుధ్యంతి సర్వపాపేభ్యో ఏకబిల్వం శివార్పణం”*

సకలపాపాలనివారణకు ఈ బిల్వపత్రం ఒక్కటి చాలు అని చెప్తోంది శివపురాణం.

ఒకసారి పరమశివుడు పార్వతిదేవితో కలసి భూలోకంలో వనవిహారం చేస్తుండగా అక్కడున్న వృక్షాల్లో మారేడువృక్షం పార్వతిదేవికి కనిపించిందట. ఆ చెట్టుఆకులు వింతగా కనిపించాయట. ఆ ఆకుల్ని పార్వతిదేవి చేతుల్లోకి తీసుకోగానే ఆకు నమస్కారం చేస్తూ... “అమ్మా పార్వతిదేవీ! నా జన్మ తరించింది నీ స్పర్శతో” అందట. ఏమైనా వరం కోరుకో అని అడిగిందట. అందుకు బిల్వపత్రం ఆకుగా పుట్టాను, ఆకుగా పెరిగాను. ఈ జన్మను సార్థకమయ్యేలా చూడు తల్లీ అని వేడుకొందట. అందుకు పార్వతిదేవి సరేనని వరం ప్రసాదించిందట. అప్పటినుంచి శివస్తుతి, శివారాధనపూజకు తప్పనిసరి అయింది బిల్వపత్రం. పార్వతి ప్రసాదించిన వరం సార్థకమైంది. కైలాసనాథుడు ఎక్కువగా ఇష్టపడే వృక్షం మారేడువృక్షం. సకలశుభాలు ఇచ్చే మారేడువృక్షం పరమశివునికి ప్రీతికరం.

## 2023, డిసెంబరునెల ఉత్సవాలు, పర్వదినాలు

- **10** శ్రీధన్వంతరిజయంతి
- **12** తిరుమల శ్రీవారిసన్నిధిన అధ్యయనోత్సవారంభం
- **17** ధనుర్మాసం ప్రారంభం
- **23** వైకుంఠఏకాదశి, గీతాజయంతి
- **24** శ్రీస్వామిపుష్కరిణితీర్థముక్కోటి
- **26** శ్రీదత్తజయంతి
- **28** తిరుమల శ్రీవారిసన్నిధిన ప్రణయకలహమహోత్సవం

# ఓం కిరీటధారిణ్యై నమః

- డా॥ ఎన్.సి.హెచ్.సధామైథిలి, 82475 78748



కిరీటమంటే తలమీద ధరించే ఆభరణం. దీనికే మకుటం అని మరోపేరు. కిరీటమనేది చక్రవర్తులు వారి శక్తి మరియు గౌరవాలకు చిహ్నంగా తలకు ధరించే అలంకార, సాంప్రదాయరూపం. సంప్రదాయికంగా కిరీటాలు దేవతలు, రాజులు ధరిస్తారు. వీరిలో కిరీటాన్ని ధరించడం అధికారం, వారసత్వం, అమరత్వం, సత్ప్రవర్తనం, గెలుపు, గౌరవానికి సంకేతంగా భావిస్తారు.

పట్టాభిషేకమంటే మహారాజు తన పెద్దకుమారునికి (యువరాజు) రాజ్యనిర్వహణబాధ్యతలను అప్పగించడం. దీనికి చిహ్నంగా రాజమకుటాన్ని అలంకరింపజేయడం, సింహాసనం అధిరోహించడం, ఖడ్గాన్ని బహుకరించడం మొదలైనవి ఘనంగా జరిపిస్తారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని పట్టాభిషేకం అంటారు. ఈ పదం సాధారణంగా భౌతికకిరీటాన్ని మాత్రమేకాకుండా, కిరీటప్రదానంచేసే మొత్తం వేడుకను సూచిస్తుంది. రాజ్యాధికారంతోపాటు రాజలాంఛనాలప్రకారం ఇతరవస్తువులను ప్రదర్శించడంతోపాటు, అధికారశక్తితో ఒక చక్రవర్తి అధికారిక సమూహాన్ని సూచిస్తుంది. పట్టాభిషేకంవేడుకలో, సార్వభౌమాధికారి తన తలపై కిరీటాన్ని స్వీకరించడంద్వారా అన్ని రాజ్యాధికారాలు సంక్రమిస్తాయి. కిరీటం ధరించటమంటే అధికారం బాధ్యతలు స్వీకరించదానికి ముఖ్యచిహ్నంగా పరిగణించబడుతుంది.

కిరీటం ఉద్దేశ్యం ఎల్లప్పుడూ దానిని ధరించే వ్యక్తిని ఉన్నతీకరించడమే. వజ్రం దేవతలచే ఎన్నుకోబడిన చిహ్నంగా ఉంది. సమాజంలో కిరీటంమంటే శ్రేష్ఠత్వమనే భావనతో ముడిపడి ఉంది. పురాణాలుకూడా దేవతలను, చక్రవర్తులను మరియు ప్రముఖవ్యక్తులను తలపై వివిధరకాల లోహపు ఆభరణాల అలంకరణలు, బంగారుహారాలు మరియు తలపాగాలతో చిత్రీకరించాయి. కిరీటం లేదా తలపాగా, రాజశక్తికి చిహ్నంగా మారింది. అలాగే వివాహాలు మరియు సింహాసనాన్ని అధిరోహించడంవంటి వేడుకలలో ఒక అనివార్య లక్షణంగా మారింది. తలపై ఆభరణాలు ప్రత్యేకమైనశైలిలో తయారుచేసేటప్పుడు అనేక గొప్పరాళ్లను ఉపయోగించి విలువైనలోహాలతో మాత్రమే కిరీటాలను తయారుచేసేవారు.

చాలా కిరీటాలు ఖరీదైన బంగారం, వెండిలోహాలతో తయారుచేయబడి రత్నాలు పొదగబడి ఉంటాయి. హిందూ పురాణాలప్రకారం పురుషులు ధరించే ఆభరణాల్లో ముఖ్యమైంది కిరీటం. పూర్వకాలంలో వీటిని ప్రత్యేకంగా రాజులు ధరించేవారు. బంగారుకిరీటం ధరించడంవల్ల దేహం తేజోమయమౌతుంది. నిరంతరం చురుకుదనం ఉంటుంది. అలాగే అపారమైన విజ్ఞానంతోపాటు దైవత్వాన్నికూడా పొందుతారు. కిరీటంలో ఉండే విలువైనరాళ్లప్రభావంతో దేవతలు ప్రసన్నమవుతారు.

కిరీటాలు చాలారకాలు. శ్రీరామచంద్రమూర్తి పెట్టుకునే కిరీటం చాలా ఘనంగా ఉంటుంది. ఒక సార్వభౌముడు పెట్టుకునే కిరీటం ఎత్తుగా ఉండి దానిమీద పడగలు మొదలైనవి ఉంటాయట. అమ్మవారు పెట్టుకునే కిరీటం చాలా శోభాయమానంగా ఉంటుంది. అమ్మవారికిరీటంగురించి శంకరాచార్యులవారుకూడా ఘనంగా వర్ణించారు.

కురువింద మణిశ్రేణీ కనత్కోటీర మండితా ।

అన్ననామం నోటితో పలకడంవల్ల పసుపుపచ్చని బంగారుకిరీటంలో ఎర్రటిమణిని పెట్టుకుని ఉన్నదన్నభావనతో మనం మనసుతో చూడగలిగితే ఫలితం వస్తుందని అమ్మవారు ఆనాడు వసువు మొదలైన దేవతలతో చెప్పించినది. కిరీటం అధికారంలో ఉన్న హద్దులను చెబుతుంది.

గతైర్మాణిక్యత్వం గగన మణిభిస్సాంద్ర ఘటితం
కిరీటం తే హైమం హిమగిరి సుతే కీర్తయతియః।
స నీడే యచ్ఛాయాచ్ఛురణ శబలం చంద్రశకలం
ధను శ్శౌనాసీరం కిమితి న నిబధ్నాతి ధిషణాం॥

'అమ్మవారు కిరీటం ధరించింది. ఆ కిరీటానికి పొదగబడిన మణులుగా భాసిల్లుతున్నారు ఆకాశంలోని ఆదిత్యులు పన్నెండుమంది. ఆ కిరీటంపై నెలవంక ఉన్నది. ఆ నెలవంక కూడా అష్టమినాటి చంద్రునిలా కనిపిస్తుంటుంది. అష్టమినాటి చంద్రుడు అనడమంటే ఏ విధమైన వికారాలూ లేనివానిగా చెప్పడమే. కిరీటానికి ఉన్న బంగారంపై, చిక్కగా మణులుగా పొదగబడిన ఆదిత్యులయొక్క కాంతి ఆ చంద్రునిపై ప్రసరించడంవల్ల చిత్రవర్ణాలు కనిపిస్తున్నాయి'.

ధ్యానంలో అమ్మవారికిరీటాన్ని చూస్తున్న సాధకునికి ఆ వర్ణాలు ఇంద్రధనుస్సులాగా కనిపిస్తున్నాయట. ఎవరైతే అమ్మవారికిరీటాన్ని ధ్యానిస్తారో వారు ఆ చిత్రవర్ణాలను ఇంద్ర ధనుస్సులుగానే భావిస్తారని (భ్రమిస్తారని) శంకరుల భావన. ఒకసూర్యుడే అగ్నిగోళంగా భాసిస్తున్నసమయంలో ఆయనకు ఆశ్రయమిచ్చేవారే కరువయ్యారు. ఆ సమయంలో పన్నెండు మంది ఆదిత్యులను అమ్మగాక భరించగలిగేవారెవరు? ఇంద్రుడు, ధాత, పర్జన్యుడు, త్వష్ట, పూష, ఆర్యముడు, భృగుడు, వివస్వంతుడు, విష్ణువు, అంశుమంతుడు, వరుణుడు, మిత్రుడు వీరే 'ద్వాదశాదిత్యులు'. అందుకే, అమ్మవారే వారిని తన కిరీటంలో మణులుగా చేసుకొని తలపై చంద్రవంకను అలంకరించుకున్నది. ఆ చంద్రునిపై ప్రతిబింబించిన సూర్యుల తేజస్సు ఇంద్రధనుస్సును తలపింపచేస్తున్నది. ఈ అద్భుత సన్నివేశాన్నే దర్శించారు భగవత్పాదులు. 'లలితాసహస్ర నామాల'లో 'కురువింద మణిశ్రేణి కనత్కోటీర మండితా' అని ఒక నామం ఉన్నది. అది అమ్మవారు ధరించిన కిరీటాన్ని వర్ణిస్తున్నది. కురువిందాలు, పద్మరాగమణులచేత ప్రకాశించే కిరీటాన్ని ధరించింది అమ్మవారు. కామం, అనురాగం మొదలైన గుణాలను 'కురువిందం' అంటారు. 'రావణగంగ' అనే నదీ తీరంలో ఈ మణులు దొరుకుతాయని చెబుతారు. ఇవి స్వచ్ఛమైన కాంతి కలిగినవి, అరుణవర్ణంలో ఉంటాయని ప్రతీతి.

మనసుకు ఆహ్లాదాన్నిస్తూ, అమ్మపట్ల అనురాగాన్ని పెంచుతూ, సాధనలో ఉన్నతస్థితిని కలిగించేందుకు ఈ మణులను ధ్యానంలో దర్శించాలని సాధకులు చెపుతారు. ఇవి సుప్తావస్థలో ఉన్న బుద్ధిని తేజస్వంతం చేస్తూ చైతన్యపరుస్తాయి. ఇక్కడ 'కామం' అనగానే కామగుణంగా తీసుకోరాదు. ఆధ్యాత్మిక సాధకునికి అమ్మలో లయం కావడమే ఉన్నతమైన కోరిక. అదే సమున్నతసంకల్పం. అదే జ్ఞానసాధన, ఆచరణ. ఈ బుద్ధిని ప్రచోదన చేసి ముందుకు తీసుకెళ్ళేవి కురువిందాదిమణులు. శుద్ధస్ఫటికాలచేత వ్యక్తమయ్యే కాంతి కాబట్టి, సప్తవర్ణాలలో ప్రకాశిస్తుంది. దానిని చూసిన సాధకుడు అది ఇంద్రధనుస్సుగా భ్రమిస్తాడని చెబుతారు. సాధకుడు సాధనలో పరిశుద్ధ మనస్కుడైన పిమ్మట ఆ తేజస్సు ఇంద్రియాలను ప్రకాశవంతంగా చేస్తాయని చెబుతారు. లలితాపరాశక్తికి అభేదరూపమైనదీ.. బంగారుపద్మంపై ఆసీనయైనదీ, సమస్తభూమండలానికి నాయిక అయినదీ, దేవాదులకు దయ జూపునదీ, శార్ఙ్గమను ధనుస్సును ధరించిన విష్ణుమూర్తికి ప్రియముకూర్చునదీ అయిన లక్ష్మీదేవి సకలాభరణాలతో అలంకరింపబడి, వీటితోపాటుగా రజిత, స్వర్ణ, వజ్రకిరీటాలను ధరించి, సమస్తభూమండల నాయికయై విరాజిల్లుతోంది. ఇటువంటి విశేషకిరీటధారణలో కొలువైన అమ్మవారిని చూడటం 'సాలోక్యస్థితి'. అమ్మవారిని తానుగా భావించడం 'సారూప్యస్థితి'. అమ్మవారిని సమీపించడం 'సామీప్య స్థితి'. అమ్మవారిలో లయమవడం 'సాయుజ్యస్థితి'. ఈ నాలుగు స్థితులూ ముక్తిని ప్రసాదించే మార్గాలు. ఇందులో ఒకదానికన్నా మరొకదానిని ఉన్నతంగా భావిస్తారు. అమ్మవారిని ధ్యానించడంవల్ల చివరిదైన 'సాయుజ్యం' ప్రాప్తిస్తుందని చెబుతారు. మరో ముఖ్యాంశం దేవతలను వర్ణిస్తున్నప్పుడు తల నుండి పాదాలవరకు, మనుషులను పాదాలనుండి తలవరకు వర్ణించడం సంప్రదాయం. శంకరుల ఆంతర్యాన్ని అర్థం చేసుకొని, ఆ మార్గంలో సాధనకు కావలసిన బుద్ధిని ప్రసాదించాల్సిందిగా అమ్మవారిని ప్రార్థిద్దాం.

# శ్రీకృష్ణుని పలుకుల్లో.. వ్యక్తిత్వవికాసం

– శ్రీ చెల్లపిళ్ళ సన్యాసిరావు

కురుక్షేత్రసంగ్రామంలో.. అర్జునుడు శోకం, మోహం, అహంకారం, పిరికితనం, కర్తృత్వం ఆపాదించుకొనే సందర్భంలో శ్రీకృష్ణుడిలా అన్నాడు. అలాంటివి పనికి రానివని, అనర్థాలను తెస్తాయని, వాటికి దూరంగా మసులుకోవడం శ్రేయస్కరమని, అవి వ్యక్తిత్వాన్ని సంకు చితపరుస్తాయని, స్వార్థాన్ని పెంచుతాయని, పక్షపాత బుద్ధిని కలిగిస్తాయని, వ్యక్తివికాసానికి అడ్డు కలిగిస్తాయి కాబట్టి వాటిని వెంటనే తొలగించుకోవాలన్నాడు.

జయాపజయాలు, సుఖదుఃఖాలు, లాభనష్టాల వంటివి ఎదురైనప్పుడు చలించకూడని మనస్తత్వాన్ని కలిగిఉండాలని, వాటిని సరిసమానంగా స్వీకరించే వ్యక్తి త్వాన్ని కలిగిఉండాలని, అలాగే సంతోషం కలిగినప్పుడు పొంగిపోవడం, దుఃఖం కలిగినప్పుడు క్రుంగిపోవడం కూడదన్నాడు.

ఎవరికివారే మిత్రులని, శత్రువులని గ్రహిం చాలి. ఎవరి జీవితాలను వారే చక్కదిద్దుకోవాలి. ఉద్ధ రించుకోవాలి. కామక్రోధలోభాలు మూడున్నూ, నర కానికి తెరచినద్వారాలు. వాటినుండి అంతర్వాహినులుగా అనేక దురవస్థలు పుట్టి మనిషిని పతనావస్థకు దిగజారు స్తాయి. వ్యక్తిత్వానికి, వికాసానికి వికృతరూపాల్ని కలి గించి భంగపరుస్తాయి. కావున, జాగరూకతతో, విచక్షణా జ్ఞానంతో, బుద్ధికుశలతతో, సుమనస్సుతో మెలగాలి.

ఏ పనీపాటాలేకుండా ఊరకే తిని కూర్చోవడం, లేక నిద్రించి మత్తులో సోలిపోవడం, సోమరితనంతో మైత్రి చేసి జీవితవిలువల్ని కోల్పోవడం తగదన్నాడు. కృషియే ప్రధాన మనీ, నేర్పుగా, ఓర్పుగా పనిలో లీనమైతే అది 'యోగం'గా మారి, మనిషిని గమ్యానికి చేర్చి మేలు చేకూర్చుననీ, కావున ఆ దిశలోనే మెలగాలన్నాడు.


వర్ణాశ్రమధర్మాలు ముఖ్యంగాని, కులాలు కావన్నాడు. దేహానికే నాశనంగాని, ఆత్మకు కాదని, నియమిత ఆహారవిహారాలు, యథోచిత వ్యవహారాలు, సత్యసంభాషణం, సరళత్వం, సాధుసాంగత్యం, పెద్దలను, గురువులను, పూజ్యులను గౌరవించడం, ఆదరించడం ముఖ్యమన్నాడు.

సర్వప్రాణులమేలును కోరాలని, తానే శ్రేష్ఠుడనను భావం లేకుండా ఉండాలని, దాంబికం, కపటం, మాలిన్యం లేకుండా ఉండా లని, చిత్తశుద్ధి అవసరమని, ఉన్నత మానసికస్థితిని పొంది ఉండాలని, కోరికలను, ఆసక్తిని అదుపులో ఉంచాలని, సంతుష్టియైన జీవనం వాంఛ నీయమని, ఎవరి హృదయంలో దైవీగుణాలు పనిచేస్తూ ఉంటాయో వారు దేవతలని, అసురీగుణాలుంటే వారు దానవులని ఈ రెండు రకాల్లో ఎవరు దేనికి చెందుతారో ఎవరికి వారే గుర్తించుకోవాలన్నాడు.

సత్కర్మలు సద్గతిని, దుష్కర్మలు దుఃఖాన్ని కలిగిస్తాయని, మాయామమతామోహాదిపంకిలంలోకి దిగజారకుండా తామరాకుపై ఉన్న నీటిబొట్టులా లోలత్వరహితంగా వ్యక్తి వ్యవహరించాలన్నాడు. ఇతరుల అపరాధాల్ని క్షమించేగలిగేగుణం, రుజుమార్గజీవనం, వేదశాస్త్రాదులయందు, ఈశ్వరునియందు విశ్వాసం కలిగి ఉండాలి అన్నాడు.



"ఎవరినీ ఏ విషయంలోనూ బలవంతం చేయవద్దని, హింసించవద్దని, కలహించవద్దని, వ్యక్తిస్వేచ్ఛను నిలపాలని, అధికారంతోనో, బలంతోనో అణచరాదన్న భావం అద్భుతమైందన్నాడు. మన భారతీయసంస్కృతిలో వ్యక్తిగత భావాలను, ఇష్టాలను గౌరవించాలనే సూచనకు అద్దంపడుతుంది భగవద్గీత. ఇలా వ్యక్తిత్వవికాసానికి వన్నెతెచ్చేదీ, విలువల్ని విరాజిల్లేలా చేసేదే భగవద్గీత.



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా|| ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

*గత సంచిక తరువాయి భాగం....*

పూర్వకాలమున వెన్టుమాలై యిట్ట పెరుమాళ్ అనునొక బ్రాహ్మణుడు మధ్యరాష్ట్రమును ఏలుచు ప్రభువుగనున్నవాడు తిరుమలయందు శ్రీవేంకటాచలపతికి ఒక దివ్యమంటపమును నిర్మించుటచేత అతనిపేరిట ఆ మండపమునకు 'వెన్టుమాలైయిట్టాన్ మండపము' అనుపేరు ప్రసిద్ధమైనదని పెద్దలు చెప్పుదురు.

### 'మలై కువియనిన్ఱ పెరుమాళ్' అను శబ్దమునకు అర్థము

మలై= మల, అనగ తిరుమల అనుకొండ, కునియః పూర్ణిమగునట్లు వ్యాపించి, నిన్ఱ= నిలచిన (నెలకొన్న) వాడగుటచేత దేవున కా పేరు కలిగెను. 'నెలపుకొన నిలచినవా'డని ఆళ్వారును దీనినిగూర్చి సాయించిరి. 'శ్రీవృషశైల మాస్థిత వపుః' శ్రీశైలమును (తిరుమలను) ఆక్రమించిన విభువు, సర్వ వ్యాపకుడు- అని విజ్ఞులు పేర్కొనుచున్నారు. 'అద్రింవ్యాప్య సమాస్థితో విభురితిచ' (పర్వతమును వ్యాపించుకొని సుస్థిరుడైన సర్వవ్యాపి)యని పెద్దలు వచింతురు.

అన్ని దివ్యదేశములందును 'శ్రీచూర్ణపరిపాలనము' జరుపునపుడు అనుసంధింపవలసినవి భిన్నభిన్నములైనను 'తిరుక్కార్తిగై' (కృతికాదీపోత్సవము) మొదలుకొని అధ్యయన తిరునాళ్లవరకును అన్నియెడల ఒకేతీరుగ నుండవలెను. అది యిట్లు- ముదలాయిరమన (ప్రథమసహస్రగీతి), తిరుమొళి, తిరువాయ్‌మొళి, ఇయఱ్పా- ఈ క్రమమున ఉండవలెను. తనియన్ (ప్రబంధప్రశస్తి) పాశురములను, నూత్తందాది ప్రశస్తి గీతములను అనుసంధించి, 'ఇయల్‌శాత్తు' (ముగింపు గీతికా మాల) అనుసంధింపవలెను. వీథులందు ఊరేగింపు జరుగు నెడల ఉపదేశరత్నమాల అనుసంధానము చేయవలెను. కొన్ని స్థలములందు తిరుప్పల్లాండు, కణ్ణినుణ్‌శిఱుత్తాంబు, తిరువాయ్ మొళి, తిరువిరుత్తమ్- వీనిప్రశస్తి గీతికలను (తనియనులు) అనుసంధించుచున్నారు.

### 'తేవయాళ్, శింగన్‌ముఱై' శబ్దముల యర్థము

దే (తే) వయాళ్ అను పద మపశబ్దము. దేవియగు లక్ష్మియొక్క (పని) మనిషి. కావుననే దేవీపరిచారక పరిజనము అను నర్థమున (దేవిఆళ్) వ్యవహారమేర్పడినది. శింగన్ (సింగడు)అనెడు తిరుమలపైనుండెడు విష్ణుదాసుడొకడు భగవద్భక్తియుక్తుడై పూర్వకాలమున వేంకటేశ్వరునిగుడికి వంట చెరకు సమకూర్చెడు కైంకర్యము చేయుచుండెను. శ్రీనివాసుడు ఆతడు తనకు మిగుల నభిమతుడని ఎల్లరు తెలియుటకై అతనికి అవసానకాలము దాపురించినపుడు 'అతని దేహ దహనమునకు మా కోవెలనుండి కాష్ఠములను కొనిపోయి దహనసంస్కారము జరిపి అర్చకులు మున్నగువారు కూడ అనుసరింపవలెను' అని అనుగ్రహము చూపుటచేత అతడు చేసెడి కైంకర్యమునకు (వంటచెరకు కూర్చుట) శింగన్‌ముఱై 'సింగని వంతు' (కృత్యము) అనుపేరు ఏర్పడెను. ముఱై- అనగా ఉచితకృత్యము అని అర్థం.

*(ఇంకా ఉంది)*

# దివ్య దీపావళి

12-11-2023న దీపావళిపండుగ సందర్భంగా...

గృహలక్ష్మి

– డా॥ దేవులపల్లి పద్మజ,
98496 92414

దీపం జ్యోతి పరబ్రహ్మ, దీపం జ్యోతి జనార్దన।
దీపో హరతుమే పాపం, దీపం జ్యోతి నమోస్తుతే॥

ఆశ్వీయుజశుక్లత్రయోదశి మొదలు దీపావళి ఉత్సవం ప్రారంభం అవుతుంది. నరకాసురవధానంతరం సత్యభామ సాధించిన విజయానికి లోకంలో చీకట్లుపోయి వెలుగులు ప్రారంభం కాబడ్డాయి. అజ్ఞానాంధకారంలో మునిగిన ప్రపంచాన్ని వెలుగులతో నింపే సంప్రదాయమే దీపావళి ఉత్సవం లేదా పండుగగా మనం జరుపుకుంటున్నాం. వళీ అనగా వరుసక్రమం, దీపావళి అనగా దీపాలవరుస. త్రయోదశి రోజున ఇంటియజమాని దీర్ఘఆయుష్షుతో జీవించటానికి దక్షిణం వైపు ఆకాశం కనిపించేవిధంగా మట్టిప్రమిదలో ఆముదంతో మూడువత్తులతో దీపం పెట్టాలి. యమధర్మరాజు ఆశీర్వాదంతో గృహయజమాని శతాయువు పొందుతాడు. దీపానికి క్రింద వరి పిండితో ముగ్గువేసి దీపంపెట్టి, ఆ నూనెలో ప్రకృతి ప్రసాదించిన ఒక చిన్నగవ్వ వేసి ఆ దీపం వెలుగులు ఆకాశం చూస్తున్నట్లు పెట్టాలి. ఈ త్రయోదశిని ధనత్రయోదశి అనికూడా పిలుస్తారు.


రెండవరోజు చతుర్దశినాడు సాయంత్రం ద్వారబంధానికి ఎదురుగా రెండు క్రొత్త మట్టిప్రమిదలలో కుడిఎడమలుగా దీపం పెట్టాలి. జీవితంలో వచ్చే ఆనందఆగమనానికి సంకేతంగా టపాసులు కాల్చి దీపావళిపండుగను ఆహ్వానించాలి.

శ్రీమహావిష్ణువు వామనావతారమెత్తి బలిచక్రవర్తిని పాతాళానికి పంపించాడు. అయినప్పటికి బలి శ్రీహరినే సదా ధ్యానించినందుకు విష్ణువు సంతోషించి బలిచక్రవర్తికి ఒక గొప్పవరం ప్రసాదించాడు. ఆ వరంకారణంగా ప్రతిసంవత్సరం దీపావళిరోజున బలిచక్రవర్తి పాతాళం నుంచి భూలోకానికొచ్చి ఆ ఒక్కరోజు పరిపాలిస్తాడు. కనుక, ప్రజలు సంతోషంతో ఇంటినిండా దీపాలు వెలిగిస్తే బలిచక్రవర్తిని, మహావిష్ణు సమేత శ్రీమహాలక్ష్మిని ఆహ్వానించినట్లవుతుంది. ఆవిధంగా ధనలక్ష్మి ఐశ్వర్యప్రదాతగా మనలను అనుగ్రహించి అశీర్వదిస్తుంది. దీనిని కౌముదీఉత్సవంగాకూడా వ్యవహరిస్తారు.

ఈ మాసమందు ఆచరించు ముఖ్యమైన వ్రతం కేదారేశ్వరవ్రతం.

కృతయుగంలో శంకరుని భార్య దాక్షాయణి తన తండ్రి మహాయజ్ఞం చేస్తున్నట్లు తెలుసుకున్న ఆమె, తండ్రినుంచి ఆహ్వానం రాకపోయిన పుట్టింటి యజ్ఞానికి వెళ్లి తండ్రి అవమానించటంతో అచటనే దగ్ధమై పర్వతరాజు గర్భమున పార్వతిగ జన్మించింది. ఆ సమయంలో శివుణ్ణి తిరిగి వివాహమాడగోరి ఆమె శంకరానుగ్రహంకోసం కేదారవ్రతం ఆచరించింది. తరువాత దుష్యంతమహారాజు శకుంతలను వివాహమాడికూడా మునిశాపంవల్ల ఆమె తన భార్య అన్న విషయమే మరచిపోయి "నీవు నా భార్యవు కాదని" తిరస్కరించాడు. ఆమె తనయందారోపింపబడిన నిందను పోగొట్టుకోవాలని, నిజాన్ని ప్రభువు గుర్తించటానికి ఈ కేదారవ్రతం ఆచరించింది. ఆమె కోరిక ఫలించింది. నాటినుండి నేటివరకు ఆ వ్రతాన్ని సకలవర్ణాల వారు చేసి శివసాన్నిధ్యం పొందారు.

అమావాస్యనాటి దీపాలవెలుగుల్లో చీకటిని పోగొట్టి మనలో నిక్షిప్తమైన జ్ఞనమనే నరకాసురుణ్ణి తొలగించి యోగ దీపావళిగా చేసి, యోగజ్ఞానదీపాలను వెలిగించి ఈ కలియుగంలో సత్యయుగాన్ని స్థాపిద్దాం మరియు కేదారేశ్వర వ్రతాన్ని ఆచరించి సద్గతులను పొందుదాం.





# పద్మసరోవరం మాహాత్మ్యం

-డా॥ మైలవరపు లలితకుమారి,
99595 10422

**పద్మోద్భవాం పద్మముఖీం పద్మనాభప్రియామ్ రమామ్।**
**పద్మమాలాధరాం దేవీం పద్మినీ పద్మగంధినీమ్॥**


అని పద్మవాసిని అయిన శ్రీ మహాలక్ష్మిని నిత్యం స్తోత్రం చేస్తాం. ఆ మహాలక్ష్మి కొలువైన పద్మము అత్యంత విశిష్టమైనది. క్షీరసాగరమథనంలో ముందుగా హాలాహలం పుట్టింది. ఆ తరువాత కామధేనువు, ఉచ్చైశ్శ్రీవం, కల్పతరువు, ఐశ్వర్యదేవత అయిన శ్రీమహాలక్ష్మి ఉద్భవించాయి. ఆమె మహావిష్ణువును వరించింది. విష్ణువామెను తన వక్షఃస్థలంలో దాచుకున్నాడు. అలా పద్మవాసిని అయిన లక్ష్మీదేవి పద్మనాభుని ఇల్లాలు అయింది.

అలాగే సృష్టిలో తొలిపుష్పంగా పద్మాన్ని భావిస్తారు. విష్ణువునాభిలోని పద్మంనుండి పుట్టిన బ్రహ్మ పద్మసంభవుడయ్యాడు. బ్రహ్మ ఆయుర్దాయంలో మొదటిసగాన్ని పద్మకల్పంగా పురాణాలు చెబుతున్నాయి. కుబేరుని నవ నిధులలో పద్మం, మహాపద్మాలను చెబుతారు.

నాలుగుదిక్కుల్లోనూ ద్వారాలున్న ఇంటిని పద్మమని పిలుస్తారు. మనకు అష్టాదశపురాణాలలో 50వేలశ్లోకాలతో శ్రీమహావిష్ణువుమాహాత్మ్యాన్ని తెలిపే పద్మపురాణం ప్రసిద్ధం. నీరు ఎక్కడయితే సమృద్ధిగా ఉంటుందో అక్కడ పద్మాలు ఎక్కువగా ఉంటాయి. వాటికి తామర, పద్మం, పంకజం, నళినం అనే పేర్లు ఉన్నాయి. ఈ పద్మం దేవతలకు ఆసనం. లక్ష్మీదేవి ఎల్లప్పుడు పద్మాసనయై చేతిలో పద్మాలను ధరించి ఉంటుంది. ఈ పద్మాలు వాడి ఎండిపోయిన తరువాత తామరగింజలు వస్తాయి. ఆ గింజలతో లక్ష్మీదేవిని పూజిస్తే ఐశ్వర్యం కలుగుతుంది. అంతేగాక ఆ తామరగింజలను 108 కలిపి దండగా చేసి జపం చేసుకున్నా మంచిదంటారు, ఇంత విశిష్టమైనది పద్మం. ఇక ఆ పద్మంనందు పద్మావతిగా ఆ మహాలక్ష్మియే వెలసిందంటే పద్మం ఎంత పుణ్యం చేసుకుందో కదా!

పూర్వం భరతఖండంలో కాంభోజదేశం అను పేరుగల రాజ్యం ఉండేది. ఆ రాజ్యాన్ని శంఖణుడనే రాజు పాలించేవాడు. కొందరు శత్రువులు శంఖణమహారాజుకు మిత్రులుగా నటిస్తూ మోసంచేత ఆయన రాజ్యాన్ని, సంపదలను కైవసం చేసుకున్నారు. రాజ్యాన్ని, సంపదలను పోగొట్టుకున్న శంఖణుడు కట్టుబట్టలతో మిగిలాడు. ఆ సమయంలో "స్వామీ! శ్రీమన్నారాయణా! నా భర్తని కాపాడు తండ్రీ. నా పసుపుకుంకుమలు కాపాడు తల్లీ! అని మంగళగౌరిని ప్రార్థించింది."

ఆ సమయంలో పరమతేజస్సుతో ప్రకాశిస్తున్న ఒక మహనీయుడు వారివద్దకొచ్చి రాజా! ఇక్కడికి దగ్గరలోనే శ్రీమహాలక్ష్మి ఆవిర్భవించిన ఒక దివ్యసరోవరముంది. ఆ సరోవరమంతా పద్మాలు వికసించి ఉంటాయి. అందువల్ల ఆ సరస్సు **"పద్మసరోవరం"**గా ప్రసిద్ధిపొందింది. మీ దంపతులిద్దరు ఆ పద్మసరోవరానికి వెళ్ళి స్నానాలుచేసి, భగవంతుని స్తుతించండి. మీ పాపాలు నశించి, మీకు శ్రేయస్సు కలుగుతుంది అని



చెప్పాడు. ఆయన మాటలను విన్న శంఖణమహారాజదంపతులు ఆ పద్మసరోవరానికి చేరుకున్నారు. ఆ దివ్యసరస్సు పూర్తిగా పద్మాలతో నిండి ఉన్నది.

భృగుమహర్షి చేసిన పనివల్ల మహాలక్ష్మి విష్ణువుపై అలిగి కొల్హాపురం చేరింది. లోకకంటకుడైన కోలహుడు అనే రాక్షసుని సంహరించి, సత్వరజోగుణాలతోకూడిన ఉగ్రరూపంలో వెలసింది. ఆమెను దర్శించాలంటే ఒక 12సం॥ కాలం తపమాచరించాల్సిందిగా ఆకాశవాణి శ్రీనివాసునికి చెప్పింది. సువర్ణముఖినదికి ఉత్తరాన శుకమహర్షి ఆశ్రమముంది. అక్కడ నిరంతరం వేదఘోషలు వినబడుతుంటాయి. ఆ పావన ప్రదేశంలో నీ ఆయుధమైన బల్లెంతో స్వయంగా ఒక సరస్సును త్రవ్వి అందులో దేవలోకంనుండి తెప్పించిన సువర్ణకమలాలు నాటించు. ఆ సరోవరంలో పూచిన సువర్ణకమలాలతోనే మహాలక్ష్మిని అర్చిస్తూ తపమాచరించుమని నారదుడు చెప్పాడు. ఆ ప్రాంతానికి చేరిన శ్రీనివాసుడు మహాలక్ష్మిమంత్రాన్ని జపిస్తూ పుష్కరకాలం కఠోరతపస్సు చేశాడు. ఆయనతపస్సు ఫలించి కార్తికమాసంలో శుక్లపంచమి ఉత్తరాషాఢనక్షత్రయుక్త అభిజిల్లగ్నంలో శ్రీమహాలక్ష్మియే ఆ సరస్సులో పద్మంలో అలమేలుమంగగా అవతరించింది. అమ్మ అవతరించిన స్థలం, శ్రీవేంకటేశ్వరుడు తపమాచరించిన ఆ దివ్యస్థలం పద్మసరోవరంగా ప్రసిద్ధిపొందాయి.

ఆ సరోవరాన్ని సందర్శించి, అందులో అవతరించిన శ్రీమహాలక్ష్మిని, అలమేలుమంగమ్మను శంఖణమహారాజు దంపతులు అధర్వణవేదంలోని శ్రీలక్ష్మీహృదయమ్‌లో అమ్మవారి దివ్యమంగళస్వరూపాన్ని వర్ణించారు. శంఖణమహారాజు ప్రార్థనలకు ప్రసన్నురాలైన శ్రీమహాలక్ష్మి ఆ పద్మసరోవరంలో సహస్రదళాలుగల స్వర్ణపద్మంలో అవతరించి జగజ్జనని అలమేలుమంగగా దర్శనమిచ్చింది.

శ్రీమహాలక్ష్మిని రాజు అనేకవిధాల స్తుతించాడు. వారి పాపాలు పటాపంచలయినాయి. పద్మసరోవరంలో ఉన్న అర్చామూర్తిని "వీరలక్ష్మి", "స్వతంత్రవీరలక్ష్మి" అని స్తుతిస్తారు. స్వామివారు పక్కనలేకుండా అమ్మనే ఆరాధిస్తూ ఉత్సవాలు జరుగుతున్నందువలన అలమేలుమంగాదేవిని "స్వతంత్రవీరలక్ష్మి"గా భక్తులు సేవిస్తారు.

శ్రీనివాసుని తపస్సువల్ల పద్మసరోవరంలో అవతరించిన అర్చామూర్తి అలివేలుమంగమ్మను ముందుగా దర్శించి, ఆ తరువాత స్వామిని దర్శించాలన్నది ఋషివాక్కు. తల్లేకదా ముందుగా బిడ్డల కష్టసుఖాలను ఆలకించి, మనశ్శాంతిని కలిగించేది. అంతేగాక ఇక్కడ వెలసిన అమ్మవారికి కార్తికమాసంలో కార్తికబ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఆ సమయంలో ఆ ప్రాంతమంతా గోవిందనామస్మరణతో లక్షలాదిమందిభక్తులు పద్మసరోవరంలో పుణ్యస్నానాలు చేసి ఆ తల్లికృపకు పాత్రులవుతారు.

నేడు తిరుచానూరుగా ప్రసిద్ధిచెందిన శ్రీశుకపురంలోని పద్మసరోవరంలో వెలసిన మహాలక్ష్మీఅంశతో సహస్రదళ బంగారుపద్మంలో పద్మావతిపేరున వెలసి అలమేలుమంగగా అర్చనలను అందుకుంటున్న ఆ తల్లి ఎల్లవేళలా భక్తులను తన చల్లనిచూపులతో కాపాడుతూ సమస్తసంపదలను ప్రసాదిస్తోంది.

**జయతు జయతు లక్ష్మీర్లక్షణాలంకృతాంగీ**
**జయతు జయతు పద్మా పద్మసద్మాభివంద్యా**
**జయతు జయతు విద్యా విష్ణు వామాంకసంస్థా**
**జయతు జయతు సమ్యక్ సర్వ సంపత్కరీశ్రీః**

# రథం - అంతరార్థం

- శ్రీ ఐనవోలు మోహనాచార్యులు,
80741 83737

17-11-2023న తిరుచానూరు, శ్రీపద్మావతీదేవివారి 'రథోత్సవం' సందర్భంగా...

తొలి వేదమైన ఋగ్వేదంలోనే రథంగురించి.. వాటి నిర్మాతలైన రథకారులగురించి వివరాలున్నాయి. దేవతలు ఉపయోగించే వాటిని దేవతారథాలనీ.., ఆలయంలో ఉత్సవాలప్పుడు వాడే వాటిని ఆలయరథాలనీ.. యుద్ధాలలో పోరాటాలకు వినియోగించేవి యుద్ధ లేదా సాంగ్రామికరథాలనీ అంటారు. ఆలయరథం నిర్మాణం విలక్షణమైనది. ప్రతిరథాన్ని నడపడానికి ఏదో ఒకఅనువుంటే ఇక్కడమాత్రం భక్తులే రథచాలకులు. ఈ రథం నిర్మాణానికి అనాదిగా కొయ్యనే వాడుతున్నారు.

ఆలయరథం అనగానే.. పెద్దపెద్దచక్రాలు.. వాటికి జోడించిన ఇరుసులు... వాటిపై ఆలయానికివలెనే అధిష్ఠానం.. దానిపైన మండపం.. మండపం మధ్యలో దేవతావిగ్రహాన్ని ఉంచే దివ్యపీఠం.. పీఠానికి వెనుక ప్రభావళి.. మండపంపైన విమానం.. విమానం తుదిభాగంలో శిఖరకలశం.. దానికి అమర్చిన ఛత్రం (గొడుగు).. ఇంకా దానికి సింహాలు.. ద్వార పాలకవిగ్రహాలు.. అశ్వాలు.. సారథి విగ్రహం మొదలైన దారు (కొయ్య) విగ్రహాలను తగిలించి జెండాలతో.. రంగురంగుల వస్త్రాలతో.. పూలమాలలతో అలంకరించబడి.. రథోత్సవం రోజున ఆలయమే కదిలివస్తోందా అనిపిస్తుంది. ఆలయానికి మరోరూపు అనుకునే రథోత్సవంతోనే ఉత్సవాలు సమాప్తమౌతాయి. రథం స్వయం దేవాలయమే కనుక కొన్ని ఆలయాల్లో రథోత్సవం ప్రారంభం కాగానే గుడి తలుపులు మూసివేయడం సంప్రదాయం. అంటే దేవుడు అప్పుడు రథంలో ఉన్నాడని అర్థం.

## రథోత్సవం

రథోత్సవం అనగా రథంపై దేవుని ఊరేగించడం. రథోత్సవంను రథయాత్ర అనికూడా అంటారు. రథయాత్ర హిందువులపండుగ. ఉత్సవాలసమయంలో వాహనంపై పలు దేవతల ఉత్సవవిగ్రహాలను ఊరేగిస్తారు. రథోత్సవం జరిగే ముందుగా దేవఉత్సవవిగ్రహాలకు కల్యాణం జరిపిస్తారు. ఈ కల్యాణాన్ని కల్యాణోత్సవం లేదా కల్యాణమహోత్సవం అంటారు. కల్యాణోత్సవం తరువాత స్వామివారు సతీసమేతంగా అత్తవారింటికి రథంపై ఊరేగింపుగా వస్తున్నట్టు ఈ ఉత్సవాన్ని భక్తజనులు ఆనందంగా జరుపుకుంటారు.



## రథాలు- రకాలు

### రాతి(శిలా)రథం

రథం ఆలయాకారం. రథచలనం సంచారదేవాలయం. ఆలయ కైంకర్యాదులన్నీ రథస్వామికి చేయడం సంప్రదాయం. ఇలా రథంలో కొలువైన భగవంతుడు భక్తులు కోరుకున్నవన్నీ నిజం చేస్తాడు. ఆలయానికి.. రథానికి ఉన్న అవినాభావ సంబంధం ఎంతో గొప్పది. కనుకనే ఎన్నో ఆలయాలు రథా కారంలో ఉన్నాయి. అంతేకాదు రథాకృతిలో ఆలయనిర్మాణం చేయడం భారతీయతకు గుర్తు.

### దారు(చెక్క)రథం

రథానికి వాడబడే కలప ప్రధానంగా నిమ్మ, ప్రబ్బలి, తినాసచెట్లనుంచి సేకరిస్తారు. ఈ రథం మొత్తం వందచెక్కల కూర్పుతో కూడిఉంటుంది. రథానికి అనేకఅంగాలు ఉంటాయి. ధూర్యానం, అవస్కరం, ప్రధానంగం, నేమి, ప్రధి పిండికా, నాభి, అక్షం మొదలైనవి.

రథోత్సవంనాడు రథాన్ని బాగా అలంకరిస్తారు. రథాన్ని భక్తులు లాగేందుకు రథానికి మోకు కడతారు. రథయాత్ర ప్రారంభపూజల తరువాత జయజయధ్వానాలతో రథయాత్ర నిర్వాహకుని సూచనలమేరకు మోకులను పట్టుకుని భక్తులు రథాన్ని కదలిస్తారు.

*"రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే"* రథంపై ఉన్న కేశవుడిని చూస్తే మరుజన్మ ఉండదని పురాణవచనం. సంవత్సరానికోసారి జరిగే ఉత్సవాల్లో చివరిరోజు రథోత్సవం నాడు వేలాదిమంది భక్తులు ఒక్కటై అతిపెద్దతాడును రథానికి పూన్చి రథాన్ని లాగే సన్నివేశం మాటలకందని దివ్యభావనను అందిస్తుంది. రథంపై కదిలొస్తున్న దేవుని జయజయధ్వానాలతో కీర్తించే భక్తులగొంతులు ఏకమై స్మరించేవారంతా తరించాలని దేవుడు దీవెనలనందిస్తాడు.

## లోహ (స్వర్ణ; రజిత) రథం

తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారికి అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాల్లో రథోత్సవం కన్నులపండువుగా నిర్వ హిస్తారు. ఆలయ నాలుగుమాడవీథుల్లో సాగే ఈ ఉత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని రథాన్ని లాగుతారు. సర్వాలం కార శోభితమైన రథంలో ప్రకాశించే అలమేలుమంగ సకల దేవతాపరివారంతో వైభవోపేతంగా తిరువీథులలో విహరించే వేళలో ఆ తల్లిని సేవించిన భక్తులకోరికలు సిద్ధిస్తాయని విశ్వాసం. రథోత్సవం ఉత్సవం మాత్రమే కాదు. భక్తుల హృదయక్షేత్రాలలో తాత్త్వికబీజాలు విత్తే ఒక యజ్ఞం. సింగా రించిన పాలకడలి గారాలపట్టిని రథోత్సవాన దర్శించినవారికి జన్మాదిదుఃఖాలు నశించి, మోక్షం లభిస్తుంది.

## రథోత్సవ అంతరార్థం

రథం నాలుగుమాడవీథులలో తిరుగుతుంది. మాన వుడు ధర్మార్థకామమోక్షాలను చతుర్విధపురుషార్థాలకై జీవించ డాన్ని ఉద్దేశిస్తుంది. రథం ఎక్కడనుండి కదులుతుందో అక్కడికే చేరుకోవాలి. అలాగే జీవాత్మ పరమాత్మ సాన్నిధ్యం వదిలి బయటకు వచ్చింది. మరల ఆ సాన్నిధ్యానికే చేరుకోవాలి. మధ్య ప్రయాణం అంతా జీవియాత్ర. ఈ యాత్ర సులభంగా నడవదు. అనుకోని ఆటంకాలు ఉంటాయి. రథయాత్ర సక్రమంగా నడవడంకోసం మోకులు వాడినట్లే జీవి తనని తాను పరిశీలించుకుంటూ జీవితాన్ని నడుపుకోవాలి. రథం మలుపులు తిరుగుతుంది. అలాగే జీవితంలోనూ మలుపు లుంటాయి.

తలపులు మంచివి అయితే మలుపులు బాగుంటాయి. రథం చూడటానికి అందంగా ఉంటుంది. అలాగే మానవుని దేహంకూడా అందంగానే ఉంటుంది. రథంలోనూ దేవుడు ఉన్నాడు. అలాగే మనిషిలోనూ ఈ దేవుని గుర్తించడం కష్టం. తనలోని దేవుడిని గుర్తించడం, చూడడం భక్తులకు, యోగులకు సాధ్యం. రథంలాగే వారంతా తమబలంవల్లనే కలుగుతుందని భావిస్తారు. అలాగే జీవి తన ప్రయత్నంవలనే సాగుతుందని భావిస్తాడు. ఈ రెండూ అబద్ధాలే. అసత్యాన్ని గుర్తించడమే జ్ఞానం. అవాస్తవాన్ని విస్మరించడమే జీవిత ధ్యేయమని అంతరార్థం దీనిలో దాగి ఉంది. శరీరంలోని అణువణువులో ఉన్న స్వామిని సేవించి దర్శిస్తే ఆ స్వామివద్దకే చేరతాం అంటే మోక్షానికి వెళతాం అనగా మళ్ళీ జన్మించమని అర్థం. అందుకే రథోత్సవంనాడు తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మ వారిని దర్శించి మోక్షసిద్ధిని పొందుదాం.



పండగల్ని కోల్పోయిన మనం బాంధవ్యాల్ని కోల్పోతున్నాం

# శ్రీవైకుంఠం

- శ్రీ చాకిచర్ల నాగసుదర్శనరావు,
97013 85006

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడినివాసమే శ్రీవైకుంఠం. మన చర్మచక్షువులకు అతీతమైనది ఆ పరంధాముని దర్శనం. వేదవాఙ్మయంలోని మంత్రభాగానికి చెందినవి సూక్తాలు. వాటిలో ఋగ్వేదాంతర్గతమైన పురుషసూక్తంలోని మొదటిచరణం ఆ స్వామి అద్భుతమైన రూపంగురించి తెల్పింది.

**ఓం సహస్రశీర్షా పురుషః సహస్రాక్ష స్సహస్రపాత్**
**సభూమిం విశ్వతో వృత్వా అత్యతిష్ఠ ద్దశాలం**

**భావం:** త్రివిక్రముని విశ్వరూపాన్ని చిత్రపటంలో మనం చూసినప్పుడు ఆ పరమాత్మ అనేక తలలతో, కన్నులతో, పాదాలతో ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్నట్లుగా తెలుస్తుంది, అందుచేతనే మనం ఆ మాధవుణ్ణి ఈ క్రిందివిధంగా కీర్తిస్తూ ప్రణామాలు అర్పిస్తుంటాం.

**శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం**
**విశ్వాకారం గగన సదృశం మేఘవర్ణం శుభాంగం।**
**లక్ష్మీకాంతం కమలనయనం యోగిహృద్ధ్యానగమ్యం**
**వందే విష్ణుం భవభయహరం సర్వలోకైకనాథం।**

**భావం:** ఓ శాంతిస్వరూపా! భుజగశయన! పద్మనాభా! దేవాది దేవా! విశ్వనాథా! ఆకాశమంతా వ్యాపించిఉన్నవాడా! శుభప్రదమైనవాడా! యోగులధ్యానానికి గమ్యమైనవాడా! సంసారభారం పోగొట్టువాడా! గోవిందా! నీకు నమస్కారం.

వైష్ణవసంప్రదాయంలో విష్ణువుని శ్రీమన్నారాయణుడు; విష్ణుసహస్రనామస్తోత్రంలో విష్ణువే పరమాత్ముడని, కాలాతీతుడని, విశ్వరూపుడని, సృష్టి స్థితి లయాధిపతి అని, దేవదేవుడని కీర్తించింది. పురాణాల్లో విష్ణువువర్ణన నీలమేఘశ్యామావర్ణం కలవాడు, చతుర్భుజుడు, పంచాయుధాలు ధరించినవాడు, పాలసముద్రంలో శేషునిపై పవళించినవాడు, శ్రీదేవి, భూదేవీ అమ్మవార్లచేత కొలవబడుతున్నవాడు, శ్రీవత్స చిహ్నం, కౌస్తుభం, వైజయంతీమాలను ధరించినవాడు, గరుడునిపై ప్రయాణించువాడు అని వర్ణించబడి ఉంది.

"విష్" అనే ధాతువునుండి "విష్ణు" అనే పదం వచ్చింది. "విష్" అంటే సర్వత్ర వ్యాపించి ఉండటం. అందువల్లనే విష్ణువు విశ్వస్వరూపుడు, విశ్వవ్యాపకుడు, విశ్వరక్షకుడు. విష్ణువు ఒకచేతిలో శంఖముంటుంది. ఇది శబ్దానికి చిహ్నం. కనుక భగవంతుడు శబ్దస్వరూపుడు. రెండవచేతిలో చక్రం ఉంటుంది. ఇది కాల చక్రానికి గుర్తు. కాలంకూడా స్వామిచేతిలో ఉంది. మరొక చేతిలో గద ఉంటుంది. ఇది బలానికి గుర్తు. సమస్త జీవులబలమూ భగవంతునియందే ఉంది. మరొకచేతిలో పద్మం (కమలం) ఉంటుంది. అది హృదయకమలానికి చిహ్నం. అందరిహృదయాలు భగవంతునియందే నిలచిఉండాలి. విష్ణువునకు కేశవుడు అని మరొకపేరుంది. ఈ కేశవనామాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే ఆ అనంత సృష్టి, స్థితి, లయములకు ఆ గోవిందుడే అని ద్యోతకమవుతుంది. క+ఈ+శ+వ= కేశవ,



బ్రహ్మ+శివ+విష్ణు=సృష్టి+స్థితి+లయలకు ఆధారం కేశవ నామధారి.

ఎల్లప్పుడూ కల్యాణగుణసంపదతో నిండిఉండే ఆ శ్రీమన్నారాయణుని నిలయమైన ఆ పరమపదధామం ఎలా ఉంటుందో పరమపూజ్యులైన భగవాన్ శ్రీరామానుజాచార్యుల వారు తన గద్యత్రయంలోని మూడవదైన శ్రీవైకుంఠగద్యలో అత్యంతరమణీయంగా వర్ణించారు.

ఈ సమస్తసృష్టిలో ఉన్న చేతనా అచేతనములు ఆ మాధవుని ఆధీనంలో ఉంటాయి. ఈ సమస్తబ్రహ్మాండం ఆ గోవిందునిస్పర్శతో నిండి ఉంటుంది. అట్టి బ్రహ్మాండానికి అతీతమైనదే పరమపదవ్యోమమైన శ్రీవైకుంఠం. ఈ పరమపదం బ్రహ్మాదిదేవతలకు కూడా ఊహాతీతమై స్వభావ అష్టైశ్వర్యాలతో, మహాఋషులతో, దివ్యపురుషులతో నిండి ఉంటుంది. అక్కడ ఉండే నిత్యసూరులకుకూడా వర్ణనాతీతమైన అత్యంత ఐశ్వర్య వంతమైన, రమణీయమైన, విశాలమైన ఉద్యానవనాలు దివ్య కల్పతరువులతో వెలుగొందుతూ ఉంటుంది శ్రీవైకుంఠం.

పరమపవిత్రమైన అక్కడి మండపాలు రత్నఖచిత స్థంభాలతో నిర్మితములై అత్యంత శోభాయమానంగా ఉంటాయి. అంతేకాదు ఆ విష్ణుధామం అచటనున్న ఆ దివ్యాస్థానమంట పాలచుట్టూ అసంఖ్యాకాలైన దివ్యసువాసలను వెదజల్లే పారిజాత వృక్షాలతో అలరారుతూంటుంది. అక్కడున్న లీలామంటపాలు ఎన్నిమార్లు చూసినా తనివితీరదు మరియు ఇప్పుడే చూసి నట్లుంటాయి. ఎందుచేతనో ప్రతిఅణువూ ఆ మధుసూదనుని స్పర్శతో నిండిఉంటుంది.

అక్కడి ఉద్యానవనాల్లో ఉన్న చెట్లపై మధురగానం చేస్తూన్న కోకిలలు మరియు ఆ వృక్షాల రమణీయతను ఇను మడింపచేసే శుకసారికలు మహాలక్ష్మీ నారాయణులను వీనుల విందు కనువిందులను చేస్తూ విహరిస్తూ ఉంటాయి. అచటి క్రీడామండపాలుకూడా అత్యంత రమణీయమైన మధువు స్రవిస్తున్న పుష్పమాలంకృతాలతో అలంకరింపబడి ఉంటాయి. అక్కడి సరోవరాలు సువాసనాభరితమైన పరిమళాలు వెదజల్లు పుష్పాలతో, రాజహంసలవిహరణలతో చూడ్డానికి చాలా ముచ్చటగొలుపుతూ ఉంటాయి.

అట్టి అద్భుత ఉద్యానవనంలో సుగంధపరిమళాలు వెదజల్లే పుష్పాలతో కూడిన వృక్షాలమధ్య తుమ్మెదఝుంకారాల సవ్వడితో నిండినవనంలో చల్లనిచిరుగాలులు వీచుచున్న వాతా వరణంలో ఆదిశేషపర్యంకంపై ఆ శ్రీధరుడు మహాలక్ష్మితో కూడి పవళించి ఉంటాడు. శీల, రూప, గుణ, విభూతులచే, తన సహజఐశ్వర్యకాంతులచే మహాలక్ష్మిదేవి ఆ కల్యాణగుణ ధాముడైన ఆ పరంధాముని సేవిస్తూంటుంది. ఆ హృషీకేశునికి అనువైనవిధంగా అక్కడున్న గరుత్మంతుడు మరియు ఇతర పరివారంచేత ఆ వైకుంఠం శ్రీవైకుంఠమనే సార్థకనామమైంది. రాగద్వేషాలకు అతీతమైనది ఆ శ్రీవైకుంఠం.

అలాంటి మహిమాన్వితమైన స్వామిని సప్తఋషులు తిరుమలలో అవతరించేటట్లుగా ప్రార్థించారు.

విష్ణువు వైకుంఠాన్ని విడిచిపెట్టి, లక్ష్మీదేవిని వెతు క్కుంటూ తిరుమలలో ఉన్న వేంకటాద్రికొండపై శ్రీనివాసుడిగా మానవరూపాన్ని పొంది బ్రహ్మకడిగిన తన పాదపద్మాలను మోపాడు. ఆ నారాయణుని పాదస్పర్శతో పులకితమయ్యింది ఈ భువి మరియు తిరుమలక్షేత్రం.

ఆ తర్వాత ఆకాశరాజు రాజభవనంలో పద్మావతి శ్రీనివాసులవివాహం ఎంతో వైభవంగా జరిగింది.

అటుతర్వాత లక్ష్మీదేవి ఆ శ్రీనివాసుని వక్షఃస్థలంలో చేరింది. ఆ తర్వాత శ్రీనివాసుడు పద్మావతీదేవినికూడా తన రెండవవక్షఃస్థలంలో భూదేవిగా ఉండటానికి అనుగ్రహించి, ఆమె శిలారూపాన్ని అలమేలుమంగాపురంలో ఉండేట్లుగా వరమిచ్చాడు. తాను శ్రీవేంకటేశ్వరుడుగా శిలారూపంలో తిరుమలలో ఆ వేంకటాద్రికొండపై తొండమాన్‌చక్రవర్తి నిర్మిం చిన కలియుగవైకుంఠమైన ఆనందనిలయంలో ఉండి భక్తులను అనుగ్రహిస్తున్నాడు.

అందువల్ల తిరుమలకొండ కలియుగవైకుంఠంగా ప్రసిద్ధిచెందింది! పద్మావతిదేవి, భూదేవిస్వరూపమైన అలమేలు మంగమ్మతల్లి బ్రహ్మోత్సవాలు కార్తికమాసంలో అత్యంత వైభవంగా కన్నులపండువుగా జరుగుతాయి. అందరం వెళ్లి దర్శించి తరిద్దాం.



కష్టాలు బలహీనుల్ని పడగొడతాయి. బలవంతుల్ని అభివృద్ధి చేస్తాయి.

తిరుమల శ్రీవారికి 18-09-2023 నుండి 26-09-2023 వరకు జరిగిన **సాలకట్ల బ్రహ్మోత్సవ కార్యక్రమం**లో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర ముఖ్యమంత్రి **గౌ॥ శ్రీ వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి** మరియు తి.తి.దే. నూతన క్యాలెండరు-2024ను ఆవిష్కరించిన దృశ్యాలు. ముఖ్యమంత్రికి స్వామివారి చిత్రపటం మరియు తీర్థప్రసాదాలు అందజేస్తున్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు **శ్రీ భూమన కరుణాకరరెడ్డి**. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి **శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి**, ఐ.డి.ఈ.ఎస్., అర్చకులు మరియు ఉన్నతాధికారులు.











తిరుమల శ్రీవారికి 18-09-2023 నుండి 26-09-2023 వరకు జరిగిన **సాలకట్ల బ్రహ్మోత్సవ** కార్యక్రమంలో భాగంగా జరిగిన వాహనసేవల దృశ్యాలు. ఇందులో పాల్గొన్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు **శ్రీ భూమన కరుణాకరరెడ్డి** దంపతులు, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి **శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి**, ఐ.డి.ఈ.ఎస్., దంపతులు, తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారులు **శ్రీమతి సదా భార్గవి**, ఐ.ఏ.ఎస్., **శ్రీ వి.వీరబ్రహ్మం**, ఐ.ఏ.ఎస్., జీయర్‌లు, అర్చకులు, ఇతర ప్రభృతులు మరియు అశేషభక్తజనవాహిని











తిరుమల శ్రీవారికి 18-09-2023 నుండి 26-09-2023 వరకు జరిగిన
**సాలకట్ల బ్రహ్మోత్సవ** కార్యక్రమంలో భాగంగా జరిగిన వాహనసేవల దృశ్యాలు.
వాహనసేవల్లో పాలకమండలి అధ్యక్షులు, పాలకమండలి సభ్యులు, కార్యనిర్వహణాధికారి,
సంయుక్త కార్యనిర్వహణాధికారులు, ఉన్నతాధికారులు, అర్చకులు మరియు భక్తులు పాల్గొన్నారు.












## తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారికి
## 27-09-2023 నుండి 29-09-2023 వరకు
## కనులపండువుగా జరిగిన పవిత్రోత్సవ కార్యక్రమాల దృశ్యాలు.

ఇందులో పాల్గొన్న తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., దంపతులు మరియు అర్చకులు.











## తిరుపతి, శ్రీగోవిందరాజస్వామివార్లకు
## 25-09-2023 నుండి 27-09-2023 వరకు
## జరిగిన పవిత్రోత్సవ కార్యక్రమాల దృశ్యాలు.





# శ్రీపద్మావతీదేవి పెళ్లిసారె!!

- శ్రీమతి దణ్యంరాజు జ్యోతిర్మణి, 82775 32959

పద్మావతి శ్రీనివాసుల కల్యాణమనేది లోకకల్యాణంగా అభి వర్ణించొచ్చు. ఈ కల్యాణంలో ముఖ్యమైన ఘట్టాలు లగ్నపత్రిక సంప్రదింపులు, విందుభోజనాల ఏర్పాట్లు, పెళ్లితంతు, ఆపై ఘనంగా చెప్పుకోదగ్గదిగా పెళ్లిసారెవైభవం. ఇవన్నీకూడా స్వామికల్యాణ ముఖ్యఘట్టాలే. ఆ సంక్షిప్తఘట్టాలనుగురించి కొంత తెలుసుకుందాం!!

“దివ్యమంగళస్వరూపుడు, శ్రీవేంకటాచలమున నివ సించువాడు, శ్రియఃపతివైన నీకు, మన బాంధవ్యంచే ఆశీ ర్వాదం ఒనరించుచున్నాను. నీ చరణకమలదర్శనోత్సుకుడనైన నాపేరు ‘ఆకాశరాజు’ అంటారు.

చైత్రశుక్లత్రయోదశిరోజున ఈ లగ్నపత్రికను వ్రాయు చున్నాను. నా పుత్రిక పద్మావతి అను కన్యకను నీకు ఈయ వలెనని నా సంకల్పం. నా కన్యకను పరిణయరూపంగా స్వీకరింపుము. వైశాఖశుద్ధదశమి శుక్రవారం బంధువులతో, పరివారంతో వచ్చి, పద్మావతిని పరిణయమాడి, నా అభీష్టం నెరవేర్చుము.” అని ఆకాశరాజు తన లగ్నపత్రికను శుక యోగీంద్రమునికి ఇచ్చి, వేంకటాచలంలో ఉన్న శ్రీనివాసుని వద్దకు పంపాడు. అలాగే శ్రీనివాసునికి తాను పదివేలు, నూరువేలతులాలబంగారంకాని, కోటి, పదికోట్ల వరహముల ధనాన్నిగాని ఈయగలననే కబురుకూడా చెప్పుమన్నాడు.

ఆ వార్తనందుకున్న శ్రీనివాసుడు ఇలా బదులు పంపాడు. “సకలసంపన్నుడు, సకలకల్యాణగుణాలుకలవాడు, సుధర్మునిపుత్రుడు, ఆకాశరాజు అన్నపేరుతో సకలదిక్కులకూ వ్యాపించిన కీర్తి కలవాడవు ఐన ఓ రాజచంద్రమా! నీకు ధను ర్ధారి శ్రీనివాసుడు నమస్కరించి వ్రాయు విన్నపం: మీరు వ్రాసిన పత్రిక నాకు సంతోషం కలిగించింది. వైశాఖశుద్ధదశమి శుక్రవారం వివాహమహోత్సవ శుభసమయంలో నీ పుత్రికను పాణిగ్రహణంలో స్వీకరించుటకు నేను అంగీకరిస్తున్నాను. నీవు నీ పుత్రికను నాకు ఇచ్చి గొప్ప కీర్తిని పొందగలవు”, అని శ్రీనివాసుడు వ్రాసి, ఆ శుభఅంగీకారపత్రికను శుకయోగీంద్రుని కిచ్చి ఆకాశరాజుకు ఇవ్వుమని చెప్పాడు.

ఇక ఇప్పుడు తన వివాహానికి వచ్చే ఋషులను, బ్రాహ్మణులను, బంధువులను, స్నేహితులను వివాహానికి ఎలా తీసుకెళ్లాలి? అతిథుల భోజనాలకు, వివాహవిందులకు, పెండ్లి కానుకలకు కావలసిన ధనమును సమకూర్చుడమెలా? అన్న సందేహం శ్రీనివాసునికి వచ్చింది.

ఆ వెంటనే శ్రీనివాసుడు కుబేరుణ్ణి, బ్రహ్మను, శివుణ్ణి పిలిచి స్వామితీర్థానికి పశ్చిమదిశలో ఉన్న అశ్వత్థవృక్షంవద్ద రహస్యసమాలోచన ఏర్పాటుచేశాడు. కలియుగధర్మానుసారం తనకు అప్పు ఇవ్వుమని అడిగాడు. అందుకు కుబేరుడు



సరేనంటూ, ఋణపత్రం వ్రాసి ఇవ్వుమన్నాడు. ఋణమునకు వడ్డీచక్రవడ్డీలు ఉంటాయని, అలాగే అంగీకారపత్రమునకు సాక్షి సంతకాలు కావాలన్నాడు.

శ్రీనివాసుడు కుబేరుని షరతులకు ఒప్పుకొని పదు నాలుగులక్షల రామముద్రగల బంగారునాణెములను అప్పుగా తీసుకొన్నాడు. అప్పుకి సాక్షులుగా బ్రహ్మదేవుడు, శివుడూ సంతకాలు చేశారు. వీరిరువురు శ్రీనివాసునికి బంధువులవటం వల్ల కలియుగధర్మానుసారం బంధుత్వం లేని ఇంకొకరి సాక్షి సంతకం కావాలని కుబేరుడు చెప్పాడు. అప్పుడు శ్రీనివాసుని అభ్యర్థనపై అక్కడే ఉన్న అశ్వత్థవృక్షం ఇంకొకసంతకం చేసింది.

ఈ విధంగా ధనం సమకూరింది. పద్మావతి శ్రీని వాసుల వివాహానికి కావలసిన సకలఏర్పాట్లు జరిగిపోసాగాయి. ఈ పనులన్నింటిని సమన్వయపరుస్తూ ఆ బాధ్యతను బ్రహ్మ, రుద్రుడు స్వీకరించారు.

స్వామిసరోవరంవద్ద అన్నం, పాపనాశనంవద్ద గుడాన్నం(పరమాన్నము), తుంబురుతీర్థంలో చిత్రాన్నం, పాండవ తీర్థంలో పులుసులు పెట్టుటకు, కుమారతీర్థంలో రకరకా లైన భక్ష్యాలు, దేవతీర్థంలో రుచికరమైన మరెన్నో శాకా హారాలు, ఇతరతీర్థాల్లో పసందైనలేహ్యాలు(పచ్చళ్ళు) తయారు చేసేలా నిర్ణయమైంది. ఆ విందుభోజనాలకు కోలాహలంగా అతిథులు, అభ్యాగతులు అందరూ వచ్చి సంతృప్తిగా భుజించారు. భోజనానంతరం శ్రీనివాసుడు అతిథులకు దక్షిణతాంబూలాల్ని ఇచ్చి సత్కరించాడు.

మరుసటిదినం శ్రీనివాసుడు గరుడవాహనుడై అత్యంత వైభవంగా నారాయణపురానికి, బంధుమిత్రస్వజనులతో వివాహ వేదికకు బయలుదేరాడు. అలా వస్తున్న సుకుమారుడు, సుంద రుడు, జగత్తుకు కారణభూతుడు, శ్రీమన్నారాయణావతారి ఐన శ్రీనివాసుణ్ణి చూచి ఆకాశరాజు ఎనలేని ఆత్మానందం పొందాడు.

ఆ సమయంలో ఆకాశరాజు శ్రీనివాసునికి వంద తులాల బంగారుకిరీటం, అంతే బరువున్న నడుముపట్టీ, భుజ కీర్తులు, మూపురాలు, రెండు నాగభుజభూషణాలు, కర్ణా భరణాలు, నవరత్నఖచితకంకణాలు, వజ్రాలు పొదిగిన కటిసూత్రం, పాదుకలు, బంగారుభోజనపాత్ర, చెంబు, పంచ పాత్రలు, పట్టువస్త్రాలు సమర్పించాడు (భవిష్యోత్తరపురాణం). ఆ తర్వాత పద్మావతీ శ్రీనివాసులకు అంగరంగవైభవంగా వివాహం జరిగింది.

ఆ తర్వాత పద్మావతిఅమ్మవారిని, శ్రీనివాసునివెంట వేంకటాద్రికి పంపుతూ, వారు ఆమెవెంట 300పుట్లపెసలు, అత్యధికమైన బెల్లం, చింతపండు, వేయికడవలపాలు, నూరుకుండల పెరుగు, 1500 పాత్రలనిండుగా నెయ్యి, హెచ్చు ఆవాలు, మెంతులు, ఇంగువ, ఉప్పు, పెద్ద పెద్ద పాత్రలలో నిండుగా నూనె, 200కుండల కలకండ, లెక్కలేనన్ని దోసపండ్లు, మామిడిపండ్లు, అరటిగెలలు, గుమ్మడిపండ్లు, కందమూలాలు, మిరియాలు, ఉసిరికాయలు, 200 కుండలనిండుగా తేనె, ఎన్నో అరటికాయలు ఇచ్చారు. అంతేకాక 10,000గుఱ్ఱాలు, 1000ఏనుగులు, 5000ఆవులు, 100మేకలు, 200మంది దాసీజనం, 300మంది దాసజనం, రకరకాలవస్త్రాలు, రత్నాలు పొదిగిన మంచం, పరుపులు, దిండ్లు సారెగా ఇచ్చారు అన్నది పురాణకథనం. ఈ సారెసంబారాలతో పద్మావతీదేవి అత్త వారింటికి ఘనంగా బయలుదేరింది. ఇదీ పద్మావతీదేవి పెళ్లి సారెగా అభివర్ణించబడింది.

శ్రీనివాసకల్యాణం చదివినవారికి, వినినవారికి సకల అభీష్టాలు నెరవేరుతాయన్నది ఫలశ్రుతి.

## వైకుంఠపాళి

### :: *94* – సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 మం | | 2 వా | లి | | 3 కా | 4 శి | | 5 అ |
| డో | | ణి | | 6 సి | | ల | | రుం |
| 7 ద | గా | | 8 వృ | ద్ధు | డు | | 9 రా | ధ |
| రి | | 10 కై | | దు | | 11 ప | | తి |
| | 12 వి | లా | సం | | 13 పా | ర్వ | తి | |
| 14 ఛా | | సం | | 15 స్వ | | ము | | 16 అ |
| 17 య | మి | | 18 జ | యం | తి | | 19 స్వా | హ |
| | | 20 మో | | వ | | 21 టో | | ల్య |
| | 22 అ | హం | కా | రం | | 23 పి | ల్లి | |

మన మహర్షులు

# శుకయోగీంద్రుడు


- డా॥ పులిగడ్డ విజయలక్ష్మి, 99890 63761

శ్రీమహాభారత, భాగవత, అష్టాదశమహాపురాణకర్తేకాక వేదవాఙ్మయాన్ని విభజించిన వ్యాసభగవానుని కొడుకు శుక మహర్షి. శుకమంటే చిలుక కదా. శుకముఖుడు కావడంవల్ల శుకనామధేయుడైనాడు.

శుకుడు పుట్టినంతనే సురగంగ వచ్చి స్నానం చేయించింది. పుట్టుకతోనే శుకుడు 16సం॥ల కుమారునిగా అవతరించాడు. సకల వేదవిదునిగానే జన్మించాడు. ఇదంతా వ్యాసునికి పరమశివుడిచ్చిన వరం. పార్వతీపరమేశ్వరులు స్వయంగా ఉపనయనం చేశారు. దేవేంద్రుడు కమండలాన్ని, దేవతలు ఎప్పటికీ మాయని వస్త్రాలను ఇచ్చి ఆశీర్వదించారు.

అద్వితీయమైన తపమాచరించి యోగసిద్ధిని పొంది బ్రహ్మర్షి అయ్యాడు. అందుకే ఆతణ్ణి శుకబ్రహ్మ, శుకయోగి అన్నారు. మిథిలాధీశుడైన జనకరాజర్షివద్ద మోక్షమార్గం తెలుసుకున్నాడు. తండ్రి వేదవ్యాసునివద్ద సృష్టిరహస్యాలను తెలుసుకున్నాడు. తపోనియమమంత్రాలను బోధించిన నారద మహర్షి ఆత్మయోగాన్ని చెప్పాడు. శుకుని పోలిన తత్త్వజ్ఞుడు, యోగీశ్వరుడు, తపస్వి ముల్లోకాలలోను లేడు.

శుకయోగి స్త్రీ, పురుషభేదానికి అతీతుడు. ఒకసారి నదిలో నగ్నంగా జలకాలాడుతున్న అప్సరసలు- అటుగా నడిచి వెళుతున్న శుకులవారిని చూసి, ఒక్క ఉదుటున అతణ్ణి సమీపించి నమస్కరించారు. వారు నమస్కరించడం, నగ్నంగా ఉండడం శుకుని నేత్రానికి, మనోనేత్రానికి అందలేదు. మరికొద్ది సేపటికి ఆ వెనుకనే వస్తున్న వ్యాసమహర్షిని చూసిన అప్సరసలు పరుగున వెళ్లి, వస్త్రాలు ధరించి వచ్చి నమస్కరించారు. అది గమనించిన వ్యాసర్షి ఆశ్చర్యపడి "నేను వృద్ధుడను. శుకుడేమో యౌవనుడు. అతణ్ణి చూసిన నిగ్గిల్లారు. ఏమిటిది"- అని ప్రశ్నించాడు వారిని. అందుకు ఆ అప్సరసలు "మునీంద్రా! మీరు సర్వజ్ఞులు. మీ పుత్రుడు సర్వాతీతుడు. ఏదీ మనస్సుకు పట్టనివాడు. ఆతనిదృష్టి, బుద్ధి, మనసు, సర్వం పరమాత్ముని స్మరణమీదే లగ్నమై ఉంటుంది. స్త్రీ, పురుష వస్త్ర వివస్త్ర భేదాలను ఎరుగనివాడు. దేహధ్యాస అనేదే లేనివాడు. ఆతను మహాయోగిపుంగవుడు" అని చెప్పారు. అది విని వ్యాసముని పరమానందభరితుడైనాడు. తనను మించినవాడు తన పుత్రుడు. అందుకే శుకుణ్ణి అందరూ అవదూత అని, పరమ హంస అని కీర్తిస్తారు.



పాండవుల మనుమడైన పరీక్షిత్తుమహారాజుకు ఏడురోజులపాటు మహాభాగవతాన్ని వివరణాత్మకంగా వినిపించి, మోక్షానికి అర్హుణ్ణి చేశాడు. శ్రీపద్మావతి వేంకటేశ్వరుల కల్యాణానికి ముహూర్తనిర్ణయం చేయడమేకాక పెళ్లిపెద్దగా, కర్తగా దగ్గరుండి వివాహాన్ని జరిపించాడు.

శుకుడు తన ఆత్మను తానే స్వయంగా ప్రకృతిలో విలీనం చేసుకున్న ఆత్మజ్ఞాని. భారతం, భాగవతం, దేవీభాగవతం, పురాణాలు- శుకయోగీంద్రుని వేనోళ్ళ అభినుతించాయి.




"తీర్థే క్షేత్రే సదాకార్యం
స్నాన దాన జపాదికమ్
అన్యథా రోగ దారిద్ర్య
మూకత్వాద్యాప్నుయాన్నరః"

పుణ్యక్షేత్రంలోని తీర్థంనందు నిత్యము స్నాన, దాన, జపాదులు చేయాలి. అలాచేయని మానవుడు రోగం, దారిద్ర్యం, మూగతనం మొదలైన లోపాలను పొందుతాడని సూతమహర్షి చెప్పాడు.

భారతదేశం వేదభూమి, కర్మభూమి. దైవం మానుష రూపంలో నడయాడిన దేవభూమి ఇది. భూమండలమంతా ఒక పవిత్రపుణ్యక్షేత్రం. దుష్టశిక్షణ, శిష్టరక్షణకోసం ఆ పరమాత్మ అనేకరూపాల్లో అవతరించిన నేల ఇది. ఆసేతుహిమాచల పర్యంతం పరిశీలిస్తే కొన్నిలక్షల ప్రసిద్ధదేవాలయాలు ఉన్నాయి. మనకు ముక్కోటిదేవతలున్నారంటారు. చిన్నపెన్న కలిపితే దాదాపు అన్నే క్షేత్రాలుకూడా ఉండవచ్చు.

దేవాలయాలు ఏదో ఒక నదీతీరాన మనకు కనిపిస్తాయి. ముఖ్యంగా కాశి, గయ, ఓంకార్‌వంటి పుణ్యక్షేత్రాలెన్నో నదీతీరాన ఉన్నాయి. పుణ్యక్షేత్రాలకు, తీర్థక్షేత్రాలకు భేదం ఉంది. నదీనదాలు, సముద్రతీరాన వెలసిన ఆలయాలను తీర్థాలు అంటారు. పవిత్రమైన గంగ, గోదావరి, కృష్ణ, తుంగ భద్రనదీతీరాలందు కాశీ, భద్రాచలం, శ్రీరంగంవంటి క్షేత్రాలు దర్శనమిస్తాయి. సముద్రతీరంలో ఉన్న రామేశ్వరం, గోకర్ణం వంటివి తీర్థాలు. కొండల సమీపంలో ఉన్న తిరుమల, మంగళగిరి, సింహాచలం, శ్రీశైలంక్షేత్రాలని పిలువబడతాయి.

ఋషులు నివసించటంవల్ల కొన్నిస్థలాలు; దేవతలు అనుగ్రహించటంవల్ల కొన్నిప్రదేశాలు పుణ్యక్షేత్రాలుగా ప్రసిద్ధి చెందాయి. మానవులు బాధ్యతలు తీరిన తరువాత తీర్థయాత్రలకు బయలుదేరుతారు. తీర్థయాత్రలు ఆధ్యాత్మికఅన్వేషణతో చెయ్యాలి. ఆసేతుహిమాచలపర్యంతం పరిశీలిస్తే ఎన్నో పుణ్యక్షేత్రాలున్నాయి. తీర్థయాత్రలు చేసేటప్పుడు ఆ క్షేత్రతత్త్వాన్ని, ఆ క్షేత్రపాలకుని విశేషాలు, అక్కడ వేంచేసిఉన్న స్వామిని గురించిన విశేషాలు తెలుసుకుని వెళ్ళాలి. అందుకు మనస్సే ప్రధానం. మనం స్నానం చేసేటప్పుడు శ్రద్ధతో...

"గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతీ
నర్మదే సింధుకావేరి జలేస్మిన్ సన్నిధింకురు ॥

అనే శ్లోకాన్ని పఠించి స్నానంచేస్తే నదులలో, తీర్థాలలో స్నానంచేసిన ఫలితం వస్తుంది. అంతేగాని పరమాత్మపై గురిలేకుండా ఏ నదిలో మునిగినా ఫలితముండదు. పరమాత్మపై భక్తి, మనసుకు ప్రశాంతత, ఆధ్యాత్మికపరిణతి లేకుండా ఎన్ని పుణ్యక్షేత్రాలు తిరిగినా, ఎన్ని తీర్థాలలో స్నానం చేసినా ఫలితం శూన్యం. అందుకే అన్నమయ్య-

"నదులొల్లవునా స్నానము
కదుసదరము నాకీ స్నానము
ఇరువంకల నీయేచిన ముద్రలు
ధరించుటే నా స్నానము.....
..... తిరువెంకటగిరి దేవా
నీ కథాస్మరణమే నాస్నానము".

అన్న కీర్తనలో స్నానమహిమ వర్ణించబడింది. అలాగే తిరుచానూరు పద్మసరోవరంలో వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవేరి శ్రీపద్మావతిఅమ్మవారికి కార్తికంలో ప్రతిసంవత్సరం వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఆ బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారి జన్మతిథి పంచమీతిథిని పురస్కరించుకొని **"పంచమీ తీర్థం"** అంటే **"చక్రస్నానం"** జరుగుతుంది. ఈ పంచమితీర్థ స్నానం చాలా ప్రశస్తమైనది. ఆలయంవద్ద ఉన్న వాహన మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన చిన్నపుష్కరిణిలో ఈ పంచమితీర్థం శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. పంచమీరోజు ఉదయం అమ్మవారికి పల్లకీఉత్సవం నిర్వహిస్తారు. ఆ రోజు తెల్లవారుజామున పసుపు, కుంకుమ, ప్రసాదాలు, తులసి, వస్త్రాభరణాలతో కూడిన సారె తిరుమలనుంచి బయలుదేరి తిరుచానూరుకు చేరుకుంటారు. ప్రతి సంవత్సరం కార్తికంలో పంచమిరోజున అమ్మవారికి సారెతో తీసుకెళ్ళడం ఆనవాయితీ. ఆ రోజు వాహనమండపంలో అమ్మవారికి. చక్రత్తాళ్వార్‌కి స్నపన తిరుమంజనం నిర్వహించి, పుష్కరిణిలో స్నానం చేయిస్తారు. ఇది కార్తికబ్రహ్మోత్సవాల్లో **"పంచమీతీర్థం"**గా ప్రసిద్ధిపొందింది. ఆ సమయంలో ఆ తీర్థంలో స్నానంచేసినా, చూసినా పాపాలన్నీ తొలగిపోతాయని భక్తులవిశ్వాసం.

నదులలో స్నానంచేసి, అక్కడి స్వామిని దర్శించినంత మాత్రం చాలదు. మనోవాక్కాయకర్మలచే పరమాత్మను ధ్యానించి నపుడు మాత్రమే అంతరంగశుద్ధి కలుగుతుంది. నిర్మలమైన అంతరంగమే సకలపుణ్యకారకం. తీర్థక్షేత్రదర్శనసమయాల్లో ఈ భావశుద్ధి, అంతఃశుద్ధి ప్రధానం. బాహ్యమైనటువంటి శరీరం కాదు. శ్రీశైలక్షేత్రంలో ధూళిదర్శనం అని చేస్తారు. అది అత్యంత పుణ్యప్రదమని భక్తులనమ్మకం. ఊళ్ళనుంచి వెళ్ళినవారు స్నానాదికాలు చేయకుండానే వెళ్ళి స్వామిని దర్శిస్తారు. ఇక్కడ స్వామిని దర్శించాలనే మనస్సే ప్రధానంగాని స్నానాదికాలు కావు. స్నానం, దర్శనాలచే ముక్తి కలుగుతుందంటే ...

**"గంగాజలే కిం వసంతి మత్స్యాః**
**దేవాలయే పక్షిగణా వసంతి**
**భావోజ్ఝితాస్తే నఫలం లభంతే**
**తీర్థాచ్చ దేవాయతనాచ్చ ముఖ్యమ్"**

గంగాజలంలో చేపలు నివసించడం లేదా? దేవాలయంపై పక్షిగణాలు నివసించడం లేదా? అంతమాత్రంచేత అవి తీర్థ, స్నానఫలాన్నిగాని, దేవాలయనివాసఫలాన్నిగాని పొందలేవు కదా! ఎందుకంటే వాటికి భక్తి అంటే తెలీదు. వివేచనాజ్ఞానం శూన్యం.

విచక్షణాజ్ఞానం కలిగిన మనిషి భగవంతుడిపై భక్తి, ప్రీతి లేకుండా ఎన్ని నదీస్నానాలు చేసినా, ఎన్ని ఆలయాల చుట్టూ తిరిగినా పై శ్లోకంలో చెప్పినట్లుగా చేపలకు, పక్షులకు, మనిషికి భేదముండదు. ఈ చరాచరజగత్తుకు హేతువు, ప్రాణాధారం నీరే అనటంలో సందేహం లేదు. అందుకే

**"గంగాధరో హరస్సోపి విష్ణురంబోధిమందిరః**
**బ్రహ్మా జలసంభూతః తస్మాత్ సర్వాధికంజలం"**

పరమేశ్వరుడు గంగను శిరస్సున ధరిస్తే, సముద్రంలో నివసిస్తున్నాడు నారాయణుడు. నీటపుట్టిన కమలంలో జన్మించాడు బ్రహ్మ. కనుక తీర్థానికంత మాహాత్మ్యముంది. మనకు ఎన్నో పుణ్యనదులున్నాయి.

**"త్రిభిః సారస్వతం తోయం**
**సాప్తా హేనతు యామునాం**
**నద్యః పునాతి గాంగేయం**
**దర్శనా దేవనార్మదాం"**

ఏడుసార్లు యమునానదిలో, మూడుసార్లు సరస్వతీ నదిలో, ఒక్కసారి గంగానదిలో స్నానంచేస్తే పుణ్యమొస్తుంది. కాని నర్మదానదిని దర్శించినంతమాత్రంచేతనే పుణ్యం కలుగుతుంది.

ఏ నదిలో ఎన్నిసార్లు స్నానం చేశామన్నది కాదు. ఏ ఆలయదర్శనం చేశామన్నది కాదు. ముఖ్యంగా మనస్సే ప్రధానం. పర్వతాలమీద, సరస్సులలో పుట్టిన నదులు అడవుల గుండా ప్రవహిస్తూ ఆ కొండలమీద, అడవులలోగల మూలికలు, ఓషధుల సారాన్నంతటిని తమలో నింపుకొని, తమలో స్నానం చేసేవారికి ఆరోగ్యప్రదాతలవుతున్నాయి. ఆయుర్దాయాన్ని వృద్ధి చేస్తున్నాయి. కనుక శ్రద్ధ, భక్తి, చిత్తశుద్ధి, మనశ్శాంతితో చేసే ఏ స్నానమైనా, పూజ అయినా మనిషికి అనంతఫలాలనిస్తుంది. అందుకే

**'నదీస్నానం పుణ్యఫలదం**
**క్షేత్రదర్శనం ముక్తిదాయకం'**

అన్న పెద్దలమాట అక్షరసత్యం.

# స్వామిసేవలో... ఫణిరాజు

– శ్రీ కల్లూరు గురుప్రసాద్

శ్రీమహావిష్ణువుకు తన శరీరాన్ని పాదపీఠికగా, ఆసనంగా, శయ్యగా మార్చి సేవిస్తున్న ధన్యుడు శేషుడు. ఆ పరమాత్మసేవే ధ్యేయంగా తన స్వామికి ఎన్నివిధాల ఉపయోగపడాలో అన్నివిధాల తనమీదే ఆధారపడేలా చేసుకున్న మహిమాన్వితుడు.

ఎన్ని యుగాలైనా స్వామిలో తాను, తనలో స్వామిగా మమేకమై 'నిత్యం స్వామికి సుఖం. సంతోషం కలిగించడమే తన విధి అన్న అంకిత భావంతో స్వామిని సేవిస్తూ అందులోనే ఆనందిస్తాడు ఆదిశేషుడు. ఇంతటి సేవానిరతి, కైంకర్యనిష్ఠ వేరెక్కడా కనిపించవు. శేషుని ఈ అనితరసేవాపరాయణత్వంవల్ల శేషశయనుడు శేషాచలవాసుడైనాడు.

శ్రీమహావిష్ణువు శేషశయనుడు. శేషం అంటేనే ఎప్పటికీ మిగిలి ఉండేది అని అర్థం. ఆ శేషం తిరుగులేని, శాశ్వతమైన జ్ఞానానికి గుర్తు. అటువంటి జ్ఞానాన్ని ఆసనంగా, ఆలంబనగా కలవాడు శ్రీమన్నారాయణుడు. కనుక ఆ స్వామి శేషశయనుడు.

శ్రీమన్నారాయణునిపట్ల అంతటి అంకితభావంతో, అచంచలభక్తితో ఉంటూ ఆర్తితో స్వామిని సేవిస్తున్నాడు శేషుడు. ఆ భావంతోనే స్వామికి శయనంగా అమరినాడు శేషుడు.

యోగశాస్త్రరీత్యా ఆధ్యాత్మికవిజ్ఞానులు సప్తగిరులను ఏడుచుట్లు చుట్టుకున్న ఫణిరాజుగా పేర్కొంటారు. మనిషి శరీరంలోని నాడీవ్యవస్థకు సమన్వయంగాకూడా శేషుణ్ణి చెబుతారు. మనిషి నాడీవ్యవస్థలో జ్ఞానచక్రాలు ఉంటాయి. అవి–మూలాధారం, స్వాధిష్ఠానం, మణిపూరకం, అనాహతం. విశుద్ధి, ఆజ్ఞా, సహస్రారం. మూలాధారంనుండి సహస్రారం వరకుగల సుషుమ్నానాడీమండలమే వేయిశిరస్సుల శేషుడు.



17-11-2023న నాగులచవితి, తిరుమల శ్రీవారి పెద్దశేషవాహనసేవ సందర్భంగా...

తమోగుణాన్ని నియంత్రించి తలెత్తి పడగవిప్పి నిలబడగలిగితే దాని మార్గం ఊర్ధ్వం అవుతుంది. అప్పుడు మనిషి విషయాసక్తిని విడిచి ఆధ్యాత్మికమార్గానికి మరలగలడు. అలా తమోగుణాన్ని నియంత్రించడంవల్ల సిద్ధించినయోగాన్ని నశించకుండా చూసుకోగలిగితే మనిషి సాధనాస్థాయికి చేరుకోగలుగుతాడు. మూలాధారంనుండి సహస్రారంవరకు ఆ సాధన వదలకుండా ఆధ్యాత్మికకేంద్రాలైన ఏడు నాడీచక్రాలను మధించి జాగృతం చేయగలిగితే ఆ అనుభవం పరమాత్మను దర్శింపజేయగల్గినదియై ఉంటుంది. భగవంతునితో కలిసి ఉండడమే కదా యోగం! ఆ స్థితికి చేరుకున్న యోగి మనస్సు కలుషితం కాదు. అట్టివారికి ఏ విషయంలోనూ ఏ భయమూ ఉండదు. ఆరునాడీచక్రాలను అధిరోహించి సుషుమ్నానాడిని చేరి అక్కడ పరబ్రహ్మను చేరే ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. ఇది యోగశాస్త్రరీత్యా మనిషిలోని నాడీ మండలాన్ని ఆదిశేషుని ఏడుశిరస్సులకు సమన్వయంగా చెప్పబడిన విశ్లేషణ.

శేషునిలా ఆర్తి కలిగిన భక్తుడు భగవంతుని పాదసేవ తప్ప ఏదీ కోరడు. ఏదిచేస్తున్నా భగవదర్పణంగా చేస్తాడు. ప్రతిజీవిలోను పరమాత్మను దర్శించి ఆనందం పొందుతాడు. మనలో నిద్రాణమైఉన్న శక్తిని ప్రేరేపించుమని, మనల్ని ఉద్ధరించుమని, అశేష, సుశేష, విశేషసేవలందిస్తూ సశేషంగానే ఉన్న నీ ఆంతరంగికభక్తుల సరసన నా పేరునూ చేర్చు తండ్రీ అనీ; నా సేవ, నేనుచేసిన నీ ఆరాధన జ్ఞప్తికి తెచ్చుకోమని వేడుకోవాలి. అంకిత భావంతో సేవించి స్వామి ప్రసన్నుడై మనవైపు చూసేలా చేసుకోవాలి.

కరుణామయుడైన స్వామి వీక్షణాలకోసం చకోరంలా ఎదురుచూడాలి. ఆ విధమైన సేవాభావంతో శేషశాయికి శిరస్సులువంచి నమస్కరిద్దాం. ఆ స్వామి అపారకరుణాకటాక్ష వీక్షణాలు పొందుదాం.

**కామక్రోధ వియుక్తానం యతీనాం యతచేతసాం।**
**అభితో బ్రహ్మ నిర్వాణం వర్తతే విదితాత్మనాం॥ (5-26)**

ఎవరైతే కామక్రోధాదులను విడిచిపెట్టి, మనస్సును జయించిన ఆత్మజ్ఞానసంపన్నులైన సన్యాసులకు సర్వత్రా మోక్షం కలుగుతుంది అని భగవానుడు శ్రీమద్భగవద్గీత పంచమాధ్యాయమైన కర్మసన్యాసయోగంలో చెప్పాడు. అనగా ఏ విషయం మీద, ఏ వస్తువుమీద ఏ కోరికలులేకుండా మనోవాక్కాయ కర్మములతో ఏకాగ్రతను కలిగి పరమాత్మను సేవించినవారికి మోక్షం కలుగుతుందని అర్థం. యతులకైనా, సన్యాసులకైనా, సంసారులకైనా చిత్తశుద్ధి, ఏకాగ్రతలే ప్రధానం అని అర్థం. అవి లేకపోతే ఏమవుతుందనేదానికి ఈ జడభరతునికథే నిదర్శనం.

పూర్వం ఋషభుడు అనే రాజుకి భరతుడు అనే కుమారుడున్నాడు. అతడు బాల్యంనుంచి విషయవాంఛలకు దూరంగా ఉంటూ దేనికి చలించేవాడు కాదు. అందువల్ల అతణ్ణి అందరు జడభరతుడు అని పిలిచేవారు. జడత్వం అంటే దేనికి చలించనితత్త్వం అని అర్థం. ఆయన తండ్రి మరణంతర్వాత రాజ్యపాలన చేపట్టి ప్రజానురంజకంగా పరిపాలన చేశాడు.




భగవద్గీత సందేశం

# మోహనాశమే మోక్షహేతువు

-శ్రీ ఎం.రవితేజ

ఐనా ఆయన ఎల్లప్పుడు జప, తప, ధ్యానాదుల్లో మునిగి ఉండేవాడు. చివరకు రాజ్యాన్ని తన కుమారులకు అప్పగించి, తపస్సు చేసుకోవడానికి ఒక నదీతీరానికి వెళ్లాడు. ఎన్నో సంవత్సరాలు తపస్సు చేశాడు. ఆ సమయంలో ఒకసారి నిండుగర్భిణి ఐన ఒక లేడి ఆ నదీప్రాంతానికి వచ్చింది. దప్పికతో ఉన్న ఆ లేడి నీటిని త్రాగటానికి నదివద్దకురాగా దాన్ని చూసిన సింహం గాండ్రించి దానిపై దూకబోయింది. భయంతో ఆ లేడికి అప్పటికప్పుడు ప్రసవం జరిగి ఒక బిడ్డ పుట్టింది. కానీ, ఆ తల్లిలేడి మరణించింది. లేడిపిల్లకూడా నీళ్లల్లో కొట్టుకొనిపోవటం చూసిన భరతుడు దానిని కాపాడి తన ఆశ్రమానికి తీసుకొచ్చాడు. అప్పటినుండి తల్లిలేని ఆ లేడిపిల్లకు తానే తల్లి అయ్యాడు. గడ్డిపరకలు దానినోటికి అందిస్తూ, దానిబాగోగులు, ముద్దుముచ్చటలు తానే చూస్తూ పెంచాడు. అది ఆశ్రమంలో గంతులు పెడుతుంటే చూసి మురిసిపోయాడు. ఆ లేడిపిల్లధ్యాసలో తన జప, తప ధ్యానాదులనుకూడా మరిచిపోయాడు. చిట్టచివరకు సర్వసంగ పరిత్యాగి ఐన ఆ రాజర్షికి ఆ లేడిగురించి తప్ప వేరు ధ్యాస లేకపోయింది. ఇంతలో ఆయనకు అంత్యకాలం సమీపించింది. ఆ సమయంలోకూడా ఆయన ఆలోచనంతా దానిమీదే ఉంది. చివరకు దానినేచూస్తూ ప్రాణాలు విడిచాడు. ఆ కారణంతో ఆయన మరుజన్మలో లేడిగా పుట్టాడు. ఐతే ఆయనకు పూర్వ జన్మజ్ఞానంకూడ ఉన్నది.

అంత్యమున మన ఆలోచన దేనిమీద ఉంటుందో మరుజన్మ అలాగే సంభవిస్తుందనటానికి నిదర్శనం ఈ జడ భరతుని వృత్తాంతం. కనుక అంత్యసమయంలో భగవంతుని మీద మాత్రమే మనస్సు నిలపాలి. అదే మనలను భగవంతుని వద్దకు చేరుస్తుందని, లేకపోతే ఇహలోకంలోనే జననం తప్పదని ఈ కథద్వారా మనకు తెలుస్తోంది. కనుక భగవద్ధ్యానమే మోక్షహేతువు. అంతకుమించిన సాధనం వేరులేదు.

# భారతంలో ఉపాఖ్యానాలు

- ఆచార్య ఉగ్రాణం చంద్రశేఖరరెడ్డి,
94403 12815

మానవసమాజంలో తిర్యక్కులకు, మానవులకు విడదీయరాని సన్నిహితసంబంధముందని చెప్పవచ్చు. లోకహితం, ఉపదేశం కోసం భారతంలో తిర్యక్కులను పాత్రలుగా చేసి, ఉపాఖ్యానాల ద్వారా చక్కనికథలు చెప్పి, కవిత్రయకథలు మానవజాతి ప్రగతికి, చక్కని రాచబాట వేశారనటం అతిశయోక్తి కాదు. తిర్యక్ప్రవృత్తిని కథల్లో చిత్రించడంద్వారా మానవుడు తనలోని చెడ్డగుణాల్ని ఎలా పరిహరించుకోవాలో, ఉత్తమగుణాలు ఎలా తన ప్రవృత్తిలో నింపుకోవాలో స్పష్టంగా గోచరిస్తుంది.

భారతం శాంతిపర్వం తృతీయాశ్వాసంలో మనకందరికి తెలిసిన మూడుచేపలకథ ఒకటుంది. దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడు. ఈ మూడుచేపలు స్నేహంతో ఒక కొలనులో ఉండేవి. ఒకరోజు దీర్ఘదర్శి తన మిత్రులతో వేసవికాలం వచ్చి, మడుగు ఇంకిపోయే పరిస్థితొచ్చింది. నీళ్లు ఎక్కువగా ఉన్న చోటికి వెళదాం అని చెప్పాడు. అందుకు ప్రాప్తకాలజ్ఞుడు ఎప్పటికి ఏది అవసరమో అప్పుడే చేయాలి అని దాటవేశాడు. దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుడి మాటలువిని దీర్ఘసూత్రుడు ఇలా అన్నాడు. మహాసముద్రంవలె ఉన్న ఈ మడుగును వదిలివెళ్లట మెందుకు? ఈ కొలనులో నీరింకిపోయినతర్వాత చూద్దాంలే అని బదులిచ్చాడు.

కానీ, దీర్ఘదర్శిమాత్రం, వీరిమాటలు నచ్చక తన మనస్సుకు నచ్చినరీతిలో పిల్లకాలువద్వారా పెద్దమడుగులోకి వెళ్లిపోయింది. తక్కిన రెండుచేపలు అక్కడే ఉండిపోయాయి. కొన్నిరోజులకు, మడుగు ఎండిపోయి నీరు తగ్గిపోయింది. ఆ చేపలకు భయం పట్టుకొంది. మడుగు ఎండిపోవటంవల్ల జాలర్లు వలలతో వచ్చి, చేపలు పట్టి తాళ్లకు గుచ్చుకొన్నారు. అప్పుడు ప్రాప్తకాలజ్ఞుడు ఒకత్రాటిని కరచుకొని చచ్చినదానివలె ఉండిపోయింది. జాలరి దాంతో మంచినీటిలో బురదను తొలగించుకోవాలని దిగాడు. అప్పుడు త్రాడువిడిచి ఆశ్చర్యంగా నీటిలోకి ప్రాప్తకాలజ్ఞుడు జారుకొన్నాడు. దీర్ఘసూత్రుడు మాత్రం తప్పించుకొనే ఉపాయం తోచక ధైర్యం కోల్పోయి జాలరిచేతికి చిక్కి మరణించింది.

ఒకే మడుగులో మూడుచేపలు నివసించినా దీర్ఘదర్శి పేరుకు తగ్గట్టు మంచిఆలోచన కలది కాబట్టి, ముందుచూపుతో ప్రవర్తించి, నీరుండగానే మరో మడుగులోకి వెళ్లింది. ప్రాప్త కాలజ్ఞుడు అంతదూరపుచూపులేకపోయినా, సమయానికి తగ్గట్టు ప్రవర్తించి, రాబోయే ఆపదనుండి తప్పించుకొని బాగుపడింది. దీర్ఘసూత్రుడు మాత్రం, నిద్రావస్థలోనే ఉండి జాలరిచేత తన ప్రాణం పోగొట్టుకుంది.

పై దానినిబట్టి మనుష్యులు ఎప్పుడూ ముందుచూపు కలవారై మెలగాలనీ, లేనిచో ఇబ్బందులపాలై కష్టాలపాలవు తారనే ఒక నైతికసత్యం ఈ కథద్వారా తెలుస్తోంది. ఇక్కడ చేపల్ని ఎందుకు సంకేతంగా తీసుకొన్నారో ఆలోచిస్తే, ఒక విషయం అవగతమవుతుంది. సంసారాన్ని ఎప్పుడూ సాగరంతో పోలుస్తాం. అందులో ఈదే చేప జీవికి సంకేతంగా నిలుస్తుంది కాబట్టి.

భారతంలో ఉపాఖ్యానాల్లో తిర్యక్కులకు మాటలు రాకపోయినా, మానవులకు మార్గదర్శకంగా ఉంటాయి. ఉపకారికి ఉపకారం చేయటం మనుష్యుల గొప్ప. తిర్యక్కుల్లో అపకారికికూడా ఉపకారంచేయటం ఈ కథలో కన్పిస్తుంది. కర్ణపర్వం ద్వితీయాశ్వాసంలోని హంస-కాకీయోపాఖ్యానం దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు.

**51వ పేజీలోని.. 'తేడాలు గుర్తించండి' కి జవాబులు**



సముద్రంవద్ద ఒక ద్వీపంలో ధర్మవర్తి అను రాజు రాజ్యం పరిపాలిస్తూండేవాడు. అక్కడే ఒక వైశ్యుడు నివాసముండేవాడు. అతనికి చాలామంది పుత్రులున్నారు. అక్కడికి కాకి ఒకటి వచ్చి చేరింది. వైశ్యునిపుత్రులు దానికి ఎంగిళ్లుపెట్టి బాగా పోషించారు. అది బాగా బలిసి, కొవ్వుపట్టి, ఏ పక్షులు తనకు సాటిరావని విర్రవీగుతూండేది.

ఒకసారి సముద్రతీరంలో హంసలు విహరిస్తూన్నాయి. వాటిని వైశ్యపుత్రులు కాకికి చూపించారు. అంతేకాక, పక్షుల్లో గొప్పవైన హంసలతో ఆకాశమార్గంలో కలిసి పరుగెత్తమని చెప్పారు. ఉచితానుచితాలు తెలియని కాకి అల్పబుద్ధులమాటలు విని హంసలదగ్గరకు వచ్చింది. మీలో మేటి అయిన హంసతో ఆకాశంలో ఎగరడానికి పోటీకిరమ్మని వాగింది. అప్పుడు హంసలు ఎంతోసహనంతో కాకితో మాకు మిక్కిలి బలం ఉంది. కాబట్టి ఎంతదూరమైనా ఆకాశంలో తిరుగుతాం, మాతో పోటీవద్దు అని చెప్పాయి. కాకి వినకుండా హంసతో పోటీకి దిగింది. అనవసరంగా రెచ్చగొట్టిన కాకిని బలిష్ఠంగా ఉన్న హంసలు సునాయాసంగా పందెంలో ఓడించి బుద్ధి చెప్పాయి. చివరకు కాకికి ప్రాణంపోయే పరిస్థితి వచ్చింది. అప్పుడు ఆ కాకి హంసలతో నేను ఎంగిళ్లు తిని, కొవ్వుపట్టి విర్రవీగాను. నా తప్పును క్షమించి, నన్ను నా కాకులతో కలపండని ప్రాధేయ పడింది. పశ్చాత్తాపం పొందిన కాకిని ఆ హంసలు తన పక్షులతో కలపగా చాలా సంతోషం పొందింది. హంస కాకితో తొందరపాటుపనులు ఎప్పుడు చెయ్యొద్దు. ప్రాణంమీదికి తెచ్చుకోవద్దని హితవు చెప్పింది.

మానవుల్లో ఇలాంటిప్రవృత్తి కలవారు చాలామంది ఉన్నారు. మానవులు కాకిప్రవృత్తిని ఆశ్రయించక హంసల ప్రవృత్తినే ఆశ్రయించాలి. అప్పుడే మానవులు ఉదాత్తులై ధన్య చరితులవుతారు.

చివరగా, అనుశాసనికపర్వం ప్రథమాశ్వాసంలో గౌతమీ–లుబ్ధక–మృత్యుకాలసంవాదం లేదా సర్పమృత్యుకాల సంవాదం అనే కథ. సహజంగా కాటు వేసేగుణం సర్పాలకు ఉంటుంది. గౌతమీ అనే బ్రాహ్మణస్త్రీకుమారుణ్ణి పాము కాటు వేయగా మరణించాడు. అందుకు ఆమె ఏడుస్తోంది. పాములు పట్టేవాడొచ్చి, ఆ పామును తెచ్చి దాన్ని చంపేస్తానన్నాడు. వెంటనే ఆ పాము, ఇందులో నా తప్పేమి లేదు. మృత్యువు పంపగా బాలుణ్ణి నేను కాటు వేశానని చెప్పింది. ఆ వెంటనే మృత్యువు వచ్చి, నీవుకాని, నేనుకాని బాలునిచావుకు కారణం కాదు. కాలుడు పంపగా నిమిత్తమాత్రం మేము వచ్చాం. అందుకు వెంటనే కాలుడు ఈ కార్యం ఒకరుచేశారు, ఒకరు చంపారు అనటం పొరపాటు. కర్మానుసారేణా ఎవరికర్మవల్ల దాని ఫలితం వారు అనుభవించాలి. ఇతరులు నిమిత్తమంత్రులు మరియు నడిపించేది వారికర్మ అని వ్యాఖ్యానించాడు. పాము, మృత్యువు, కాలుడు, ఈ బిడ్డచావుకు కారణం కాదని, వేదాంతాల్లో, ఉపనిషత్తుల్లో చెప్పబడింది.

జననమరణవిషయాల్లో, సుఖదుఃఖాల్లో జీవునికి చేసిన కర్మఫలంవల్లే సిద్ధిస్తాయని, దాన్ని తప్పించటం శివునికి కూడా వశంకాదని చెప్పటం శ్రీకృష్ణుని గీతోపదేశంతో గుర్తుకొస్తుంది.

## శ్రీకృష్ణామృతం..



వెన్నంటి ఉండువాడు వెన్నంటి మనసూవాడు
వెండివెలుగూలావాడూ వేంకటాద్రిరాయడు వాడు

వేదోపనిషత్తులకు కర్తయు భర్తయు వాడు
వేదవేదాంగులకు వైనము వాటము వాడు

వేదవిహితకర్మల వెలసిల్లు వెగ్గలీడు
వేదాంగవేత్తలకూ వేల్పుగ వెలయువాడు

వేవేలా పూజారీతుల వెగ్గలముగ మురిసెడివాడూ
వేనోళ్ళ కీర్తనసేయగా వేగిరమే కాచెడివాడూ

వేయంచులవాలు ధరియించి వెలుగూవాడూ
వేడగనే భక్తులబ్రోచి వెతలన్నీ తీర్చూవాడు

వెదురువేణువుదాల్చి వెలిమ్రానై నిలచేవాడు
వేడినభక్తులకు వరములు వేగముగానోసగూవాడు

వెన్నునంటు ప్రేమగా వేడగా వేరవుగా జయమిచ్చినవాడు
వేడికంటివానివోలె వెల్లువగా కాచేవాడు

వెనువెంటనే ఆర్తినితీర్చు వెదదగు హృదయమువాడు
వేడుకగా తిరుమలగిరిపై వెలదిగ వెలసినవాడు

–'అనంత' కృష్ణసుందరి సత్తిరాజు,
99103 45794

108 దివ్యదేశాలు

# తంజైమామణికోవిల్

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

చోళనాడున తంజావూరుకు ఉత్తరంలో తిరువయ్యారు పోవుమార్గంలో మూడుకిలోమీటర్లదూరంలో దక్షిణపెన్నానది తీరంన మూడుదేవాలయాలు కలిపి ఒకే దివ్యదేశంగా కీర్తింపబడే దివ్యదేశమే తంజైమామణికోవిల్. ఇది తంజైమామణి కోవిల్, విణ్ణాంతుంకరై నదీతీరంలో మణిక్కున్నమ్, తంజైయాళి నగర్ అనే మూడు దేవాలయాలు ఆళ్వార్లచేత ఒకే దివ్యదేశంగా మంగళాశాసనం చేయబడి ఉన్నది.

మొట్టమొదటగా తంజైమామణికోవిల్- ఇచ్చట వేంచేసి ఉన్నటువంటి స్వామి మూలమూర్తి నీలమేఘపెరుమాళ్. తూర్పుదిక్కున నిలుచున్నభంగిమలో శెన్కమలతాయార్‌తో వెళ్లారు. కన్యాపుష్కరిణి అమృతతీర్థం, సుందరవిమానంతో స్వామి దర్శనభాగ్యాన్ని కలిగిస్తున్నాడు. పరాశరమహర్షి ఈ స్వామిని గురించి తపస్సుచేసి వారిదర్శనాన్ని పొంది అనుగ్రహాన్నికూడా పొందడం జరిగింది.

ఇక రెండవది మణిక్కున్నం. ఈ దేవాలయంలో మూలమూర్తి మణిక్కున్నమ్ పెరుమాళ్ అంబుజవల్లి అమ్మవారితో కూడినవారై, శ్రీరామతీర్థతీరంలో మణితో కూడిన విమానంతో తూర్పు దిక్కున నిలుచున్నభంగిమలో దర్శనాన్ని కలిగిస్తున్నారు. మార్కండేయమహర్షి భగవంతుని అనుగ్రహాన్నికోరి తపస్సు చేసి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు.

ఇక మూడవది తంజైయాళినగర్. ఇక్కడకూడా స్వామి తూర్పుభంగిమలో నరసింహస్వామిగా తంజనాయకితో శ్రీరామతీర్థం సూర్యపుష్కరిణితీర్థంతో వేదసుందరవిమానంతో నిలుచున్నభంగిమలో భక్తులను అనుగ్రహిస్తున్నాడు.

మార్కండేయమహర్షి ఏ స్వామివారిగురించి తపస్సు చేసి వారిని ప్రత్యక్షం చేసుకున్నారో ఆ స్థలపురాణం- వ్యాస మహర్షి పౌత్రుడు, శక్తి కుమారుడు పరాశరమహర్షి భగవంతుడి అనుగ్రహాన్ని పొందడానికై ఈ దివ్యదేశం వచ్చి చేరారు. ఎన్ని కష్టాలొచ్చినా, ఎన్ని ఆటంకాలొచ్చినా తమ మనోరథం సిద్ధించేవరకు తపస్సును వదిలిపెట్టకుండా చేయాలని చాలా దృఢమైనవిశ్వాసంతో ఆరోగ్యం క్షీణించినాకూడా తపస్సును మధ్యలో వదిలిపెట్టకూడదు అని సంకల్పించుకొని దేవలోకం నుండి అమృతాన్ని ఈ స్థలంలోని పుష్కరిణిలో చేర్చడం జరిగింది. దానిఫలంగా ప్రతినిత్యం ఆ పుష్కరిణిలో స్నానం చేయడం. అలాగే తన తపస్సు ఎలాంటి ఆటంకం కలగకుండా జరుగుతోంది. పలుసంవత్సరాలు అలా గడిచాయి. పరాశర మహర్షి తపస్సులోనే మునిగిపోయారు. ఆ సందర్భంలో అన్ని చోట్లకూడా దుర్భిక్షం ఏర్పడింది. దాదాపు 12సంవత్సరాలు ప్రజలందరూ కష్టాలుపడ్డారు. విచిత్రమేమంటే పరాశర మహర్షి చేసిన ఆ ప్రదేశంమాత్రం సుభిక్షంగా ఉన్నదట. అక్కడున్న ప్రజలందరూకూడా ఎటువంటి ఆకలిబాధలేకుండా సంతోషంగా ఉన్నారట.

దీనిని తెలుసుకున్న తంజగం, దండకం, దారకం అనే ముగ్గురురాక్షసులు ఈ మహర్షి తపస్సుచేసే ప్రదేశానికి వచ్చి అక్కడున్న పుష్కరిణిలో స్నానంచేసి మంచిబలాన్ని పొంది మరణం లేనటువంటి జీవితం తమకు కావాలని పరమశివుడి గురించి తపస్సుచేసి, శివుణ్ణి ప్రత్యక్షం చేసుకున్నారు. శివుడు








ఆనందాన్ని మించిన అందాన్నిచ్చే సౌందర్యసాధన మరొకటి లేదు



అటువంటివరాన్ని మహావిష్ణువు తప్ప ఇక ఎవ్వరు ఇవ్వలేరని చెప్పాడు. వీరు ముగ్గురురాక్షసులు తపస్సుచేయడం జరిగింది. శివుడుకూడా నావల్ల మీకు మరణం సంభవించదన్నాడు. వాళ్ళు ముగ్గురూ దురహంకారంతో మహర్షులను, దేవతలను, ప్రజలను అందరినీకూడా హింసిస్తూన్నారు. అందులో పరాశర మహర్షికూడా ఒకరు.

అమృతమయమైన ఆ పుష్కరణినీటిని త్రాగినందువల్ల వీరికి ఇంతబలం కలిగింది. దానిక్కారణం తానే అని పరాశర మహర్షి మిక్కిలి బాధపడ్డాడు. భగవంతునితో మొరపెట్టుకొన్నాడు. భగవంతుడు తన భక్తుని కష్టాన్ని చూడలేక తన వాహనం గరుత్మంతుణ్ణి ఆ ముగ్గురురాక్షసులని చంపడానికై పంపించాడు. వారితో పోట్లాడిన వైనతేయుడు వాళ్లని చంపలేకపోయాడు. కారణమేమిటంటే వాళ్లు తీసుకున్నటువంటి ఆ నీరు. అలాగే స్నానంకూడా చేసిన వారయ్యారాయె. అయ్యో! ఇలా అయిపోయిందేమా అని పరాశరమహర్షి మళ్లీ భగవంతుణ్ణి శరణాగతి చేశాడు. దివ్యతేజోమయంగా భగవంతుడు కనిపించి పలుసార్లు ఆ తంజకుణ్ణి సంహరించాడు. అతడు తిరిగి ప్రాణాన్ని పొందుతూన్నాడు. ఈ రహస్యాన్ని తెలుసుకున్న భగవంతుడు హంసరూపాన్ని స్వీకరించి ఆ నీటితోపాటు అందులోని అమృతాన్ని వేరుచేసి త్రాగాడు. అప్పుడు ఆ నీటిలో అమృతం లేదు కనుక ఈ తంజకుడు ఆ పుష్కరిణిలో స్నానంచేసి పైకివచ్చి పోరాడాడు. భగవంతునిచేత చంపబడ్డాడు. తరువాత తంజకుడు స్వామివారిని శరణాగతిచేశాడు. తనకు ముక్తిని ప్రసాదించుమని ప్రార్థించాడు. భగవంతుడు అతణ్ణి అనుగ్రహించాడు. ఈ వృత్తాంతాన్ని అనుసరించే తంజావూర్ అనేపేరు ఆ పట్టణానికి కలిగింది.

ఇలా నీలమేఘస్వామి తంజకుణ్ణి సంహరించడం చూసి, దండకుడు స్వామితో పోరాడ్డానికి సిద్ధమయ్యాడు. స్వామి బలానికి భయపడి పాతాళానికెళ్లి దాక్కున్నాడు. దీనిని తెలుసుకున్న శ్రీపతి పాతాళానికెళ్లి ఆ దండకంను వెంటాడాడు. అతడు గజరూపాన్ని ధరించి వరాహ భగవంతుణ్ణి ఎదిరించాడు. మాయావి అయిన భగవంతుడు వరాహస్వరూపాన్ని త్యజించి సింహరూపాన్ని ధరించి అతణ్ణి సంహరించాడు కనుక నీలనరసింహస్వామిగా అర్చాస్వరూపంతో దేవదేవుడు భక్తులను అనుగ్రహించాలని ప్రార్థించాడు. అదేప్రకారం ఈనాటికికూడా సింహరూపంగా భగవంతుడు దర్శనాన్ని కలిగిస్తున్నారు.

చివరగా ఇద్దరు అన్నలు మరణాన్ని పొందిన వృత్తాంతాన్ని తెలుసుకున్న దారకుడు కోపంతో లోకాన్నంతటినీకూడా అంధకారమయం చేశాడు. ఈ సమయంలో భగవంతుడు తేజోమయుడై రత్నగిరిగా స్వరూపాన్ని స్వీకరించి అతణ్ణి సంహరించడం జరిగింది. అందువల్ల ఇచ్చట స్వామిమణిక్కున్నపెరుమాళ్గా దర్శనమిస్తున్నాడు. ఇలా ఈ ప్రకారంగా అద్భుతమైన స్థలపురాణంతో వైఖానసాగమంప్రకారం మూడుదేవాలయాల దేవుళ్ళూ ఒకే దివ్యదేశంగా కీర్తించబడి ఈనాటికికూడా భక్తులకు అనుగ్రహాన్నిస్తున్నారు. పూదత్తాళ్వార్, తిరుమంగైయాళ్వార్లు మంగళాశాసనం చేశారు. ఈ స్వామిని దర్శించుకున్నవారు సమస్తపాపాలు పోగొట్టుకొని భగవంతుని అనుగ్రహంతో దీర్ఘాయుష్షుతో జీవించి ఉంటారని స్థలపురాణకథనం.


సప్తగిరి పాఠకులకు, ఏజెంట్లకు,
శ్రేయోభిలాషులకు
**దీపావళి శుభాకాంక్షలు**
- ప్రధాన సంపాదకుడు



## శ్రీపద్మావతీఅమ్మవారి బ్రహ్మోత్సవాలు, తిరుచానూరు

**2023, నవంబరు 10 నుండి 18 వరకు**

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 10-11-2023 | శుక్ర | తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | చిన్నశేషవాహనం |
| 11-11-2023 | శని | పెద్దశేషవాహనం | హంసవాహనం |
| 12-11-2023 | ఆది | ముత్యపుపందిరివాహనం | సింహవాహనం |
| 13-11-2023 | సోమ | కల్పవృక్షవాహనం | హనుమద్వాహనం |
| 14-11-2023 | మంగళ | పల్లకీ ఉత్సవం, సా॥వసంతోత్సవం | గజవాహనం |
| 15-11-2023 | బుధ | సర్వభూపాలవాహనం | గరుడవాహనం |
| 16-11-2023 | గురు | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 17-11-2023 | శుక్ర | రథోత్సవం | అశ్వవాహనం |
| 18-11-2023 | శని | పల్లకీ తిరుచ్చి ఉత్సవం, తీర్థవారి అవభృథము, చక్రస్నానం, పంచమీతీర్థం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం |

**గ్రంథసమీక్ష**

# శ్రీవేంకటేశ తాపిన్యుపనిషత్

**(ప్రప్రథమంగా తెలుగులో అనువాదం మరియు వ్యాఖ్య)**

అనువాదకులు-పండిత వి.గిరిధర్‌కుమార్; వ్యాఖ్యాత-డా॥ చెరువు వేంకటసాంబమూర్తి, పుటలు- 111; వెల-అమూల్యం, ప్రతులకు- పూతలపట్టు అనసూయదేవి, ప్లాట్ నెం.67, సూర్యఎన్‌క్లేవ్, తిరుమలగిరి, హైదరాబాద్-500 015. ఫోన్-97002 55738.

శ్రీవేంకటేశ తాపిన్యుపనిషత్, పూర్వఉత్తరభాగాలుగా అధర్వణవేదంలోని మంత్రరహస్యవిభాగంలో అంతర్భాగంగా కనిపిస్తుంది. పూర్వభాగంలో ఐదుప్రపాఠకాలు. మొదటి రెండు ప్రపాఠకాలు 'జనకశాకాయన్య'లకు సంబంధించినవి. ఈ రెంటిలో బ్రహ్మవిద్యసాధన, పరబ్రహ్మతత్త్వానుగ్రహంగురించిన అంశాలున్నాయి. పూర్వభాగంలోని చివరి అయిదవప్రపాఠకంలో శ్రీవేంకటేశ్వరస్వామి పరమాత్మస్వరూపుడైన పరబ్రహ్మ ఆ పరబ్రహ్మమే, విష్ణుతత్త్వమే వైకుంఠంలో శ్రీదేవీసమేతలక్ష్మీనారాయణుడుగా భూలోకంలో తిరుమలలో భూదేవీసమేత పద్మావతీ వేంకటేశ్వరుడై ఉన్నాడనే అంశాలున్నాయి. ఉత్తరభాగంలో శ్రీవేంకటేశ్వరుడు తన తత్త్వాన్ని మంత్రరూపంగా సంపూర్ణంగా తెలియజేసినట్లు వివరింపబడింది.

శ్రీవేంకటేశ్వరుడు సర్వదేవతాసమన్వయమూర్తి అని ఈ ఉపనిషత్తులో ప్రతిపాదితం. ఈ కోణంలోనే ఈ వ్యాఖ్యానం ఆద్యంతం సాగింది. రచయిత పరిశోధనాత్మకరంగంలోనివారు కనుక ఈ ఉపనిషత్‌ప్రకటనకుముందు 9 ప్రామాణికప్రతులను శ్రద్ధగా చూచి చిత్తశుద్ధితో శ్రమించారనడంలో సందేహం లేదు.

ఈ ఉపనిషత్తుకు అనుబంధంగా ఇచ్చిన 7 పట్టికలు, సామాన్య చదువరులనుకూడ పుస్తకం పూర్తిగా చదవాలనే ఆకాంక్షను రేకెత్తిస్తాయి. 7వ అనుబంధంలోని 'అరాయికాణే' అనడానికి ఇచ్చిన వివరణ చాలాబాగుంది. స్వామి 'క'కార వాచ్యుడనడానికి ప్రామాణికంగా శ్రీవేంకటేశ్వరసహస్రనామంలోని 'క' నామాలు. శ్రీవిష్ణుసహస్రనామస్తోత్రంలోని 'క' నామాలు, శ్రీలలితాసహస్రనామంలోని 'క' నామాలు, శ్రీలలితాత్రిశతిలోని 'క' నామాలు, కః అక్షరవివరణ లాంటివి రచయిత శ్రమను పట్టిస్తాయి. శ్రీవేంకటేశ్వరుడు సర్వదేవతాసమన్వయమూర్తి అని నిరూపించిన తీరు అత్యద్భుతం. ఇది రచయిత 'పరిశీలనాసక్తికి' గీటురాయి.

- ఆచార్య కె.సర్వోత్తమరావు.



ఒక అందమైనపనిముందు ప్రపంచపు అన్ని అందమైన భావనలూ దిగదుడుపే!




# ఆనందం! బ్రహ్మానందం!!

- శ్రీ కాశీరాజు వేంకటేశ్వరరావు, 99492 96926

**నా** పేరు కాశీరాజు వేంకటేశ్వరరావు. స్వామి కరుణ ఎలా ఉంటుందో, సప్తగిరి పాఠక సోదర, సోదరీమణులతో పంచుకోవాలనేదే నా ఆశ.

ఓ రోజు మా నివాసానికి దగ్గరలో ఉన్న రిలయన్స్ ఫ్రెష్‌షాపుకు వెళ్ళాను. అక్కడ ప్లాస్టిక్‌బుట్టలో ఉన్న బొప్పాయి కాయను తీస్తుండగా, నా బంగారుఉంగరం, స్వామివారిరూపుతో ఉన్నది, నాకు తెలీకుండానే జారి బుట్టలో అడుగున పడి పోయింది. నేను హడావుడిగా కాయ తీసుకొని ఇంటికి వచ్చే శాను. ఆ తర్వాత మా ఇంట్లో నేను ఉంగరం పెట్టేచోటు అంతా వెతికాను. ఎక్కడా కనబడలేదు. నా శ్రీమతి, కోడలు ఇల్లంతా వెతికారు. ఎక్కడపోయిందోనే అంటూ అందరం చాలా విచార పడ్డాం. ఆ రాత్రి ఎవరికి నిద్రకూడా సరిగా పట్టలేదు. నాకైతే ఏమి అపచారం జరిగిందోనని స్వామికి అపరాధకానుక చెల్లిస్తా నని మొక్కుకుని పడుకున్నాను.

ఆ మరురోజు ఉదయం సంధ్యావందనసమయంలో కూడా అర్ఘ్యం, తర్పణాల్లో ఉంగరం లేకుండా చేయటం



మనస్సుకు ఎంతో బాధగా అనిపించింది. అనుష్ఠానం, ఫలహారం ముగించిన తర్వాత నా శ్రీమతి నాతో మరల రిలయన్స్‌ఫ్రెష్ షాపులో బొప్పాయికాయలబుట్టలో వెతకమని సలహా ఇచ్చింది. నాకు కనబడుతుందని అంతగా నమ్మకం లేకపోయినా, ఆవిడ సలహాప్రకారం ఉదయం షాపుకు వెళ్లాను. బుట్టలో కాయలన్నీ కదిలించి చూశాను. స్వామిరూపున్న బంగారుఉంగరం తల క్రిందులుగా అనగా స్వామిరూపు క్రిందివైపు, మిగిలినభాగం పైవైపున, బుట్టలో అడుగున సందులో ఇరుక్కుని జాగ్రత్తగా ఉన్నది. ఒక్కసారిగా నా కళ్లు ఆనందంతో చెమర్చాయి.

నన్ను నేనే నమ్మలేనిస్థితికి వచ్చి మెల్లగా, జాగ్రత్తగా ఆ ఉంగరం తీసి చూశాను. నా ఆనందానికి అవధులు లేవు. 24గంటలపాటు, బహిరంగప్రదేశంలో, ఎవరికంటా పడ కుండా స్వామి ఆ బొప్పాయిపండ్లున్న ప్లాస్టిక్‌బుట్టలో ఉన్నారంటే, ఇదంతా ఆ స్వామిలీల కాక మరేమిటి చెప్పండి.

వెంటనే ఆనందంతో నా శ్రీమతికి, నా కోడలికి, నా కుమారుడికి చెప్పాను. వారుకూడా ఇదంతా ఆ ఏడుకొండలవాడి లీల మాత్రమే కానీ వేరొకటి కాదన్నారు. ఈ నా ఆనందంతో కూడిన అనుభవం నా జీవితంలో బ్రహ్మానందంగా మిగిలి పోయింది. ఆ స్వామికి నా ప్రణామాలు.

ఆయుర్వేదం

# కరివేప

-డా॥చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

నిత్యజీవితంలో మనం ఎదుర్కొనే అత్యంత సర్వ సాధారణ వివిధ ఆనారోగ్యసమస్యలకు కరివేపాకు ఎలా సద్వినియోగం చేసుకోవచ్చో ప్రస్తుతం తెలుసుకుందాం.

**బొల్లి లేదా తెల్లమచ్చలు తగ్గేందుకు:** కరివేపాకుపొడి, ఆయుర్వే దౌషధవిక్రయశాలల్లో లభ్యమయ్యే సుగంధిపాలపొడి, గుంట గలగర(భృంగరాజ)పొడి, పటికబెల్లంపొడి సమానంగా కలిపి ఉంచుకుని ఉదయం, సాయంత్రం పూటకి 2-3 గ్రా. సేవి స్తుంటే చర్మానికి రంగునిచ్చే మెలనిన్ అనే రంజకపదార్థం ఉత్పత్తిఅయి ఆ సమస్య తగ్గుతుంది.

**కాళ్ళు, చేతులు మంటలు, తిమ్మిర్లసమస్యకు:** కరివేపాకుపొడి, జీలకర్రని వేయించి చేసినపొడి, శుంఠిపొడి సమానంగా కలిపి ఉంచుకుని రెండుపూటలా పూటకు పావుటీస్పూనునుంచి అరటీ స్పూనువరకు తగినంత తేనెకలిపి, షుగర్‌వ్యాధిగ్రస్తులయితే 50మి.లీ. నీటిలో కలిపి సేవిస్తుంటే సత్ఫలితాలు కలుగుతాయి.

**రక్తపోటు నియంత్రణకు:** కరివేపాకు, తులసి, పుదీనా, జీల కర్రని వేయించి చేసిన చూర్ణం, ధనియాలను వేయించిన చూర్ణా లను సమానంగా కలిపి ఉంచుకొని ఉదయం, రాత్రి ఆహారం తర్వాత పూటకు 50మి.లీ. నీటిలో ఒకటీస్పూనుపొడి కలిపి



సేవిస్తుండాలి. ఈ ఔషధసేవనంవల్ల రక్తపోటువల్లకలిగే తల నొప్పి, తల తిరగడం, పైత్యవికారాలుకూడా తగ్గిపోతాయి.

**పసరువాంతులకు:** 25 గ్రా. మిరియాలను 2,3 గంటలసేపు సున్నపుతేటలో నానించి తీసి ఎండించి చూర్ణంచేసి అందులో 25 గ్రా. కరివేపాకుపొడి కలిపి తగినంత నిమ్మరసంతో నూరి శనగలంత మాత్రలుచేసి ఆరించి రోజు మూడుపూటలా ఆహారా నికి 15 నిమిషాలముందు ఒక్కోమాత్ర నీటితో సేవిస్తుండాలి.

**అధికకొలెస్ట్రాల్ తగ్గేందుకు:** రోజూ పరగడుపున 100మి.లీ. గోరువెచ్చనినీటిలో ఒకటీస్పూను కరివేపాకుపొడి కలిపి సేవి స్తుంటే చక్కటిఫలితం కలుగుతుంది.

**మధుమేహనియంత్రణకు:** కరివేపాకుపొడి, మెంతులను వేయించి చేసినపొడి సమానంగా కలిపి ఉంచుకుని రోజూ రెండు సార్లు పూటకు 50మి.లీ. గోరువెచ్చనినీటిలో ఒకటీస్పూను పొడి కలిపి త్రాగుతుండాలి.

**సైనసైటిస్ తగ్గేందుకు:** కరివేపాకుపొడి, పంచదార సమానంగా కలిపి రోజూ రెండుసార్లు పూటకు ఒకటీస్పూనుపొడిని 50మి.లీ. గోరువెచ్చనినీటిలో కలిపి సేవిస్తుండాలి.

**జుట్టు ఒత్తుగా పెరిగేందుకు:** వారానికి 2, 3సార్లు కరివేపాకు, మందారపూలు సమానంగా తీసుకొని కొద్దిగా నీరుచేర్చి మెత్తగానూరి పేస్టుచేసి తలకి పట్టించి గంటసేపాగి తలస్నానం చేస్తుంటే శిరోజాలు ఒత్తుగా, మృదువుగా, సౌందర్యవంతంగా పెరుగుతాయి.

**త్రిదోషాలు సమస్థితికి వచ్చేందుకు:** ఎండిన కరివేపాకును నేతితో వేయించి చేసినపొడి 50గ్రాములు, జీలకర్ర, ధనియాలని వేయించి చేసిన చూర్ణాలు ఒక్కొక్కటి 10గ్రా, సైంధవలవణ చూర్ణం 10గ్రాములు, లవంగాలచూర్ణం 5గ్రాములుకలిపి ఉంచు కుని రోజు ఒకసారి భోజనసమయంలో ఆహారంలో మొదటి ముద్దలో 2-3 గ్రా. పొడి కలిపి సేవిస్తుంటే ప్రకోపించిన వాత పిత్తశ్లేష్మదోషాలు సమస్థితికి వచ్చి వ్యాధులు త్వరగా తగ్గుతాయి.

**రక్తవృద్ధికి:** రోజూ ఒకసారి 200మి.లీ.నీటిలో 25గ్రా. నల గ్గొట్టిన కరివేపాకులు, 15ఎండుద్రాక్షలనువేసి గంటసేపు నానించి అరటీస్పూన్ తాటికలకండ లేదా పటికబెల్లంపొడి కలిపి కొద్దిసేపు మరిగించి వడగట్టి గోరువెచ్చగా త్రాగుతుంటే రక్తవృద్ధి జరిగి నీరసం, నిస్త్రాణ తగ్గుతాయి.



తెలివైన, నమ్మకమైన మిత్రునికంటే మంచి సంబంధమేదీ లేదు

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి

**మేషం–** ఆధ్యాత్మికవిషయాలకు ప్రాధాన్యత పెరుగుతుంది. పిల్లలచదువులపై శ్రద్ధ చూపుతారు. వారి జయజయాలు సంతృప్తినిస్తాయి. కాలం కలసివస్తుంది.

**వృషభం–** గృహయోగం కల్గుతుంది. గృహాలంకరణవస్తువులు, వస్త్రలాభాలుంటాయి. మనస్సు నిర్మలంగా ఉంటుంది. వ్యాపారాలు కలసివస్తాయి.

**మిథునం–** ప్రయాణాలు లాభదాయకంగా ఉంటాయి. ప్రియమైనవారితో సమయాన్ని గడపడానికికూడా మీకు అవకాశం లభిస్తుంది. గృహనిర్మాణాలు కలసివస్తాయి. అందమైన, ఆహ్లాదకరమైన నూతనగృహంలో నివాసయోగం కల్గుతుంది.

**కర్కాటకం–**మీకు నూతన వస్తువస్త్రాభరణ సౌఖ్యం కల్గుతుంది. మీరు కుటుంబంతో వినోదఅవకాశాలు, ద్రవ్యలాభాలు మరియు ప్రభుత్వంనుండి ఆదాయం పొందుతారు. నవరత్నాల ఆభరణాలు కొనుగోలు చేసే అవకాశముంది.

**సింహం–** మీరు కుటుంబంతో విందు వినోదాల్లో పాల్గొంటారు. ప్రభుత్వంనుండి ఆర్థిక లాభాలు పొందుతారు. శత్రువర్గంపై జయం సాధిస్తారు. శుభవార్తలు వింటారు.

**కన్య–** దూరప్రయాణాలవిషయాల్లో అప్రమత్తత అవసరం. జన్మరాశిలో శుక్రసంచారంవల్ల సంపదవృద్ధి, ఆనందం, విద్యలో విజయం, వివాహ అవకాశాలు, వినోదం మరియు వ్యాపారంలో వృద్ధిని పెంచుతాయి.

**తుల–** మీ ఆదాయం పెరుగుతుంది. మీ సహోద్యోగులు మరియు స్నేహితులనుండి చాలా ప్రశంసలు పొందుతారు. దీర్ఘకాలిక ప్రణాళికలు, లక్ష్యాలు నెరవేరుతాయి. అధ్యాత్మికజ్ఞానాన్ని పొందుతారు.

**వృశ్చికం–** వ్యాపారంకోసం విదేశాలకు వెళ్లే అవకాశాలొస్తాయి. శ్రమించి కార్యాన్ని పూర్తి చేస్తారు. సృజనాత్మకంగా ప్రతిభాపాటవాలను కనబరుస్తారు.

**ధనుస్సు–** సంస్థలకు ఆధిపత్యం వహించి లాభాలబాటన నడుపుతారు. ఈ సమయంలో మీరు అన్నివర్గాలనుంచి గౌరవాన్ని పొందుతారు. ఆరోగ్యవిషయాలకుకూడా ఇది మంచికాలం. అనునిత్యం కృషిచేస్తూ ప్రగతి సాధిస్తారు.


**మకరం–** అధికారవృద్ధి కల్గుతుంది. వృత్తి ఉద్యోగాల్లో చలామణి అవుతారు. దైవికకార్య క్రమాల్లో పాల్గొనటం జరుగుతుంది. వ్యాపారాల్లో లాభాలను ఆర్జిస్తారు. సామాజికంగా గుర్తింపు వస్తుంది.

**కుంభం–** గ్రహస్థితి మిశ్రమంగా ఉంటుంది. కళాపోషణకు విలువ ఇచ్చి ధనం ఖర్చు చేస్తారు. నూతనవ్యాపారాలకు, పెట్టుబడులు కలసి రాని కాలమిది.

**మీనం–** ఆర్థికవిషయాలు గతంకంటే అనుకూలంగా ఉంటాయి. సంతానం విజయాలు సాధిస్తారు. వారికి పురోగమనం కలుగుతుంది. పుణ్యక్షేత్రాలు తిరిగే అవకాశముంది.

మనవద్ద మంచి తెలివితేటలుంటే పరిశ్రమ దానిని అభివృద్ధిపరుస్తుంది

విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



## లేనివాడు ఏమీ లేనివాడు

కలిగినమనుజుండు కాముడు సోముడు
మిగుల తేజమునను మెరయుచుండు;
విత్తహీను డెంత రిత్త యై పోవును;
విశ్వదాభిరామ! వినురవేమ!

**అర్థాలు:** కాముడు= మన్మథుడు; సోముడు= చంద్రుడు; (వీరిద్దరూ అందగాళ్లు) తేజము= కాంతి; విత్త విహీనుడు= ధనం లేనివాడు; రిత్త= ఊరక.

**భావం:** డబ్బున్నవాడు మన్మథుడు. చంద్రుడు. వాడే గొప్పతేజస్సుతో ప్రసిద్ధుడవుతాడు. ధనహీనుడు ఏమీ లేనివాడుగా ఉండిపోతాడు.

**వివరణ:** లోకంలో సంపద ఉంటే అన్నీ ఉన్నట్లే. ఎంత వికారంగా ఉన్నా డబ్బున్నవాడిని గొప్పఅంద గాడు, మన్మథుడు అంటారు. దుర్మార్గుడైనా డబ్బు ఉంటే మంచివాడు, చంద్రుడిలాగా చల్లగా కాపాడుతాడు అంటారు. గొప్పతేజస్సు కలిగినవాణ్ణి పరాక్రమవంతుడు, లోకనాయకుడు అంటారు. ఇలా ఉన్నవాడు అంటే ధనం ఉన్న వాడు. వాడే అన్నీ ఉన్నవాడు. ఇక లేనివాడు అంటే డబ్బు లేనివాడనే వ్యవహారం. డబ్బు లేకపోతే వాడు ఏమీ లేనివాడు. అందం, గుణం ఇంకా ఎన్ని మంచిలక్షణాలు ఉన్నా డబ్బు లేకపోతే ఏవీ లేనట్లే. సంపద ఉన్నంత మాత్రాన గౌరవానికి తగడనీ, పేదవాడైనా, గుణవంతుడు మాత్రమే గౌరవార్హుడనీ తాత్పర్యం. "సర్వే జనాః కాంచన మాత్ర యంతి".

– *కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు*

భాస్కరశతకం

## సుజ్ఞాని- అజ్ఞాని

ఎడ్డెమనుష్యుఁడేమెఱుఁగు నెన్నిదినంబులు గూడియుండినన్,
దొడ్డ గుణాఢ్యునందుఁగల తోరపు వర్తనల్లఁ బ్రజ్ఞ బే
ర్పడ్డ వివేక రీతి; రుచిపాకము నాలుక గాకెఱుంగనే ?
తెడ్డది కూరలోఁ గలయ ద్రిమ్మరుచుండినసైన భాస్కరా!



మూఢాత్ముడు గుణవంతునివెంట తిరుగు తున్నాకూడా అతని సద్గుణములతో కూడిన నడ వడికలు గుర్తించలేడు. జ్ఞాని గుర్తించగలడు. ఎట్ల నగా కూరలో తిరుగుచున్న తెడ్డు ఆ రుచిని గుర్తించ లేదు. కూరయొక్క రుచి నాలుక గుర్తిస్తుంది. అలాగే సుజ్ఞాని గుర్తించునని భావం.

– *శ్రీ మారవి వెంకయ్య*

### సెప్టెంబరు నెల క్విజ్-14 సమాధానాలు

01) కాణాచి
02) కన్యామాసం/ ఆశ్వయుజమాసం
03) విష్వక్సేనులు
04) వరాహమూర్తి
05) వరాహస్వామి
06) ఎనిమిదవది (8)
07) వరుణుడు
08) బుద్ధి నుండి
09) కర్దమప్రజాపతి
10) గోవు
11) మాడు
12) సింహాచలం
13) శ్రీపతి
14) గణితసారసంగ్రహం
15) విశాలదృక్పథం
16) పొడవైనముక్కు
17) ప్రకృతి
18) తమాలపత్రం
19) బ్రహ్మాండపురాణం
20) ధార్మికతకు అంతరాత్మ

ఈ క్విజ్-14కు సరైన సమాధానాలు రాలేదు.

పాఠం-25

# సంస్కృతం నేర్చుకుందాం..!!

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య నిర్వహణ- కీ.శే. మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

| | |
|---|---|
| कूपः | = బావి |
| रामठम् | = ఇంగువ |
| लवणम् | = ఉప్పు, ఉప్పుగా, ఉప్పుని |
| गमनम् | = వెళ్ళుట |
| खादित्वा | = తిని |
| खादितुम् | = తినన్, తినుటకు |
| कर्तुम् | = చేయన్, చేయుటకు |
| आगमनम् | = వచ్చుట |

गच्छति नयति आगच्छति

## అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?

01) बालकः अस्मद्गृहे अन्नं खादित्वा गृहम् अगच्छत्।

02) अहं कूपस्य आरान् स्नानं कर्तुम् अगच्छम्।

03) त्वं कुत्र खादितुं गच्छसि?

04) कुत्रापि न गच्छामि।

05) अरे! युष्मद्गृहे लवणमस्ति रे?

06) लवणं किञ्चिदस्ति।

07) तर्हि शाकं कथं करिष्यसि?

08) शाके लवणं किमर्थं रे?

09) लवणं नास्ति चेत् शाकं सम्यक् न स्यात्।

10) अतः त्वं स्नानं कृत्वा शीघ्रं भोजनं कुरु।

### అ) జవాబులు

01) బాలుడు మా ఇంటిలో అన్నం తిని ఇంటికి వెళ్లాడు.

02) నేను బావిదగ్గర స్నానం చేయడానికి వెళ్ళాను.

03) నీవు తినటానికి ఎక్కడికి వెళతావు?

04) ఎక్కడికీ వెళ్ళను.

05) ఓయ్! మీ ఇంట్లో ఉప్పు ఉందా?

06) ఉప్పు కొద్దిగా ఉన్నది.

07) అయితే కూర ఎలా చేస్తావు?

08) కూరలో ఉప్పు ఎందుకు?

09) ఉప్పు లేకపోతే కూర బహుశా బాగుండదు.

10) అందువల్ల నీవు స్నానం చేసి వేగంగా భోజనం చెయ్యి.

## ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) నీవు మీ తండ్రిని ఎక్కడికి తీసికొని వెళ్తున్నావు?

02) నేను మా తమ్ముని ఇంటికి తీసుకొని వెళ్తున్నాను.

03) అక్కడికెందుకు?

04) భోజనం చేయటానికి.

05) అక్కడ అన్నం తిని ఇక్కడ ఉండుము.

06) మీ తమ్ముడెక్కడ ఉన్నాడు?

07) వాడు మా ఇంట్లో ఉన్న బావినీటితో స్నానం చేస్తున్నాడు.

08) మీ బావిలో నీరున్నదా?

09) కొంచెమున్నది గాని ఆ నీరు బాగాలేదు.

10) అయితే అక్కడ ఎలా స్నానం చేస్తున్నాడు?

### ఆ) జవాబులు

01) त्वं तव पितरं कुत्र नयसि?

02) अहं मम अनुजस्य गृहं प्रति नयामि।

03) तत्र किमर्थम्?

04) भोजनकरणार्थम्।

05) तत्र अन्नं खादित्वा अत्र वस।

06) तव अनुजः कुत्र अस्ति?

07) सः अस्मद्गृहे कूपे स्नानं कुर्वन् अस्ति।

08) युष्मद् कूपे जलमस्ति वा रे?

09) किञ्चिदस्ति परं सम्यक् नास्ति।

10) तर्हि तत्र कथं स्नानं करोति?

చిత్ర కథ


# పద్మవ్యూహం


కథ- శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- శ్రీ కె.తులసీప్రసాద్


అర్జునునికి సుభద్రకి పుట్టిన కుమారుడు అభిమన్యుడు. శ్రీకృష్ణునివద్ద పెరిగి పెద్దవాడయ్యాడు. సాటిలేని వీరుడు. కురుక్షేత్రంలో యుద్ధం పదమూడోరోజుకి చేరింది. ద్రోణుడు సైన్యాధిపతిగా పద్మవ్యూహాన్ని పన్నాడు. రారాజుతో ద్రోణుడు...




పద్మవ్యూహం మాట వినగానే ధర్మరాజు కలవరపడ్డాడు. తర్వాత తేరుకుని అభిమన్యుడితో ధర్మరాజు...





అభిమన్యుడు పద్మవ్యూహంలో ఒంటరిగా ఉండిపోయాడు. అయినా, ధైర్యంగా పోరాడుతున్నాడు. శత్రువుల్ని చెండాడుతున్నాడు. వీరులు..
అమ్మో! అభిమన్యుడు... అమ్మో చంపేస్తున్నాడు..
రణరంగంలో వీరులందరూ వణికిపోతున్నారు. కర్ణుడులాంటి వీరులుకూడా అభిమన్యుడిధాటికి తట్టుకోలేక పారిపోతున్నారు. ద్రోణాచార్యుడు అభిమన్యుని పరాక్రమాన్ని చూసి...
ఈ రెండుసైన్యాల్లో అభిమన్యుడితో సమానుడైన వీరుడు లేడు
దుర్యోధనుడికి బాగా కోపమొచ్చింది. పుత్రశోకంకూడా తోడైంది.
అందరూ కలిసి అభిమన్యుణ్ణి చంపండి... చంపండి...
ద్రోణుడి అంగీకారంతో అందరూ అధర్మయుద్ధానికి దిగారు. రారాజు....
అతిరథులు, మహారథులు మూకుమ్మడిగా దాడి చెయ్యండి. బాణవర్షం కురిపించండి రథం విరగ్గొట్టండి.. సారథిని... గుర్రాన్ని చంపండి...
ఒళ్లంతా గాయాలు. ఆయుధం లేదాయె. అలసటొకపక్క. ఐనా, అభిమన్యుడు గదతో దుశ్శాసనుడికుమారుడితో తలపడి మరణించాడు. వీరమరణం పొందాడు.
అమ్మా....! అమ్మా!!
సూర్యుడు పడమటిదిక్కున వాలిపోయాడు. బాలభానుడు అస్తమించాడు.
శాంతిః శాంతిః
సర్వే జనాః సుఖినో భవన్తు

# బాలవినోదం

## తెలుసుకుందాం!!



### కులశేఖరప్పడి
### (కులశేఖర సోపానం)

కులశేఖరాళ్వారు 767వ సంవత్సరంలో, కేరళదేశం (కొల్లి నగరం)లో, పరాభవనామసంవత్సరం, కుంభమాసం, శుక్రవారం రోజున, పునర్వసునక్షత్రంలో, విష్ణుమూర్తి కౌస్తుభమణిఅంశతో జన్మించారు. వీరు పెరుమాళ్‌తిరుమొళి ప్రబంధాన్ని రచించారు. వీరి బిరుదులు కేరళయోగి, కౌస్తుభాంశయోగి. వీరు 67సం॥లు జీవించి స్వామిలో ఐక్యమయ్యారు.

పై తెల్పిన సారాంశంలోని విషయం చదివి సరియైన సమాధానాలను ఖాళీగడుల్లో క్రిందినుండి పైకి పూరించండి.

10) జీవితకాలం
జ)..............................

09) బిరుదులు
జ)..............................

08) ప్రబంధం
జ)..............................

07) అంశ
జ)..............................

06) నక్షత్రం
జ)..............................

05) దినం
జ)..............................

04) మాసం
జ)..............................

03) సంవత్సరం
జ)..............................

02) జన్మస్థలం
జ)..............................

01) జననం
జ)..............................



సమాధానాలు:
1)767వ సం॥ 2)కేరళదేశం(కొల్లి నగరం) 3)పరాభవనామ సంవత్సరం 4)కుంభమాసం 5)శుక్రవారం 6)పునర్వసు నక్షత్రం 7)కౌస్తుభమణి 8)పెరుమాళ్ తిరుమొళి 9)కేరళయోగి, కౌస్తుభాంశయోగి 10)67సం॥లు

## మీకు తెలుసా?



01) తిరుమలస్వామికి గర్భగుడిలో పై కప్పుకు కట్టే పట్టువస్త్రం పేరు?
02) కోయిలాళ్వార్ తిరుమంజనంనాడు స్వామికి తొడిగే వస్త్రం పేరు?
03) స్వామి నుదుటినామంపేరు?
04) పట్టువిసనకర్రపేరు?
05) పచ్చకర్పూరంపేరు?
06) కుంకుమపూవుపేరు?
07) రాత్రి నిద్రించిన హుండీకిగలపేరు?
08) దేవస్థానానికి చలానాలరూపంలో చెల్లించే నగదుకుగల పేరు?
09) దేవుని వస్తువులుంచే గదిపేరు?
10) ఆలయబీగాల గుత్తిపేరు?

సమాధానాలు:
01)కురాళం 02)మలైగుడారం 03)తిరుమణికాపు 04)ఆలవట్టం 05)గంబూరా 06)జాఫ్రా 07)తోకముల్లె 08)ఇరసాల్‌నామా 09)సభరసబేరా 10)లచ్చెన

## గేయం పాడుదాం...

| | | | |
|---|---|---|---|
| అమ్మమాట | ............... | ఆవుపాలు | ............... |
| మల్లెపూవు | ............... | మంచిమాట | ............... |
| చందమామ | ............... | సన్నజాజి | ............... |
| మంచిమనసు | ............... | పావురాయి | ............... |
| పంచదార | ............... | పాలుపెరుగు | ............... |
| దంతాలు | ............... | గోవిందనామం | ............... |
| జాజిపూలు | ............... | జాబిల్లి | ............... |
| జాలిగుండె | ............... | చల్లనైనమంచు | ............... |
| వెన్నెలమ్మ | ............... | వేపపువ్వు | ............... |
| మంచిముత్యం | ............... | పాపాయినవ్వు | ............... |

ఈ ఖాళీల్లో ఒక రంగును తెలిపే పదంతో పూరించి గేయం పాడుదాం. ఆ రంగేంటో కనుక్కోండి!

సమాధానం : తెలుపు

### గబగబా పలకండి!!

ఇరుగుపొరుగు ఎక్కడ?
వినుమా కనుమా ఇక్కడ!!

### సామెత

తల్లికి తగిన బిడ్డ,
ఇంటికి తగిన పందిరి

# రంగుల ప్రపంచం

బాలచిత్రకారులూ!
రంగులు ఉన్న బొమ్మను చూసి, ఆ రంగులనే.. రంగులు లేని బొమ్మకు వేయండి!!







# సంఖ్యావినోదం



| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| | | 1 | 2 | 3 | 4 | 6 |
| | | ↑ | 0 | 4 | 2 | 8 |
| 4 | 2 | 0 | 6 | 5 | 6 | 9 |
| 3 | 4 | 5 | 8 | 4 | 7 | 8 |
| 8 | 2 | 9 | 7 | 3 | 12 | 9 |
| 7 | 1 | 5 | 13 | 12 | 11 | 10 |
| 11 | 8 | 12 | 14 | 17 | 12 | 14 |
| 18 | 16 | 17 | 15 | 16 | | |
| 19 | 10 | 18 | 16 | → | | |





1 నుండి 16 వరకు ఉన్న సంఖ్యలు వరుసగా కలుపుతూపోతే స్వామివారిసారె అమ్మవారిని చేరే మార్గం వస్తుంది.

# పిల్లలూ.. ఈ బొమ్మలో 7 తేడాలు గుర్తించండి!





బాలనీతి

# నేను మాట తప్పను!!

– డా॥ కడప లలిత,
94408 86535

"సత్యంవద" అంటే ఎటువంటి పరిస్థితుల్లోనైనా సత్యమునే పలకాలి. అబద్ధం ఆడరాదు అని దీని అర్థం.

ఒకరోజు ఒక గోపాలకుడు తన గోవులమందను మేతకై అడవికి తీసుకెళ్ళాడు. అప్పుడు ఆ మందలోనుంచి ఒకగోవు దారితప్పి అడవిలోకి వెళ్లింది. అది అడివంతా తిరుగుతూ తిరుగుతూ ఒక పెద్దపులి కంటపడింది. ఆవు సాధుజంతువు, పులి క్రూరమృగం కదా! అప్పుడు ఆవును చూసిన ఆ పులి ఆవుతో ఇలా అంది. ఓయ్! నీవు నా కంటపడ్డావు. నేటితో నీ ఆయువు చెల్లింది. ఈ రోజు నీవే నాకు ఆహారమౌతావు అన్నది. అప్పుడు ఆ గోవు ఇలా అంది. ఓ పులిరాజా! నాకు ఒక చిన్న బిడ్డ ఉంది. నేను వెళ్ళకపోతే నా బిడ్డ దిగులుతో ఏమయిపోతుందో ఏమో? అందుకని నేను ఈరోజు ఇంటికెళ్లి తిరిగి రేపొచ్చి నీ ఆకలి తీరుస్తాను అన్నది.

కాని, దాని మాటలను నమ్మలేదు పులి. నిన్ను నేను నమ్మను. నీవు మళ్ళీ వస్తావని ఏమిటి నమ్మకం? ఈరోజు దొరికిన ఆహారాన్ని వదిలేస్తే నా ఆకలి తీరేది ఎట్లా? అన్నది. అప్పుడు ఆవు నేను మాట తప్పను. సత్యాన్నే చెప్తున్నాను. నేను ఇంటికెళ్లి నా బిడ్డ ఆకలితీర్చి దానికి మంచిమాటలుచెప్పి తిరిగి నేను నీ దగ్గరికి తప్పక వస్తాను. ఆకలితో ఉన్నవారికి ఆహారం కావటంకన్నా పుణ్యం ఏమున్నది? ఇదే నా బిడ్డకు కూడా చెప్పాలి అని ఎన్నోవిధాల వాగ్దానం చేసింది. పులి చేసేదేమీలేక ఆవుమాటలను నమ్మి విడిచిపెట్టింది.


అప్పుడు ఆవు సంతోషంగా ఇంటికెళ్లి, తన బిడ్డకు పాలిచ్చి, ఇలా అంది. నేను ఆకలితో ఉన్న ఒకపులికి ఆహారంగా వెళ్తున్నాను. ఇంకొకరి ఆకలితీర్చటమే పుణ్యం. నీవుకూడా ఆ మార్గంలోనే జీవించు అని ఎన్నో మంచిమాటలను చెప్పింది. తెల్లారినతర్వాత నేను తిరిగి నీకు కనపడనని కూడా చెప్పింది.

మర్నాడుదయమే గోవులమందతో కలిసి అడవిలో ఉన్న పులిదగ్గరకు బయలుదేరింది. ఆవుకోసం వేచిఉన్న పులి ఆవును చూసి ఆవు మంచితనానికి, సత్యవాక్యపరిపాలనకు ఆనందించింది. దానిని వదిలిపెడుతూ నీవు నీ బిడ్డదగ్గరికెళ్లి సంతోషంగా ఉండు అన్నది. అప్పుడు ఆవు పులికి కృతజ్ఞతలు చెప్పి తన బిడ్డపద్దకెళ్లింది.

మనం మానవుల్లోనే ఆదర్శవంతులు ఉంటారనుకుంటాం. కానీ మనుషుల్లోనే కాదు జంతువుల్లో సైతం మంచితనం అనేది ఎలా ఉంటుందో మనకు తెలియచెప్తోంది ఈ కథ. ఇందులో ఆదర్శవంతమైన జీవిగా చెప్పబడ్డది ఆవు. గోవు మంచితనానికి పులిలోని క్రూరత్వంకూడా మాయమయింది. మంచితనం ఎక్కడున్నా, ఎవరిదగ్గరున్నా మనం నేర్చుకోవాలి. గోవును మహాలక్ష్మిగాకూడా పూజిస్తాం.

కారణం సకలదేవతాస్వరూపమైన గోవులోని సత్యతత్వమే. సత్యం ఎప్పుడూ మనల్ని కాపాడుతుంది.

**నీతి**
సత్యమునే పలుకవలెను.
అసత్యము ఆడరాదు అన్నదే ఇందులో నీతి.





పని చేస్తున్నప్పుడే నైపుణ్యం జనిస్తుంది

# క్విజ్ 16

01) 27రకాలహారతివిధానాలు ఏ వేదంలో ఉన్నాయి? జ)..........
02) శుభకార్యాల ఆరంభానికి ప్రధాన ఘట్టమేది? జ)..........
03) సుబ్రహ్మణ్యేశ్వరుడు మన శరీరంలో దేనికి సంకేతం? జ)..........
04) చంద్రసహోదరి అని ఎవరికి పేరు? జ)..........
05) అమ్మవారి కిరీటాన్ని వర్ణన చేసినవారు? జ)..........
06) శివానుగ్రహానికి ముఖ్యమైన పూజ? జ)..........
07) కలియుగవైకుంఠమని ప్రసిద్ధి పొందింది? జ)..........
08) కాంభోజదేశానికి రాజు? జ)..........
09) వ్యక్తిత్వవికాసానికి ప్రాముఖ్యతనిచ్చే గ్రంథం? జ)..........
10) దుష్యంతమహారాజు భార్య? జ)..........
11) రథోత్సవం ప్రస్తావన ఎందులో ఉంది? జ)..........
12) సముద్రతీరాన వెలసిన ఆలయాలకుగల పేరు? జ)..........
13) శుకమహర్షికి మోక్షమార్గగురువు? జ)..........
14) జంతువులలో సైతం మంచితనముంటుందని తెల్పిన జీవి? జ)..........
15) జడభరతుడి తండ్రి? జ)..........
16) శేషశయనుడు ఎవరు? జ)..........
17) మహాభారతానికి మరొకపేరు? జ)..........
18) శ్రీనివాసునికల్యాణానికి ఘనంగా సారె సమర్పించివారు? జ)..........
19) 'కిరీటం' అంటే అర్థం? జ)..........
20) మానవాళికి మోక్షం కల్గించే అతిముఖ్యమైనసేవ? జ)..........

## నియమనిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.
02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.
03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.
04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.
05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-11-2023.
06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.
07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.
08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.
09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.
10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.
11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .......... వయస్సు: ..........
పాఠశాల: .......... తరగతి: ..........
పేరు: ..........
చిరునామా: ..........
..........
..........
.......... పిన్‌కోడ్: ..........
ఫోన్ సంఖ్య: ..........

**జవాబులు చేరాల్సిన చిరునామా**
ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

______________________________

______________________________

______________________________

(పిన్‌కోడ్ తప్పనిసరి) | | | | | | |

సెల్ నెం. | | | | | | | | | | |

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

.................................................... తేది : ..................

ప్రదేశం :

తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 94

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ■ | 2 | | ■ | 3 | 4 | ■ | 5 |
| | ■ | | ■ | 6 | ■ | | ■ | |
| 7 | | ■ | 8 | | | ■ | 9 | |
| | ■ | 10 | ■ | | ■ | 11 | ■ | |
| ■ | 12 | | | ■ | 13 | | | ■ |
| 14 | ■ | | ■ | 15 | ■ | | ■ | 16 |
| 17 | | ■ | 18 | | | ■ | 19 | |
| ■ | ■ | 20 | ■ | | ■ | 21 | ■ | |
| ■ | 22 | | | | ■ | 23 | | ■ |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

### అడ్డం

2)చెట్టుచాటునుండి శ్రీరాముడు ఇతణ్ణి చంపాడు(2); 3)గంగానది ఒడ్డునున గొప్ప శివక్షేత్రం(2); 7)మోసం(2); 8)ముసలివాడు(3); 9)ఈమెతో ఉన్న శ్రీకృష్ణుణ్ణి చూసి ప్రేమమూర్తులుగా ఆరాధిస్తారు(2); 12)వినోదం (3); 13)శివునిభార్య (3); 17)యమునిభార్య (2); 18)ఇంద్రునికొతురు(3); 19)అగ్నిభార్య(2); 22)నేను అనే అభిమానం(4); 23)శునకం శుభాలను కోరితే ఇది పిండాలను కోరుతుంది(2)

### నిలువు

1)రావణాసురునిభార్య(4); 2)వాగ్దేవి(2); 4)అహల్యను గౌతముడు ఇలా ఉండుమని శపించాడు(2); 5)వసిష్ఠునిభార్య(4); 6)మను చరిత్రలో ప్రవరునిపాదాలకు పసరు రాసినవాడు(3); 10)శివపార్వతులు నివసించే లోకం(3); 11)భారతంలోని భాగాలు(3); 14)సూర్యుని భార్య(2); 15)పూర్వం యువరాణులు రాజకుమారుల్ని వరించేందుకు ఇది ఏర్పాటు చేసేవారు(4); 16)గౌతమునిభార్య(3); 20)ఇందులో పడితే బుద్ధికూడా నశిస్తుంది(2); 21) దీనిని నెత్తిమీద ధరిస్తారు(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.



# తిరుచానూరు
# శ్రీపద్మావతీతాయార్ల పుష్పయాగ మహోత్సవం
# (19-11-2023)

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-10-2023 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

